విధుల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు : డీఎంహెచ్‌వో

మనుబోలు: వైద్యసిబ్బంది విధుల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని డీఎంహెచ్‌వో పెంచలయ్య హెచ్చరించారు. సోమవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన అదనపు డీఎంహెచ్‌వో ఎస్‌కే ఖాదర్‌వల్లీ, ఉప వైద్య, ఆరోగ్య అధికారి డా. పి దయాకర్‌తో కలిసి తనిఖీ చేశారు. వచ్చే నెలలో కేంద్ర ఆరోగ్యశాఖ బృందం తనిఖీలు చేయనున్నదని, తప్పనిసరిగా సిబ్బంది విధులు జాగ్రత్తగా నిర్వహించాలని, రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండా లని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు గేయపూజిత, మొహసీనా సుల్తానా, సీహెచ్‌వో రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

నేను విన్నాను.. నేను మరిచాను



గడిచిన ఐదేళ్లలో ఒక డీఎస్సీ లేదు. తీరా రెండు నెలల్లో ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో డీఎస్సీ నోటిఫికేషన్ ప్రకటించినా అందులో ఆశించిన మేర పోస్టులు లేవు. ఇన్నాళ్లు లక్షలాది రూపాయలు వెచ్చించి డీఎడ్, బీఈడీ కోర్సులు పూర్తి చేసిన తమ పరిస్థితి ఏమిటంటూ వైసీపీ ప్రభుత్వంపై యువత మండిపడుతోంది. కేవలం ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతను కప్పిపుచ్చుకోవడానికే డీఎస్సీ అంటూ మభ్యపెట్టిందని వాపోతున్నారు. ఇంతకాలం ఎదురుచూసినా ఉపయోగం లేకుండా పోయిందని వారు కన్నీటి పర్యంతమవుతున్నారు.

- ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో నిబంధనలతో నోటిఫికేషనా!?
- భారీగా తగ్గిపోయిన పోస్టులు
- వైసీపీ సర్కారు తీరుపై అభ్యర్థుల్లో ఆగ్రహం

నెల్లూరు (విద్య), మే 6 : రాష్ట్రవ్యాప్తంగా 35వేల ఉపాధ్యాయ పోస్టులకు కేవలం 6,100 పోస్టులు మాత్రమే భర్తీ చేయాలని నిర్ణయించారు. ఉన్న ఖాళీలను 117 జీఓ ముసుగులో కుదించడంతో పాటు విద్యార్థులు, ఉపాధ్యాయుల నిష్పత్తి తగ్గించారు. దీనికిగాను జిల్లాలో 346 పోస్టులను భర్తీ చేయాలని ప్రకటించారు. ఇందులో ఎస్‌జీటీ, స్కూల్ అసిస్టెంట్, టీజీటీ పోస్టులు మాత్రమే ఉన్నాయి. వేలమంది నిరుద్యోగులు డీఎస్సీ కోసం ఐదేళ్ల నుంచి ఎదురు చూస్తున్నారు. జిల్లాలో కొన్ని పోస్టులు మాత్రమే భర్తీ చేయడంపై వారు తీవ్ర నిరాశకు గురయ్యారు. జిల్లాలో ప్రాథమిక, ప్రాథమి కోన్నత, ఉన్నత పాఠశాలల్లో పెద్ద ఎత్తున ఖాళీలు ఉన్నా భర్తీ చేయకుండా పోస్టులను దాచేయడంపై పలు విమర్శలు వెల్లువెత్తాయి. ఇటీవల డీఎస్సీ ప్రకటన ద్వారా నియామకాలు చేపడుతున్నామని చెప్పినా వాస్తవ ఖాళీల్లో మూడోవంతు కూడా భర్తీ అయ్యే అవకాశం లేకుండా నోటిఫికేషన్ ఇచ్చారని చెపుతున్నారు. అన్ని పాఠశాలల్లో సబ్జెక్ట్ టీచర్ల కొరత, ఎస్‌జీటీల కొరత ఉండటంతో ఈ ఏడాది విద్యార్థుల చేరిక కూడా తగ్గిపోయినట్లు గణాంకాలు చెబుతున్నాయి. అలాగే పలు ఏకోపాధ్యాయ పాఠశాలలు కొనసాగుతుండగా ఈ పాఠశాలల్లో బోధన నామమాత్రంగానే ఉంటోంది. మరికొన్ని చోట్ల సీఆర్పీలు ఉపాధ్యాయులుగా కొనసాగుతుండగా ఆయా ప్రాంతాల్లో మాత్రం పోస్టులను భర్తీ చేసే దిశగా ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు.

● వేలాది మంది నిరాశ

గడిచిన ఐదేళ్లలో డీఎడ్ పూర్తి చేసిన వారు 10వేల మంది, బీఈడీ పూర్తి చేసిన మరో 10వేల మంది కలిపి 20 వేల మంది వరకు నిరుద్యోగులు డీఎస్సీ కోసం ఎదురుచూస్తున్నారు. వీరిలో అత్యధిక శాతం గ్రామీణ, బడుగు, బలహీన వర్గాలకు చెందిన యువత లక్షలాది రూపాయలు వెచ్చించి కోర్సులను పూర్తి చేశారు. ఫిబ్రవరిలో ప్రభుత్వం నామమాత్రంగా డీఎస్సీ ప్రకటన చేయడంతో వేలాదిమంది యువత భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారింది. రాష్ట్ర విభజన తరువాత ఇప్పటి వరకు రెండు డీఎస్సీలు నిర్వహించగా ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత తక్కువ సమయంలో మూడో డీఎస్సీ విడుదల చేసింది. గతంలో తెలుగుదేశం ప్రభుత్వం 2014, 2018లో మెగా డీఎస్సీలు ప్రకటించడంతోపాటు ఉన్న పోస్టులన్నీ బహిర్గత పరచి ఎలాంటి ఇబ్బందులు లేకుండా పోస్టుల భర్తీ ప్రక్రియ చేపట్టారు. కానీ ప్రస్తుత వైసీపీ ప్రభుత్వం మాత్రం నాలుగున్నరేళ్ల తరువాత ఎన్నికల సమయంలో డీఎస్సీని హడావుడిగా ప్రకటించి నిరుద్యోగులను మోసం చేసిందని నిరుద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఉపాధ్యాయ విద్యకు అభ్యర్థులేరీ!?

ఉపాధ్యాయ అర్హత కోర్సులైన బీఎడ్, డీఎల్‌ఈడీలకు అభ్యర్థులు కరువయ్యారు. ఉమ్మడి జిల్లాలో వీరి సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. గడిచిన ఐదేళ్లలో కనీసం 20శాతం కూడా సీట్లు భర్తీ కాలేదంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ కలిపి మొత్తం 30 వరకు కళాశాలలు ఉండగా వీటిలో 6వేల సీట్లు అందుబాటులో ఉన్నాయి. అయితే ఈ ఏడాది 610 మంది మాత్రమే ప్రవేశ పరీక్ష రాశారు. దీంతో ఆయా కళాశాలల ఉనికి ప్రశ్నార్థకంగా మారడంతో కొన్ని కళాశాలలు మూసివేత దిశగా అడుగులు వేస్తున్నాయి. కొన్ని యాజమాన్య కోటాలో ప్రవేశాలపై ఆధారపడుతున్నాయి. ప్రధానంగా డీఎస్సీ ప్రకటన లేకపోవడంతోనే ప్రవేశాలకు అభ్యర్థులు నిరాసక్తత చూపుతున్నారు. వైసీపీ ప్రభుత్వంలో ఒక్క ప్రకటన కూడా వెలువడకుండా మే నెలలో ఎన్నికలు వస్తుండడంతో ఫిబ్రవరిలో షరతులతో కూడిన నోటిఫికేషన్ విడుదల చేశారు. అది కూడా అతి తక్కువ పోస్టులు భర్తీ చేస్తున్నట్లు ప్రకటించారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో 2018లో పోస్టుల మంజూరుకు చర్యలు చేపట్టినా న్యాయపరమైన సమస్యలతో నియామకాల్లో జాప్యం జరిగింది. ఈ క్రమంలో గత ఏడాది 1998, 2008 డీఎస్సీల్లో నష్టపోయిన అభ్యర్థులకు ఎంటీఎస్ విధానంలో అవకాశం కల్పించారు.

● భర్తీకాని సీట్లు..

జిల్లాలో బీఈడీ కోర్సుకు 2,500 వరకు సీట్లు ఉండగా 2021-22లో 605మంది, 2022-23లో 510 మంది, 2023-24లో 400 మంది చేరినట్లు సంబంధిత కళాశాలల యాజమాన్యాలు తెలిపాయి. అలాగే డీఈఈ కోర్సుకు 4వేల సీట్లు అందుబాటులో ఉండగా 2021-22లో 400 మంది, 2022-23లో 310 మంది, 2023-24లో 150 మంది చేరినట్లు తెలిపారు.

డీఎస్సీ కోసం ఎదురు చూస్తున్నాం



ఐదేళ్లుగా డీఎస్సీ నోటిఫికేషన్ కోసం ఎదురు చూస్తున్నాం. వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఒక్క డీఎస్సీ కూడా విడుదల చేయలేదు. మే నెలలో ఎన్నికలు పెట్టుకుని ఫిబ్రవరిలో మొక్కుబడి డీఎస్సీ విడుదల చేశారు. అది కూడా నిబంధనలను కఠినతరం చేస్తూ తక్కువ పోస్టులు విడుదల చేశారు. వేలాది మంది అభ్యర్థులు ఉద్యోగం వస్తుందన్న ఆశతో శిక్షణ పొందుతూ ఆశగా ఎదురు చూసినా నిరాశే మిగిలింది. పాఠశాలలను విలీనం చేసి పోస్టులన్నీ కుదించేశారు. దీనివల్ల యువతకు పూర్తిగా అన్యాయం జరిగింది. రానున్న ప్రభుత్వమైనా మాపై జాలి చూపించి మూసివేసిన పాఠశాలలన్నీ పునరుద్ధరించాలి.

- ఆంజనేయులు, డీఎస్సీ అభ్యర్థి


పోస్టులను కుదించడం బాధాకరం



పదేళ్లుగా నేను డీఎస్సీలో శిక్షణ పొందుతున్నా. ఐదేళ్ల క్రితం డీఎస్సీలో ఒకసారి అవకాశం కోల్పోయాను. మళ్లీ డీఎస్సీ పడుతుందన్న ఆశతో తర్ఫీదు తీసుకున్నా. వేల మంది నిరుద్యోగులు డీఎస్సీ కోసం ఎదురుచూస్తున్నారు. ఇటీవల ప్రభుత్వం నామమాత్రంగా డీఎస్సీ ప్రకటన చేయడంతో నా లాంటి యువత భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారింది. రాష్ట్ర విభజన తరువాత ఇప్పటి వరకు రెండు డీఎస్సీలు నిర్వహించగా వైసీపీ ప్రభుత్వం మాత్రం నాలుగున్నరేళ్ల తరువాత ఎన్నికల సమయంలో డీఎస్సీని హడావుడిగా ప్రకటించింది.

- గిరీష్, డీఎస్సీ అభ్యర్థి

● డీఎస్సీ లేదు.. ఒక్క టీచరు పోస్టూ భర్తీ లేదు!



మన ప్రభుత్వం రాగానే వంద రోజుల్లో మెగా డీఎస్సీ ప్రకటిస్తా. నిరుద్యోగులందరికీ ఉద్యోగాలు కల్పిస్తా.
-గత ఎన్నికల సందర్భంగా నిరుద్యోగులను ఉద్దేశించి జగన్ అన్న మాటలివి.

● తప్పని నిరాస

పాఠశాలల విలీనంతో ఇప్పటికే కొన్ని పోస్టులు రద్దయ్యాయి. హేతుబద్ధీకరణ చర్యలతో ఖాళీల సంఖ్య భారీగా తగ్గింది. కొన్నిచోట్ల ఖాళీలు ఉన్నా అవరోహణ క్రమంలో సర్దుబాటు చేసినట్లు విద్యాశాఖ ప్రకటించింది. ఉపాధ్యాయుల అనుమతితో మిగులు పోస్టులను అవసరమైన సబ్జెక్ట్‌లకు మళ్లించి (కన్వర్షన్) కేటాయింపులు చేయడంతో డీఎస్సీకి ఖాళీలు లేకుండా పోయాయి. 2008కి ముందు బీఈడీ వారికి ఎస్జీటీతో పాటు సహాయక పోస్టులకు పోటీపడే అవకాశం ఉండేది. గత ఏడాది డీఎస్సీలో ఎస్జీటీ పోస్టులను డీఎల్‌ఈడీ (డిప్లొమో ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్) వారికి 30శాతం కోటాను అమల్లోకి తెచ్చారు. తర్వాత వందశాతం కేటాయిస్తూ వచ్చారు. ఈ క్రమంలో చాలామంది న్యాయస్థానాన్ని ఆశ్రయించడం తో 2018 డీఎస్సీ నుంచే బీఈడీలకు రెండు పోస్టులకు అనుమతించారు. ఇప్పటికే బీఈడీ పూర్తి చేసిన అభ్యర్థులు ఎక్కువ సంఖ్యలో ఉండటం, ఉన్నవారికే పోస్టులు తీయకపోవడం, పాఠశాలలు విలీనంతో ఎస్జీటీ పోస్టులు రద్దు కావడంతో కొత్తవారు కోర్సుల్లో చేరడం లేదు.

నియోజకవర్గాల వారీగా ఆది, సోమవారాల్లో పోలైన పోస్టల్ బ్యాలెట్ ఓట్లు			
నియోజకవర్గం	ఓట్లు	పోలైనవి	శాతం
నెల్లూరు సిటీ	2419	1788	73.91
నెల్లూరు రూరల్	4304	3134	72.81
కందుకూరు	1635	1293	79.08
కావలి	2933	2050	69.89
ఆత్మకూరు	2352	1693	71.98
ఉదయగిరి	2336	1677	71.78
సర్వేపల్లి	1268	1603	78,47
కోవూరు	2587	1911	73.86
మొత్తం	19,834	15,149	76.37

రెండోరోజు జోరుగా పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్

హక్కు వినియోగానికి బారులు ● పెరిగిన పోలింగ్‌శాతం

నెల్లూరు (హరనాథపురం); మే 6: ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులు మండుటెండను సైతం లెక్కచేయకుండా రెండోరోజు సోమవారం పోస్టల్ బ్యాలెట్ ఓట్లను వినియోగించుకున్నారు. ప్రతి ఫెసిలిటేషన్ సెంటర్‌లో ఉద్యోగులు, ఉపాధ్యాయులు భారీ సంఖ్యలో క్యూలైన్లలో నిలబడి ఉండటం కనిపించింది. ఆయా సెంటర్లలో ఓటర్లకు మంచినీరు, కుర్చీలు, ఎండ తీవ్రత దృష్ట్యా ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, మందులు అందుబాటులో ఉంచారు. జిల్లా కలెక్టర్ హరినారాయణన్ జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్లలో తిరిగి పోలింగ్ సరళిని పరిశీలించారు. ముఖ్యంగా నెల్లూరు సిటీ, రూరల్, సర్వేపల్లి, కందుకూరు నియోజకవర్గాలో ఓటింగ్ శాతం బాగా పెరిగింది.జిల్లాలో మొత్తం 19,834 పోస్టల్ బ్యాలెట్లు ఉండగా, ఆది, సోమవారాల్లో 15,149 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. పోలింగ్‌శాతం 76.37గా నమోదైంది. కందుకూరు నియోజకవర్గంలో అత్యధికంగా పోలింగ్ శాతం నమోదైంది. కాగా ఇతర జిల్లాల వారి పోస్టల్ బ్యాలెట్ ఓట్లు 2,548 ఉన్నాయి. ఆది, సోమవారాల్లో నగరంలోని జడ్పీ హైస్కూల్లో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్లో 1374 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. వీరిశాతం 53.92గా ఉంది.

కలెక్టర్ పరిశీలన

నెల్లూరు నగరంలో జరిగిన పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియను కలెక్టర్ హరినారాయణన్ సోమవారం పరిశీలించారు. వీఆర్ లా కళాశాల, డీకే డబ్ల్యు కళాశాలల్లో రెండో రోజు పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ సరళిని కలెక్టర్ పరిశీలించి, అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎన్నికల విధులకు కేటాయించిన ఉద్యోగులందరూ ఈనెల 8వ తేదీలోగా నియోజవర్గ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ కేంద్రాల్లో తప్పనిసరిగా వారి ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.



కోవూరులో పరిశీలిస్తున్న కలెక్టర్ హరినారాయణన్

పేదోళ్ల ఇళ్లపై అక్కసు


అర్హులైన ప్రతి ఒక్కరికీ సొంతిల్లు కల్పించాలన్నదే తెలుగుదేశం లక్ష్యం. ఆ మేరకే జిల్లావ్యాప్తంగా నాలుగు మున్సిపాలిటీల పరిధిలో 18,372 టిడ్కో ఇళ్లు నిర్మించింది. కొందరు లబ్ధిదారులతోనూ గృహప్రవేశాలు చేయించింది. పేదోళ్ల కల నెరువేరుతున్న తరుణంలో ఎన్నికల కోడ్ రావడంతో లబ్ధిదారులను ఎంపిక చేసి ఉన్నా, వారికి ఇళ్లు అప్పగించలేకపోయారు. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ సర్కారు ఈ ఇళ్లను పేదలకు అప్పగిస్తే టీడీపీకి మంచి పేరు వస్తుందనే అక్కసుతో నాలుగేళ్లపాటు నిర్లక్ష్యం చేసింది. శిథిలస్థితికి చేరుకున్న ఇళ్లను ఇటీవల కాలం నుంచి లబ్ధిదారులకు ఇచ్చి పాలకులు చేతులు దులుపుకున్నారు. సమస్యల నడుమ కాపురాలు చేయలేని లబ్ధిదారులకు ఇళ్లు వచ్చాయన్న ఆనందం కొన్ని రోజులకే ఆవిరైపోయాయి.

- ఆంధ్రజ్యోతి బృందం



నెల్లూరు : అక్కచెరువుపాడు వద్ద శిథిలస్థితికి చేరుకుంటూ..

- నాలుగున్నరేళ్లపాటు ఖాళీగా టిడ్కో ఇళ్లు
- టీడీపీకి మైలేజ్ వస్తుందనే వదిలేశారా!?
- ఆర్నెళ్ల క్రితం అరకొరగా కేటాయింపు
- సమస్యల నడుమ కాపురాలు చేయలేకున్న లబ్ధిదారులు



నెల్లూరు : అల్లీపురంలో ప్రారంభానికి ముందే దెబ్బతిన్న టైల్స్



విద్యుత్ తీగలు ఇలా..



ఆత్మకూరులో ట్యాంకరు వస్తేనే దాహం తీరేది!

నెల్లూరు వెంకటేశ్వరపురంలో తెలుగుదేశం హయాంలో 4800 టిడ్కో ఇళ్లు నిర్మించారు. వైసీపీ ప్రభుత్వం ఈ ఇళ్లను ఉద్దేశపూర్వ కంగా నాలుగున్నరేళ్లపాటు అలాగే వదిలేసింది. ఆరు నెలల క్రితం వీటిని లబ్ధిదారులకు అప్పగించారు. అయితే మంచినీటి కొరత, డ్రైనేజీ సమస్య, దొంగల బెడద కారణంగా ఇంకా వెయ్యికిపైగా ఇళ్లు ఖాళీగా ఉన్నాయి. నెల్లూరు శివార్లలోని అల్లీపురంలో 5 వేలు, అక్కచెరువుపాడులో 500, కల్లూరిపల్లిలో 500, కొండ్లపూడిలో 3 వేలు చొప్పున టిడ్కో ఇళ్లు నిర్మించారు. వీటిల్లో లబ్ధిదారులు ప్రస్తుతం ఉండటం లేదు. ఈ ప్రాంతాలలో రోడ్లు, తాగునీరు, డ్రైనేజీ, విద్యుత్, బాతురూములు వగైర సౌకర్యాలేవి పూర్తిగా అందుబాటులో లేవు. ఇళ్లు నిర్మించి సౌకర్యాలు కల్పన లేక సముదాయాలను వదిలేయడంతో గృహాలన్నీ సహజత్వాన్ని కోల్పోయాయి. టైల్స్ పగిలిపోవడం, ద్వారబంధ్రాలు పుచ్చిపోవడం, కిటికీ అద్దాలు పగిలిపోవడం, ఫ్యాన్లు చోరీకి గురవడంతో వాటిని లబ్ధిదారులకు ఇవ్వలేక అధికారులే అలా వదిలేశారు.

● ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలో టీడీపీ హయాంలో 1052 టిడ్కో గృహాలు నిర్మించారు. వీటిని కూడా నాలుగేళ్లు ఖాళీగా ఉంచి ఇటీవలే లబ్ధిదారులకు ఇచ్చారు. అయితే తాగునీరు, డ్రైనేజీ సమస్యలు తీవ్రంగా ఉండటంతో సగం మంది ఆ ఇళ్లలో చేరలేదు. ప్రస్తుతం ఇక్కడ నివాసం ఉండేవారు తాగునీరు మూడు అంతస్తుల పైకి మోసుకొని వెళుతున్నారు.



కావలి : అపార్ట్‌మెంట్‌లోకి వెళ్లే దారేదీ!?

● కావలిలో 2,112 ఇళ్లను నాలుగేళ్లపాటు ఖాళీగా ఉంచి ఇటీవల పేదలకు కేటాయించారు. ఇందులో 350 మంది మాత్రమే కాపురాలు ఉంటున్నారు. కనీస వసతులు లేవని ఎవరూ అక్కడ చేరడం లేదు. వైసీపీ ప్రభుత్వం రంగులు వేసుకుంది తప్ప ఒక్క చిన్న పని కూడా చేయలేదు.

● కందుకూరులో 1408 ఇళ్లు నిర్మించగా, ఇటీవల 1200 ఇళ్లు పేదలకు పంపిణీ చేశారు. ప్రస్తుతం 150 మంది మాత్రమే కాపురాలు ఉంటున్నారు. కనీస వసతులు లేని కారణంగా లబ్ధిదారులు ఆ ఇళ్లలో చేరడం లేదు.

'మెట్టలో' ఈదురుగాలుల బీభత్సం

● వడగళ్ల వాన.. గాలులకు లేచిన రేకులు

ఉదయగిరి రూరల్/వరికుంటపాడు : ఉదయగిరి ప్రాంతంలో సోమవారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వడగళ్ల వర్షం కురిసింది. ఉదయం నుంచి భానుడు దెబ్బకు ఉక్కపోతతో అల్లాడిన ప్రజలకు సాయంత్రం వర్షం కురవడంతో వాతావరణం చల్లబడి ఉపశమనం పొందారు. బలమైన ఈదురుగాలులు వీయడంతో ఉదయగిరి మండలంలోని దేకూరుపల్లిలో రామయ్య అనే రైతుకు చెందిన పశువుల షెడ్ రేకులు లేచిపోయాయి. పలు ప్రాంతాల్లో చెట్ల కొమ్మలు విరిగి నేలకొరి గాయి. ఉదయగిరిలోని డ్రైనేజీ కాలువలు పొంగి పొర్లడంతో రహదారులు చెత్తాచెదారంతో నిండిపోయాయి. విద్యుత్ సరఫరాకు సైతం అంతరాయం కలిగింది. గాలుల కారణంగా మామిడి కాయలు నేలరాలడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. వరికుంటపాడు మండలంలోనూ ఉరుములు, మెరుపులతో వడగండ్ల వర్షం కురిసింది. చెట్ల కొమ్మలు విరిగి నేలకొరిగాయి.



దేకూరుపల్లిలో లేచిపోయిన రేకులు

ఉదయగిరిలో పడ్డ వడగళ్లు



ఉలవపాడు : కృష్ణానగర్‌లో టీడీపీలో చేరిన వారితో మాట్లాడుతున్న అభ్యర్థులు వేమిరెడ్డి, ఇంటూరి

ఉలవపాడుతో అవినాభావ సంబంధం

● రోడ్‌షోలో నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి

ఉలవపాడు, మే 6 : చిన్ననాటి నుంచే తనకు ఉలవపాడుతో అవినావభావ సంబంధం ఉందని నెల్లూరు ఎంపీ టీడీపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఉలవపాడు, రాజుపాలెం, కరేడు, ఆత్మకూరు, చాకిచర్ల గ్రామాలలో కందుకూరు టీడీపీ అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావుతో కలిసి ఆయన పర్యటించారు. ఉలవపాడులో మహిళలు హారతులు పట్టి, గుమ్మడికాయ లతో దిష్టి తీసి సాదర స్వాగతం పలికారు. అనంతరం జూనియర్ కళాశాల నుంచి ప్రారంభమైన రోడ్డు షో ఎస్సీ కాలనీ మీదగా కొనసాగింది. ఈ సందర్భంగా వేమిరెడ్డి మాట్లాడుతూ ఉలవపాడులో జరిగే వేణుగోపాల స్వామి తిరునాళ్లకు వచ్చి తన బంధువు అయిన దేవరపల్లి వెంకట కృష్ణారెడ్డి ఇంటిలో గడిపేవాడినని గుర్తు చేసుకున్నారు. ప్రజల అభిమానం, జనసందోహం చూస్తుంటే టీడీపీకి తిరుగులేని విజయం చేకూర్చుతారనే నమ్మకం ఏర్పడిందని అన్నారు. రాష్ట్రంలో చంద్రబాబు అవసరం ఉందని, ఆయన్ను గెలిపించుకోవాల్సిన బాధ్యత తమపై ఉందన్న కసితో ప్రజలు ఉన్నారని అన్నారు. కందుకూరు అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ రామాయపట్నం పోర్టు నిర్మాణం పూర్తయితే మండలంలోని యువతకు ఉపాధి భరోసా కల్పించే బాధ్యత మేం తీసుకుంటామని అన్నారు. అలాగే టీడీపీ అధికారంలోకి రాగానే స్థానిక సమస్యలను కూడా వేమిరెడ్డి సహకారంతో పరిష్కరిస్తామని చెప్పారు.

ఆత్మకూరు ఉదయగిరి

103 మంది ఓటు హక్కు వినియోగం

కలువాయి, మే 6: మండలంలో సోమవారం హోం ఓటింగ్‌లో 103మంది తమ ఓటుహక్కు వినియోగించుకున్నట్లు ఎంపీడీవో ప్రభాకర్ తెలిపారు. మిగిలిన ముగ్గురులో ఒక మృతి చెందగా, మరో ఇద్దరు ఐపీయూలో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు.

కళాకారులకు ఉచిత శిక్షణ

ఉదయగిరి రూరల్, మే 6: వేసవిసెలవుల దృష్ట్యా కళాకారులు, కళాభిమానులకు ఆయా రంగాల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు గాయకుడు, చిత్రకారుడు, ఆర్టీసీ కండక్టర్ వై.సుదర్శన్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతి సోమ, మంగళవారాల్లో సంగీతం, చిత్రలేఖనం, గానం, మిమిక్రీపైన శిక్షణ ఇస్తామన్నారు. ఆసక్తి గలవారు సెల్: 86397 40303 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

సజావుగా పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ

● కలెక్టర్ హరినారాయణన్



ఆత్మకూరు పోలింగ్ కేంద్రంలో వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ హరినారాయణన్

ఆత్మకూరు, మే 6: పట్టణ సమీపంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ కేంద్రాలను సోమవారం కలెక్టర్ ఎం.హరి నారాయణన్ పరిశీలించారు. జిల్లాలో సార్వత్రిక ఎన్నికల పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ సజావుగా జరుగుతుందన్నారు. పోలింగ్ విధులకు హాజరయ్యే సిబ్బంది ఇక్కడ 6 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఆత్మకూరు నియోజకవర్గ పరిధిలో 2351 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు ఉండగా మొదటిరోజు 706మంది ఓటుహక్కును వినియోగించుకున్నట్లు ఆర్డీవో మధులత తెలిపారు. అనంతరం ఆంధ్ర ఇంజనీరింగ్ కాలేజీలో ఎలక్షన్ ఓటింగ్ మిషన్ల కండిషనింగ్, స్ట్రాంగ్ రూములను పరిశీలించారు. కార్యక్రమంలో డీఎస్పీ కోటారెడ్డి, తహసీల్దార్ శివనాగిరెడ్డి ఉన్నారు.

ఉదయగిరి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ కొనసాగింది. ఈ ప్రక్రియను కలెక్టర్ ఎం.హరినారాయణ పరిశీలించి మాట్లాడారు. బుధవారం వరకు పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌కు అవకాశం ఉందన్నారు. అనంతరం ప్రభుత్వ వెనుకబడిన తరగతుల బాలికల వసతిగృహంలో ఏర్పాటు చేసిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ల కండిషనింగ్‌ను తనిఖీ చేశారు. స్ట్రాంగ్‌రూమ్‌ను పరిశీలించి సలహాలు అందజేశారు. కార్యక్రమంలో ఆర్వో రాజారమేష్‌ప్రేమ్‌కుమార్, ఏఆర్వో నెహ్రూబాబు పాల్గొన్నారు.

● **ఓటర్లకు కుర్చీలేసి కూర్చోబెట్టారు..**

ఆత్మకూరు నియోజకవర్గ పరిధిలో 2352 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు ఉన్నాయి. ఫెసిలిటేషన్ సెంటర్‌లో సోమవారం 987 మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. మొదటిరోజు 706మంది ఓటు వేశారు. ఓటు వేసేందుకు వచ్చిన ఉద్యోగులకు ఆర్డీవో కె.మధులత ఓటర్లకు కుర్చీలు వేయించారు.

ఉపాధ్యాయుడి మృతితో విషాదం

ఉదయగిరి రూరల్, మే 6: స్థానిక గాజులవీధికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు గాజుల షేక్ ఫారుక్ అలీ సంగం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఉదయగిరిలో విషాదఛాయలు అలుముకొన్నాయి. ఉదయగిరి బ్లడ్‌బ్యాంక్ రెడ్‌క్రాస్ చైర్మన్‌గా, జేవీవీ జిల్లా నాయకులుగా, ఉదయగిరి జిల్లా సాధన సమితి కోశాధికారిగా పనిచేస్తూ అందరికీ సుపరిచితుడు. ఆయన మృతి విషయం తెలుసుకున్న మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి, ఉదయగిరి వైసీపీ అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పొన్నెబోయిన చెంచలబాబుయాదవ్‌లు ఫారుక్ అలీ భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. అలాగే ఉదయగిరి, ఆత్మకూరు నియోజకవర్గాల్లోని ప్రముఖులు, ఉద్యమ నేతలు, ఉద్యోగ, ఉపాధ్యాయులు మృతదేహాన్ని సందర్శించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

వాగులు, వంకలనూ వదల్లేదు!

● రాత్రి, పగలు తేడా లేకుండా అధికార పార్టీ ఇసుక తవ్వకాలు

● రోజుకు పదుల సంఖ్యలో ట్రిప్పుల తరలింపు ● పట్టించుకోని అధికారులు



అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టరు

ఏఎస్ పేట: ఇసుకమఫియా నదులనే కాదు.. వాగులు, వంకలను సైతం వదలడం లేదు. ఇసుక కనబడితే చాలు తవ్వేసి సొమ్ము చేసు కుంటున్నారు. ఇంతజరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వస్తున్నాయి. ఏఎస్ పేటతో పాటు గుంపార్లపాడు, గుడిపాడులోని వాగుల్లో ఇసుకను తవ్వేస్తున్నారు.

నక్కవాగులో..

ఏఎస్‌పేటకు సమీపంలోని నక్కవాగులో అక్రమంగా ఇసుకను తవ్వేస్తున్నారు. రాత్రి సమయంలో జేసీబీలను ఏర్పాటు చేసి ఇసుకను తవ్వేసి ట్రాక్టర్లతో తరలిస్తున్నారు. ఇసుకను తవ్వకాలకు అధికారికంగా అనుమతున్న రిచ్‌ల నుండి కొనుగోలు చేయాలంటే, ట్రక్కు ఇసుక రూ.3,500 నుండి రూ4వేల వరకు అవుతుంది. దీన్ని అవకాశంగా తీసుకున్న ఇసుక మఫియా వాగుల్లో ఇసుకను తవ్వేసి ట్రక్కు రూ.2వేల నుం డి రూ.3వేలకే అందిస్తు న్నా రు. కొనుగోలుదారులు తక్కు వకు వస్తుందని ఈ ఇసుకనే కొనుగోలు చేస్తు న్నారు. దీనితో గ్రామాల్లో ఇసుకకు డిమాండ్ ఏర్ప డింది. రోజుకు పదుల సంఖ్యలో ట్రిప్పులను తరలిస్తూ రాత్రికి రాత్రే లక్షలు సంపాదిస్తున్నారు.

బీరాపేరు వాగులో..

గుడిపాడుకు సమీపంలోని బీరాపేరు వాగులోనూ అక్రమంగా ఇసుకను తవ్వి తరలిస్తున్నారు. రాత్రి సమయంలో ఇసుకను ట్రాక్టర్లతో చుట్టుపక్కల గ్రామలతో పాటు వింజమూరుకు సైతం తరలిస్తున్నారు. మారుమూల ప్రాంతం కావడంతో పట్టించుకొనే వారు లేరు. పగలు సైతం ఇక్కడ వాగులో ఇసుకను తరలిస్తుండడం విశేషం.

గుంపార్లపాడు సమీప వాగులో..

గుంపార్లపాడు సమీపంలోని వాగులోనూ ఇసుకను తవ్వేస్తున్నారు. ఇక్కడ అధికార పార్టీ నాయకుడి ఆధ్వర్యంలో బహిరంగంగానే ఇసుకను తవ్వేస్తుంటారు. గతంలో సెబ్ అధికారులు అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నారు. వారి ముందే దౌర్జన్యంగా ఇసుకను రోడ్డ ప్రక్కనే అన్‌లోడ్ చేసి ట్రాక్టర్లను తీసుకెళ్లారు. దీనిపై అప్పట్లో కేసు కూడా నమోదు చేశారు. అయిన ఇసుక అక్రమ తవ్వకాలు మాత్రం ఆగలేదు. ఇక్కడ నుండి ఇసుకను ట్రాక్టర్లతో కలిగిరి మండలానికి తరలిన్నారు. రాత్రి పగలు తేడా లేకుండా తవ్వేస్తున్నారు. ఇంత జగురుతున్నా సంబంధిత అధికారులు మాత్రం నామమాత్రంగా దాడులు చేసి చేతులు దులుపుకుంటున్నారు.

వైసీపీ రాక్షసపాలన పోవాలి : ఆనం



మహిళలతో ఆనం రామనారాయణరెడ్డి

మర్రిపాడు, మే 6: వైసీపీ రాక్షసపాలన పోయి ఎన్డీఏ కూటమి పాలన అందుబాటులోకి రావాలని, అప్పుడే ప్రజలకు అన్ని అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు అందుతాయని ఆత్మకూరు అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. సోమవారం పల్లవోలు, ఇర్లపాడు, చిలకపాడు, ఏపిలగుంటలోని ఎన్నికల ప్రచారంలో పాల్గొని మాట్లాడారు. సైకిల్ గుర్తుపై ఓటు వేసి ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, తనను ఆశీర్వదించాలని కోరారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక యువత 5ఏళ్ల నుంచి వలస పోతున్నారని వాపోయారు. సోమశిల హైలెవల్ కెనాల్ పనులను మేకపాటి కుటుంబం నిలిపివేసిందంటూ మండిపడ్డాడు. సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన కల్పించారు. యవతకు ప్రభుత్వ, ప్రవేట్ రంగ సం స్థల్లో 20లక్షల ఉద్యోగాలిస్తామన్నారు. కార్యక్రమంలో ఆంజనేయలురెడ్డి, మెట్టుకూరు ధనుంజయరెడ్డి, బ్రహ్మానందరెడ్డి, జనార్దన్‌నాయుడు, పాల్గొన్నారు.

తీర్మానాలు లేని మండల సమావేశం

కొండాపురం, మే 6: మండల పరిషత్ 12వ సర్వసభ్య సమావేశం సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బొడ్డు అనూరాధ అధ్యక్షతన జరిగింది. ఎన్నికల కోడ్ అమలులో ఉండగా ఎటువంటి తీర్మానాలు చేయరాదనే నిర్ణయంతో సమావేశాన్ని ఎంపీడీవో సుజాత ముగించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, అధికారులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

వింజమూరు, మే 6: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానిక స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖ చీఫ్ మేనేజరు వై.రామకృష్ణ తెలిపారు. సోమవారం స్థానిక బ్రాంచ్‌లో ఏర్పాటు చేసిన ఖాతాదారుల అవగాహన సదస్సులో మాట్లాడారు. డిజిటల్ మోసాలు ఆన్‌లైన్ మోసాలు జరుగుతున్నాయని వాటిపై ప్రజలకు అవగాహన కల్పించాలని ప్రధానశాఖ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఆన్‌లైన్‌లో డబ్బు పంపేటపుడు ముందుగా రూపాయి పంపి అది ఆ వ్యక్తికి చేరిందంటే తరువాత మిగిలిన మొత్తాన్ని పంపాలని సూచించారు. ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు మీ ఫోన్‌కు మెసేజ్ పెట్టి ఓటీపీ చెప్పండి అని అడిగితే ఎట్టి పరిస్థితుల్లో సమాధానాన్ని ఇవ్వరాదన్నారు. ఆ విషయంపై కనుక్కొని కేవైసీ చేయించుకోవాలన్నారు.

టీడీపీ నేతల ఇంటింటి ప్రచారం

కొండాపురం, మే 6: ఉదయగిరి ఎమ్మెల్యేగా కాకర్ల సురేష్‌ను, నెల్లూరు ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకరరెడ్డిని గెలిపించాలని కోరుతూ నాయకులు సోమవారం నేకునాంపేటలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పాలంకి మనోహర్, ఎం.లక్ష్మీనారయణరెడ్డిల ఆధ్వర్యంలో కన్వీనర్ ఎమ్.ఓంకారం, చిట్టాబత్తిన బాలకోటేశ్వరారవు, పుల్లారెడ్డి, సూపర్‌సిక్స్ కరపత్రాలను పంచిపెట్టారు.

బడుగు, బలహీన వర్గాలకు టీడీపీయే అండ

కలిగిరి, మే 6: రాష్ట్రంలోని బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కొరకు పాటుపడే ఏకైక పార్టీ తెలుగుదేశం పార్టీయేనని ఆ పార్టీ మండల కన్వీనర్ బిజ్జం క్రిష్టారెడ్డి పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని ఎర్రతోట ప్రాంతంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సూపర్‌సిక్స్ పథకాలతో పేదల ఆర్థికస్థితి మెరుగుపడటం ఖాయమన్నారు. ఎంపీ, ఎమ్మెల్యే, అభ్యర్థులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కాకర్ల సురేష్‌లను గెలిపించి చంద్రబాబునాయుడును ముఖ్యమంత్రి చేసుకుందామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాకు మహేష్, ఉసా మాల్యాద్రి, చేరెడ్డి సుబ్బారెడ్డి, స్వర్ణ కొండయ్య, కొప్పోలు కొండలరావు, కొండపల్లి వెంకటరావు పాల్గొన్నారు.

ప్రజల హృదయాలను గెలిచాను : పసుపులేటి

కావలిటౌన్, మే 6: పీఎస్సార్ ట్రస్ట్ ద్వారా 20ఏళ్ల నుంచి నియోజకర్గంలో కోట్లాది రూపాయల సొంత నిధులతో అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించి ప్రజల హృదయాలను గెలిచానని కావలి నియోజకవర్గ స్వతంత్ర అభ్యర్థి పసుపులేటి సుధాకర్ పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని తన కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ప్రచారానికి ఏ గ్రామానికి వెళ్లినా ప్రజలు బ్రహ్మరథం పడుతుండడాన్ని చూసి ఓర్వలేక ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి, టీడీపీ అభ్యర్థి కావ్య కృష్ణారెడ్డి తనపై దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యేగా గెలిస్తే సొంత మేనిఫెస్టోలోని ప్రతి హామీ నెరవేరుస్తానని, లేనిపక్షంలో తనపై క్రిమినల్ చర్యలు తీసుకునేవిధంగా తానే స్వయంగా అగ్రిమెంట్ చేస్తానన్నారు.

డబుల్ ఇంజన్ సర్కారు వస్తేనే రాష్ట్రంలో అభివృద్ధి పనులు



వెంకటంపేటలో ప్రజలకు అభివాదం చేస్తున్న కాకర్ల సురేష్



కాకర్ల, కంభం, చెంచలబాబులను సన్మానిస్తున్న నందిపాడు గ్రామస్థులు

దుత్తలూరు (ఉదయగిరి రూరల్), మే 6: ఈ సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రానికి భవిష్యత్తు ఉంటుందని ఉమ్మడి అభ్యర్థి కాకర్ల సురేష్ అన్నారు. సోమవారం వెంకటంపేట, పాపంపల్లి, నందిపాడు, రెడ్లదిన్నె, రాచవారిపల్లి, భైరవరం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తొలుత వెంకటంపేట అభయాంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మాట్లాడారు. వైసీపీ ఐదేళ్లపాలనలో అన్ని రంగాల్లో వెనుకబడిన రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే డబుల్ ఇంజన్ సర్కార్ రావాలన్నారు. కూటమి ప్రవేశపెట్టిన మేనిఫెస్టో జనరంజకంగా ఉందన్నారు. రాష్ట్రంలో వైసీపీ నాయకులు మద్యం, ఇసుక, మైనింగ్, డ్రగ్స్ మాఫీయాగా ఏర్పడి కోట్ల రూపాయలకు సంపాదించుకుని ప్రజలను భిక్షగాళ్లను చేశారని వాపోయారు. టీడీపీ అధికారంలోకి రాగానే నియోజకవర్గంలోని ప్రతి 50కుటుంబాలకు ఒక శుద్ధి జలకేంద్రం, ఎస్సీఎస్టీ, బీసీ కాలనీల్లో వసతుల కల్పనకు చర్యలు చేపడతామన్నారు. సాగు, తాగునీటి కష్టాలు తీర్చి మెట్ట ప్రాంతాన్ని డెల్టాగా మార్చడం, పరిశ్రమలు స్థాపించి యువతకు ఉపాధి అవకశాలు కల్పించడమే తన ధ్యేయమన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు, నెల్లూరు పార్లమెంట్ ఉమ్మడి అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సైకిల్ గుర్తుపై ఓట్లేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. మండల కన్వీనర్ పేలపూడి వెంకటరత్నం ఆధ్వర్యంలో ఇంటింటా మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేసి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పొన్నెబోయిన చెంచలబాబుయాదవ్, శ్రీకుర్తి రవీంద్రబాబు, ఉండేలా గురవారెడ్డి, మల్లంపాటి గురవయ్యనాయుడు, చీదర్ల మల్లికార్జున్, మాదాల రామచంద్రయ్య, కనసాని సుబ్బారెడ్డి, చల్లాప్రసాద్ పాల్గొన్నారు.

దుత్తలూరు(ఉదయగిరి రూరల్): సోమలరేగడ, దుత్తలూరు, బ్రహ్మేశ్వరం, ఏరుకొల్లు గ్రామాల్లో మంగళవారం నెల్లూరు పార్లమెంట్, ఉదయగిరి అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కాకర్ల సురేష్‌లు రోడ్ షో నిర్వహించనున్నట్లు పార్టీ మండల కన్వీనర్ పేలపూడి వెంకటరత్నం సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అనంతరం దుత్తలూరు సెంటర్‌లో బహిరంగసభ నిర్వహిస్తామన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మేకపాటిని కలిసిన కాకర్ల

ఉదయగిరి మాజీ మార్కెటింగ్ చైర్మన్, నర్రవాడ మాజీ సర్పంచ్ మేకపాటి మాలకొండ్రాయుడును ఆదివారం రాత్రి వారి స్వగ్రామమైన నర్రవాడ పంచాయతీలోని ఉలవవారిపాళెంలో ఉదయగిరి అభ్యర్థి కాకర్ల సురేష్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ ఎన్నికల్లో తనతో పాటు నెల్లూరు పార్లమెంట్ ఉమ్మడి అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి విజయానికి సహకరించాలని కాకర్ల కోరారు.



వింజమూరు: ఇంటింటి ప్రచారంలో కాకర్ల కుటుంబ సభ్యులు

ఆయన వెంట ఎంపీటీసీ మాదాల రామచంద్ర, బీజేపీ తెలంగాణ సీనియర్ నాయకులు గోగినేని రామచంద్ర, మేకపాటి మాల్యాద్రినాయుడు పాల్గొన్నారు.

వింజమూరు: నడిమూరులో ఉమ్మడి అభ్యర్థి కాకర్ల సురేష్ సతీమణి కాకర్ల ప్రవీణ, తమ్ముడు కాకర్ల సునీల్ సతీమణి కాకర్ల సురేఖలతో పాటు వారి పిల్లలు (కాకర్ల సురేష్ పుత్రుడు ధాత్రి, తమ్ముడు కుమార్తె ఆస్మిత) ఇంటింటా ప్రచారం నిర్వహించారు. వారికి నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కాకర్ల ప్రవీణ మాట్లాడారు. ఉదయగిరి అభివృద్ధికి పాటు పడుతున్న కాకర్ల సురేష్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. గెలుపు కోసం కృషి చేస్తామని మహిళలు హామీ ఇచ్చారు. టీడీపీ నాయకులు ఇంటింటా తిరిగి మేనిఫెస్టో గురించి వివరించారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే మీ భూములన్నీ ప్రభుత్వపరం అవుతాయని రైతులు హక్కులు కోల్పోతారని తెలిపారు. 18సంవత్సరాలు నిండిన మహిళలకు రూ.1500, అవ్వాతాతలకు రూ.4వేలు పించన్ వస్తుందన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి కాకర్ల సురేష్, పార్లమెంట్ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిలను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కన్వీనర్ జి.రఘునాథ్‌రెడ్డి, గుడూ నర్సారెడ్డి, యనం రామచంద్రరెడ్డి, చల్లా వెంకటేశ్వర్లు, వనిపెంట సుబ్బారెడ్డి, చల్లా శ్రీనివాసులు, గువ్వల కృష్ణారెడ్డి, మంచాల శ్రీనివాసులునాయుడు, గురజాల వెంకటరమణయ్య, భైపురెడ్డి కేశవులురెడ్డి, సత్యనారాయణ, డేగా మధు, గణపం సుదర్శన్, ఎస్‌కె.బాదుల్లా, కొండూరు నాగిరెడ్డి, అబ్దుల్ నబీ, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థులకే మా మద్దతు



కేశమనేనిపల్లిలో వైసీపీ నుంచి టీడీపీలోకి వచ్చిన వారితో నాయకులు

కలువాయి, మే 6 : కూటమి అభ్యర్థులకే మాదిగల మద్దతు అని వెంకటగిరి ఎమ్మార్పీఎస్ నాయకులు మంగలపురి సురేష్ మాదిగ, పల్లిపటి రవి మాదిగ, తోకల మని మాదిగ తెలిపారు. సోమవారం వీరు ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు దండు భార్గవ్ మాదిగ, రవి ఆధ్వర్యంలో తోపుగుంట, చీపినాపి, పర్లకొండ, తిరుమలపాడు, వెరుబొట్లపల్లి గ్రామాల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. వెంకటగిరి టీడీపీ అభ్యర్థి కురుగొండ్ల రామకృష్ణ, తిరుపతి ఎంపీ అభ్యర్థి వరప్రసాదరావులను గెలిపించాలని కోరారు.

కొలవపల్లిలో 20కుటుంబాలు టీడీపీలోకి..

కొలవపల్లి, తెలుగురాయపురంలో టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు ఇంటింటా ప్రచారం చేశారు. కొలపల్లిలో 20 కుంటుంబాలు వైసీపీ వీడి టీడీపీలో చేరారు. వారందరికీ నాయకులు టీడీపీ కండువాలు వేసి ఆహ్వానించారు. వెంకటగిరి టీడీపీ అభ్యర్థి కురుగొండ్ల రామకృష్ణను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. వారి వెంట టీడీపీ నాయకులు చల్లా రఘురామిరెడ్డి, చల్లా శివారెడ్డి, అల్లంపాటి వేణుగోపాల్‌రెడ్డి, జగదల్ నాయుడు, కండే ప్రసాద్, చల్లా రాధాకృష్ణారెడ్డి, గంగవరపు చంద్రమౌళి, బీజేపీ నాయకులు దండు పెంచలయ్య పాల్గొన్నారు. అలాగే కేశమ నేనిపల్లికి చెందిన అనుకు వెంకటేశ్వర్లు, అనుకు కృష్ణయ్య, అనుకు సుబ్బయ్య, నాగల వెంకటేశ్వర్లు, ఆకుముల వెంకటేశ్వర్ల ఆధ్వర్యంలో 10కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు గోనుగుంట వెంకటేశ్వర్లు నాయుడు, పీర్ల సోమయ్య యాదవ్, జగదల్‌నాయుడులు కండువాలు వేసి ఆహ్వానించారు.



ప్రమాదంలో దెబ్బతిన్న కారు

ఆగిన సిమెంట్ ట్యాంకర్‌ను ఢీకొన్న కారు

● సంగం సమీపంలో ముంబయి జాతీయ రహదారిపై ఘటన

● అక్కడికక్కడే ఒకరు మృతి.. ఇద్దరికి గాయాలు



మృతి చెందిన గాజుల ఫరూక్ అలీ

సంగం, మే 6: మండలకేంద్రం సమీపంలోని ముంబాయి జాతీయ రహదారిలో సోమవారం తెల్లవారు జామున రెండు కొండల మధ్య మరమ్మతులకు గురై ఆగి ఉన్న సిమెంట్ ట్యాంకర్‌ను వెనుక వైపు నుంచి వేగంగా కారు వచ్చి ఢీకొన్నది. ఈ ఘటనలో కారు ముందు భాగం నుజ్జునుజ్జయ్యింది. కారులో ప్రయాణం చేస్తున్న గాజుల ఫరూక్ అలీ (61) అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఇద్దరికి గాయపడ్డారు. పోలీసుల తెలిపిన వివరాల మేరకు.. ఉదయగిరి మండలం దాసరిపల్లి ఎంపీయూపీ పాఠశాల ఉపాధ్యాయుడు గాజుల ఫరూక్ అలీ తన రెండో కుమారుడు అయాన్‌ను ఉద్యోగరీత్యా జర్మనీ వెళ్లనున్నాడు. అతన్ని చెన్నైలో విమానం ఎక్కించేందుకు ఆదివారం సాయంత్రం తన అన్న గాజుల నజీముద్దీన్, అన్న కుమారుడు సూరజ్‌తో కలిసి డ్రైవర్ కార్తీక్‌ను తీసుకుని కారులో ఉదయగిరి నుంచి బయలుదేరాడు. రాత్రి కుమారుడిని ఫ్లైట్ ఎక్కించి తిరిగి ఉదయగిరికి బయలుదేరాడు. తెల్లవారుజామున మార్గమధ్యలో సంగం కూడలి దాటిన అనంతరం ఈ ప్రమాదం దుర్ఘటన జరిగింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ వెనుక సీట్‌లో కూర్చున గాజుల ఫరూక్ అలీ సీట్ బెల్టు పెట్టుకోకపోవడంతో ఎగిరి రెండు సీట్ల మధ్య కిందపడ్డాడు. దీంతో స్ట్రోక్‌కు గురై మృతి చెందినట్లు పోలీసులు భావిస్తున్నారు. ముందు సీట్‌లో కూర్చున ఫరూక్ అలీ అన్న నజీముద్దీన్, డ్రైవర్ కార్తీక్ సీట్ బెల్టు పెట్టుకుని ఉండడంతో బెలూన్‌లు ఓపన్ కావడంతో స్వల్ప గాయాలతో ప్రాణాపాయం తప్పింది. అదేవిధంగా వెనుక సీట్‌లో కూర్చున్న సూరజ్‌కు కూడా స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న సీఐ రవినాయిక్, ఎస్ఐ నాగార్జునరెడ్డి సంఘటన స్థలానికి వెళ్లి గాయపడిన వారిని 108 వాహనంలో నెల్లూరు వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

మృతుడు ఫరూక్ ఇటీవల సస్పెన్షన్

ప్రమాదంలో మృతి చెందిన ఉపాధ్యాయుడు గాజుల ఫరూక్ అలీ ఇటీవల సస్పెండ్ అయ్యాడు. ఇతను దాసరిపల్లి ఎంపీయూపీ పాఠశాల ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్నారు. వీరి కుటుంబం మాజీ ఎంపీ రాజమోహన్‌రెడ్డి కుటుంబానికి అత్యంత సన్నిహితం. దీంతో ఫరూక్ అలీ దీర్ఘకాల సెలవు పెట్టి ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి వద్ద ప్రైవేట్ పర్సనల్ సెక్రటరీగా పనిచేస్తునాడు. ఈ క్రమంలో ప్రస్తుతం జరుగుతున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డితో కలసి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఉపాధ్యాయుడుగా ఉంటూ ఎన్నికల ప్రచారంలో పాల్గొనడంతో ఆయన్ను కలెక్టర్ సస్పెండ్ చేశారు. ఈయన అన్న గాజుల తాజుద్దీన్ మేకపాటి కుటుంబ సహకారంతో జిల్లా పరిషత్ కో ఆప్షన్ సభ్యుడిగా ఉన్నారు.

వైసీపీ ఎన్నికల ప్రచారంలో ఆశావర్కర్

● చర్యలు తీసుకోవాలని టీడీపీ నేతల డిమాండ్



వైసీపీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఆశావర్కర్ భవాని (వృత్తంలో ఉన్న మహిళ)

విడవలూరు, మే 6: మండల పరిధిలోని చౌకిచర్ల గ్రామంలో ఉంటూ బుచ్చిలో విధులు నిర్వహిస్తున్న ఆశావర్కర్ భవాని ఆదివారం జరిగిన వైసీపీ ఎన్నికల ప్రచారంలో పాల్గొనడం చర్చనీయాంశంగా మారింది. ఈ ఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. ఇటీవల కోవూరు వైసీపీ అభ్యర్థి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఎన్నికల ప్రచారంలోనూ ఆశావర్కర్ పాల్గొని పార్టీ జెండా పట్టుకుని వైసీపీకి జై అంటూ ప్రచారం నిర్వహించింది. ప్రభుత్వ జీతం తీసుకుంటూ ఎన్నికల ప్రచారంలో పాల్గొంటే అధికారులు ఏమి చేస్తున్నారని, ఈ ఘటనపై జిల్లా ఎన్నికల అధికారి సమగ్ర విచారణ జరిపి ఆశా వర్కర్‌పై సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకులు డిమాండ్ చేశారు.

వైసీపీ నుంచి కొత్తపల్లి సర్పంచి సస్పెన్షన్

● కాదు.. కాదు.. పార్టీ విధానాలు నచ్చక దూరమయ్యా : శ్రీహరినాయుడు

కావలి రూరల్, మే 6: కావలి మండలం కొత్తపల్లి సర్పంచి చిమ్మిలి శ్రీహరినాయుడు, ఆయన తండ్రి అంకబాబును ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి వైసీపీ నుంచి సస్పెండ్ చేసినట్లు సోమవారం ఎమ్మెల్యే కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొంది. వారిద్దరూ పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడినందున వైసీపీ నుంచి సస్పెండ్ చేసినట్లు కార్యాలయ వర్గాలు తెలిపాయి.

● **పార్టీ విధానాలు నచ్చక దూరమయ్యాం**

సస్పెన్షన్‌పై సర్పంచి శ్రీహరినాయుడుని వివరణ కోరగా వైసీపీ విధానాలు నచ్చక ఐదురోజులుగా తామే పార్టీకి దూరంగా ఉన్నామన్నారు. తన తల్లి చిమ్మిలి వసుమతి మాజీ సర్పంచిగాను, సర్పంచిగా తాను 13 ఏళ్లుగా పార్టీకి సేవచేశామని, ఎమ్మెల్యే వద్ద మాపై కొందరు తప్పుడు ప్రచారం చేశారని పేర్కొన్నారు. పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడినట్లు ఎమ్మెల్యే నిరూపించాలని ఆయన సవాల్ విసిరారు.

తల్లి మరణం తట్టుకోలేక యువకుడి ఆత్మహత్య

నెల్లూరు(క్రైం), మే 6: తల్లి మరణం జీర్ణించుకోలేని ఓ యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సేకరించిన సమాచారం మేరకు... నెల్లూరులోని కామాటి వీధిలో చెందిన మోహన్ మురళి, ద్రాక్షాయణి దంపతులు నివసించేవారు. వారికి ఓ కుమార్తె, కుమారుడు సర్వజ్ఞ(26) ఉన్నారు. కుమార్తెకు వివాహం కాగా, సర్వజ్ఞ బీటెక్ పూర్తి చేసి నగరంలోని ఆర్టీసీ బస్టాండు సమీపంలో గల కంప్యూటర్ సెంటర్‌లో పని చేస్తున్నాడు. ఏడాది క్రితం తల్లి ద్రాక్షాయణి మృతి చెందింది. తల్లి మరణం జీర్ణించుకోలేని సర్వజ్ఞ లోలోపల కృంగిపోయేవాడు. ఈ క్రమంలో సోమవారం ఉదయం తండ్రి మురళి బయటకు వెళ్లిన సమ యంలో ఇంటిలోనే చీరతో ఉరి వేసుకున్నాడు. గమనించిన బంధువులు తలుపులు పగులగొట్టి చికిత్స నిమిత్తం ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని నిర్ధారించారు. సమాచారం అందుకున్న సంతపేట పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి కేసులో మూడేళ్ల జైలు: రూ. 10వేల జరిమానా

నెల్లూరు (లీగల్), మే 6 : గంజాయి తరలిస్తూ పట్టుబడ్డ కేసులో జయదేవ్ దీప్ అలియాస్ జగలి అనే నిందితుడికి మూడేళ్ల జైలు శిక్షతోపాటు 10వేల రూపాయల జరిమా నా విధిస్తూ నెల్లూరు 1వ అదనపు జిల్లా సెషన్స్ (ఎన్‌డీపీఎస్‌సీ కోర్టు స్పెషల్) జడ్జి జీ కబర్ది సోమవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూ షన్ కథనం మేరకు... ఒడిశా రాష్ట్రం రగారహ్ జిల్లా కురపలి గ్రామానికి చెందిన జయదేవ్ దీప్ గతేడాది జూలై 12వ తేదీన 2 కేజీల గం జాయిని ప్లాస్టిక్ బ్యాగ్‌లో పెట్టుకుని తిరుపతి జిల్లా గూడూరు పట్టణంలోని క్రీస్తు సమాధు ల వద్ద అనుమానాస్పదంగా తిరుగుతుండటం తో గూడూరు పట్టణం స్పెషల్ ఎన్‌ఫోర్స్ మెంట్ అధికా రులు పట్టుకున్నారు. కేసు నమోదు చేసి చార్జిషీటు దాఖలు చేశారు. విచారణా కాలంలో నిందితుడిపై నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి జైలు, జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ దాట్ల రమణారెడ్డి వాదించారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	155
లేయర్ లైవ్	93
స్కిన్ చికెన్	270
స్కిన్‌లెస్	300
లేయర్	158

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ. 6818
వెండి కిలో ధర	రూ. 83,600
వెండి ఒక గ్రాము	రూ. 85.60

ప్రజలు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోండి

లింగసముద్రం, మే 6 : రాబోయే ఎన్నికల్లో ప్రజలు తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని గుడ్లూరు సీఐ బీవీవీ సుబ్బారావు చెప్పారు. ఆదివారం రాత్రి పెదపవనిలో టీడీపీ, వైసీపీ పార్టీల వర్గాల వారి మధ్య ఘర్షణలు జరిగిన నేపథ్యంలో సోమవారం రాత్రి 8 గంటల సమయంలో గుడ్లూరు సీఐ ఆధ్వర్యంలో తమిళనాడు పోలీసు బలగాలు, గుడ్లూరు సర్కిల్ పరిధిలోని పోలీస్ సిబ్బంది కవాతు నిర్వహించారు. ప్రజలు ప్రశాంత ఎన్నికల నిర్వహణకు సహకరించాలని కోరారు .ఈ కార్యక్రమంలో ఎస్సై ఎం బాజీబాబు పాల్గొన్నారు.

నేడు నారా రోహిత్ పర్యటన

జలదంకి, మే 6: సినీహీరో, టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు సోదరుడి కుమారుడు నారా రోహిత్ మంగళవారం జలదంకిలో జరిగే రోడ్‌షోలో పాల్గొననున్నారు. సాయంత్రం 4గంటలకు జలదంకి ఎస్సీకాలనీ వద్ద రోడ్‌షో మొదలై చావిడి కూడలి మీదుగా బ్యాంకువీధి, బస్టాండు సెంటర్ ప్రాంతాల మీదుగా గట్టుపల్లి రోడ్డు కూడలి వరకు సాగనుంది. అనంతరం గట్టుపల్లి రోడ్డు కూడలిలో జరిగే సభలో ఎన్డీఏ కూటమి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కాకర్ల సురేష్‌లను గెలిపించాలని కోరుతూ ప్రసంగించనున్నారు. ఈ రోడ్‌షోలో మండలంలోని అన్ని గ్రామాల కూటమి నాయకులు, కార్యకర్తలు, ఎన్టీఆర్, బాలక్రిష్ణ, పవనకళ్యాణ్ అభిమానులు పాల్గొనాలని కోరారు.

పెదపవనిలో టీడీపీ, వైసీపీ వర్గాల ఘర్షణ

లింగసముద్రం, మే 6 : మండలంలోని పెదపవని ఎస్సీ కాలనీలో ఆదివారం రాత్రి ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ నాయకులతో వైసీపీకి చెందిన వారు ఘర్షణ పడ్డారు. ఈ ఘటనపై ఇరువర్గాలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసులు నమోదు చేశారు. ఎస్సై ఎం.బాజీబాబు కథనం మేరకు.. రాత్రి 9 గంటల సమయంలో ఎస్సీ కాలనీలో ప్రచారం చేస్తున్న టీడీపీకి చెందిన దిలీప్, కృష్ణ, తదితరులతో వైసీపీ నాయకుడు మంద కొండయ్య, ఆయన బంధువులు వాగ్వాదానికి దిగి ఘర్షణ పడ్డారు. వైసీపీకి చెందిన కర్రా కోటేశ్వరరావు ఫిర్యాదు మేరకు టీడీపీకి చెందిన రామిశెట్టి మాల కొండయ్య, గొర్రెపాటి సాంబయ్యలపై ఎస్సీ, ఎస్టీ చట్టం కింద కేసు నమోదు చేశారు. దిలీప్, కృష్ణలపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. అదేవిధంగా టీడీపీ నేత దిలీప్ ఫిర్యాదు మేరకు వైసీపీకి చెందిన మంద కొండయ్య, రవి, కర్రా రాజు మరో ముగ్గురిపై కేసులు నమోదు చేశారు.

అవకాశం ఇవ్వండి.. అభివృద్ధి చేస్తా : ఇంటూరి



ఉలవపాడు మండలం ఆత్మకూరులో జరిగిన సభలో మాట్లాడుతున్న ఇంటూరి, పక్కన వేమిరెడ్డి



ఉలవపాడు కృష్ణానగర్‌లో టీడీపీ అభ్యర్థులు వేమిరెడ్డి, ఇంటూరి నిర్వహిస్తున్న ర్యాలీ

లింగసముద్రం, మే 6 : రాబోయే ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటేసి తనకు ఒక్క అవకాశం ఇస్తే మన ప్రాంతాన్ని సమగ్రాభివృద్ధి చేస్తానని ఎన్డీఏ కూటమి నుంచి కందుకూరు నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఇంటూరి నాగేశ్వరరావు కోరారు. సోమవారం ఆయన మండలంలోని మొగిలిచెర్లలో పర్యటించారు. టీడీపీ మండల అధ్యక్షుడు వేముల గోపాలరావు ఆధ్వర్యంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు స్వర్ణ చిన్న అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఇంటూరి నాగేశ్వరరావు సమక్షంలో గ్రామానికి చెందిన వైసీపీ నేతలు నవులూరి రవీంద్ర, మార్నేని వెంకటేశ్వర్లు, ఓరుగంటి చిన అంకయ్య, ఎంపీటీసీ సభ్యుడు వెన్నపూస కృష్ణారెడ్డి, వెన్నపూస చెన్నారెడ్డి, గడ్డె లక్ష్మీనారాయణ, తదితరులు టీడీపీలో చేరారు. వారికి నాగేశ్వరరావు పసుపు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. దీంతో మండలంలో టీడీపీలోకి ప్రతిరోజూ వలసల పరంపర కొనసాగుతోంది. మొగిలిచెర్ల గ్రామంలో ఫ్యాన్‌కు షాక్ తగిలింది. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు అంగుళూరి చినకొండయ్య, నవులూరి చినచెంచురామయ్య, బొల్లినేని నాగేశ్వరరావు, మద్దెల రామారావు, పల్లపోతు వెంగళరావు, చుండూరి బ్రహ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఇంటూరి సౌజన్య ఇంటింటి ప్రచారం

వలేటివారిపాలెం : మండలంలోని పోకూరు, నూకవరం గ్రామాలలో టీడీపీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు సతీమణి సౌజన్య సోమవారం ఇంటింటి ప్రచారం చేపట్టారు. ముందుగా పోకూరు ఎస్టీ కాలనీలోని చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఇంటింటికి వెళ్లి ఎమ్మెల్యేగా నా భర్త నాగేశ్వరరావును, ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. రాష్ట్రం అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలంటే చంద్రబాబునాయుడను ముఖ్యమంత్రిని చేసుకోవలసిన బాధ్యత అందరిపై ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు దాచర్ల శ్రీనివాసులు, బద్దిపూడి శిఖామణి, ఇంటూరి యలమంద, ఇంటూరి రవి, మన్నం శ్రీనివాసులు, దాచర్ల హరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

- వైసీపీ నుంచి టీడీపీలోకి బారీగా వలసలు
- మొగలిచెర్లలో ఫ్యాన్ రివర్స్



వలేటివారిపాలెం : పోకూరులో ప్రచారం చేస్తున్న సౌజన్య



లింగసముద్రం : టీడీపీలో చేరిన వారితో ఇంటూరి

రేపు కూడా పోస్టల్ బ్యాలెట్ ఓటుకు అవకాశం : ఆర్వో

కావలి, మే 6: ఎన్నికల పోలింగ్ డ్యూటీకి కేటాయించిన ఉద్యోగులు ఈ నెల 8వ తేదీన కూడా పోస్టల్ బ్యాలెట్ ఓటు వేసుకునేందుకు అవకాశం కల్పించామని కావలి రిటర్నింగ్ ఆఫీసర్ శీనా నాయక్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కావలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన 5 ఫెసిలిటేషన్ సెంటర్లలో ఈ నెల 5, 6, 7 తేదీలలో ఓటు హక్కు వినియోగించుకునే విధంగా ఏర్పాట్లు చేశామన్నారు. ఆ రోజుకు పూర్తి కాకపోతే మిగిలిన ఓటర్ల కోసం ఈ నెల 8వ తేదీన ఆర్డీవో కార్యాలయంలో ఫెసిలిటేషన్ సెంటర్ ఏర్పాటు చేసి అక్కడ ఓటు వినియోగానికి అవకాశం కల్పిస్తామన్నారు. అలాగే పోలింగ్‌కు కేటాయించి పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకోని ఉద్యోగులు కూడా 8వ తేదీ నేరుగా ఆర్డీవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకుని పోస్టల్ బ్యాలెట్ ఓటు వినియోగించుకోవచ్చున్నారు. ఈ విషయాన్ని గమనించి ప్రతి ఉద్యోగి తమ ఓటు వినియోగించుకోవాలని చెప్పారు.

టీడీపీ గూటికి వైసీపీ నాయకులు



రవిచంద్ర సమక్షంలో పార్టీలో చేరిన వైసీపీ నేతలు

దగదర్తి (బిట్రగుంట), మే 6: దగదర్తి మండలం యలమంచిపాడుకు చెందిన వైసీపీ నాయకులు శివనారాయణ, సోమశేఖర్‌లు టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర సమక్షంలో సోమవారం టీడీపీ కండువా వేసుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాలేపాటి సుబ్బానాయుడు, మాలేపాటి రవీంద్రనాయుడు పాల్గొన్నారు.

ఓటు వినియోగంపై అవగాహన

కందుకూరు, మే 6: నియోజకవర్గంలో టీడీపీ నేతలు విస్తృత ప్రచారం చేస్తున్నారు. రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ కూటమి విజయం సాధిస్తే అమలు చేయబోయే సంక్షేమ పథకాలను వివరిస్తూ ముద్రించిన కరపత్రాలతో పాటు ఈవీఎం నమూనాలో ఓటు హక్కు ఎలా వినియోగించుకోవాలో ఇంటింటికీ తిరిగి అవగాహన కల్పిస్తున్నారు. అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావుకు ఈవీఎంలో ఒకటో నెంబరులో, ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి ఈవీఎంలో సీరియల్ నెంబరు 2 సైకిల్ గుర్తుపై ఓటు వేయాలని అవగాహన కల్పిస్తున్నారు. పట్టణంలోని 7, 14వ వార్డుల పరిధిలోని బండపాలెం, శ్రీరామ్‌నగర్ కాలనీ, శ్రీనగర్ కాలనీ ఏరియాలలో యువత, మహిళలు సోమవారం సాయంత్రం పెద్దఎత్తున ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అలాగే తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు వాసవీనగర్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు గట్టమనేని హరిబాబు, జొన్నాదుల రాఘవయ్య, మన్నేపల్లి వరప్రసాదరావు, కొమ్మి నరసింగరావు, టీడీపీ నాయకులు కొత్తూరి సుధాకర్‌రావు, తాతా లక్ష్మీనారాయణ, కోట కిషోర్, కోటా నరసింహం, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయండి : బొల్లినేని



స్వామివారి సేవలో బొల్లినేని, మేకపాటి

కొండాపురం, మే 6: తెలుగుదేశం పార్టీ తరపున పోటీ చేసిన అభ్యర్థుల గెలుపు కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఉదయగిరి మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకటరామారావు అన్నారు. సోమవారం మండలంలోని గుడవళ్లూరు పంచాయతీలో రామలింగేశ్వరస్వామి ఆలయాన్ని మాజీ ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖరరెడ్డితో కలసి దర్శించుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ టీడీపీ అభ్యర్థుల గెలుపునకు తనతోపాటు మేకపాటి చంద్రశేఖరరెడ్డి కృషి చేస్తున్నారన్నారు. స్వామి ఆశీస్సులతో తెలుగుదేశం పార్టీని గెలిపించి రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడును చేసుకుందామన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు పోలినేని రమేష్, వట్టిగుంట పెరుమాళ్లనాయుడు, స్థానికులు సీహెచ్. వెంకటాద్రి, బీ.మాచెర్ల, వీ.మణికుమార్, తిమోతి తదితరులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

పదేళ్లుగా బోగోలు వాసుల కష్టాలు కనిపించలేదా ?

- ఎమ్మెల్యేని ప్రశ్నించిన కావ్య క్రిష్ణారెడ్డి



బిట్రగుంట : చిన్నారిని ఎత్తుకుని ప్రచారం రథంపై దగుమాటి

బిట్రగుంట, మే 6: బోగోలు వాసుల కష్టాలు పదేళ్లుగా ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డికి కనిపించలేదా అని టీడీపీ కావలి అభ్యర్థి దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి ప్రశ్నించారు. బోగోలు సోమవారం టీడీపీ మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బేతనీపేట నుంచి ప్రారంభమైన దగుమాటి ప్రచారం బోగోలు, యాదవపాలెం, కుమ్మరవీధి, అరవపాలెం, బోగోలు కూడలి, బృందావనంలో జరిగింది. ఈ సందర్భంగా దగుమాటి క్రిష్ణారెడ్డి మాట్లాడుతూ రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఏమి చేశారని ప్రశ్రించారు. నియోజకవర్గంలో యథేచ్ఛగా సాగుతున్న గ్రావెల్, మట్టి, ఇసుక మాఫియాకు బాస్‌గా వ్యవహరించారన్నారు. ఆయన పర్మిట్‌లు, అనుమతులు లేకుండానే రేయింబవళ్ల జరుగుతున్నాయా అన్నారు. భూకబ్జాలు, అన్యాయం అని అడిగిన వారిపై అక్రమ కేసులు బనాయించడం, వేధించడం ఎమ్మెల్యే అనుచరులు చేస్తున్న పనులన్నారు. కొత్తగా ఫిబ్రవరి నెలలో ఓ ఉపాధ్యాయుడు అమ్మవారి గుడికి దర్శనానికి వచ్చి తిరిగి వస్తున్న నాటి ఫొటోను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి అతని ఉద్యోగానికి ఎసరుపెట్టిన ఘనుడు ప్రతాప్‌రెడ్డి అన్నారు. బోగోలు రైల్వే ఎల్సీగేట్ గంటల తరబడి వేసి ఉండటం కారణంగా మండల ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నా పట్టించుకోలేదన్నారు. కావలి ఎమ్మెల్యేగా నన్ను, నెల్లూరు ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి గెలిపిస్తే కేంద్ర రైల్వే శాఖ ద్వారా బిట్రగుంట రైల్వే అభివృద్ధితో పాటు ఎల్సీ గేటు సమస్య పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమాలలో మాజీ ఎంపీటీసీ చిలకపాటి వేంకటేశ్వర్లు, సీనియర్ నేత గనిపినేని నాగరాజు, మాజీ సర్పంచు దొడ్ల అంజయ్య, బీజేపీ మండల అధ్యక్షుడు నూకసాని శ్రీనివాసులు, మహిళ అధ్యక్షురాలు రాజ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు. కాగా మాజీ మండల ఉపాధ్యక్షుడు కోడూరు లక్ష్మీరెడ్డి, ఆయన అనుచరులు పాపన సుబ్బారెడ్డి, యర్రం చెన్నారెడ్డి, మూలిగి శ్రీనివాసులురెడ్డి, బత్తల ప్రసాద్‌రెడ్డి తదితర వంద మంది వైసీపీని వీడి దగుమాటి సమక్షంలో టీడీపీలో చేరారు. బోగోలుకు చెందిన వ్యాపార సంఘ నేత కాండ్ర శంకర్‌నాయుడు అతని అనుచరులతో టీడీపీ కండువ కప్పుకున్నారు.

కావలి : కావలి పట్టణం, రూరల్ మండలాల్లో సోమవారం పలువురు వైసీపీ నేతలు టీడీపీలో చేరారు. వారికి అభ్యర్థి దగుమాటి వెంకట(కావ్య) క్రిష్ణారెడ్డి టీడీపీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. రూరల్ మండలం చెంచుగానిపాలెంలో సర్పంచు దద్దాల ప్రభాకర్ గౌడ్, దద్దాల వెంకటస్వామి, దద్దాల రామకృష్ణ, దద్దాల వెంకట కృష్ణ ఆధ్వర్యంలో వైసీపీకి చెందిన దద్దాల అచ్చయ్య, దద్దాల యానాది, దద్దాల మల్లికార్జున, పోసిన వెంకటరమణయ్య, దద్దాల రాజు తదితరులు టీడీపీలో చేరారు. సర్వాయపాలెం పంచాయతీ మాతినవారిపాలెంకు చెందిన వైసీపీ ముఖ్యనాయకుడు సందు రాములు వైసీపీని వీడి ఉప్పాల వెంకట్రావు ఆధ్వర్యంలో కావలి టీడీపీ కార్యాలయంలో టీడీపీలో చేరారు. అలాగే పురిణి శ్రీనివాసులు రెడ్డి, ఆత్మకూరు శ్రీనివాసులు తదితరులు మొగిలిశెట్టి ఆనందరావు ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. పట్టణంలోని 6వ వార్డు వెంగాయగారిపాలెంకు చెందిన వైసీపీ ముఖ్య నాయకులు మాతిన శ్రీనివాసులు, ఉప్పాల వినోద్‌లు వైసీపీని వీడి టీడీపీ నేతలు జంపాని ప్రసాద్, ఉప్పాల శ్రీనివాసులు, గుడిపల్లి శ్రీను ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. అలాగే 7వ వార్డుకు చెందిన వైసీపీ కాపునేత కందుల శ్రీనివాసులు టీడీపీలో చేరారు.



బిట్రగుంట : బోగోలులో ప్రచారంలో పాల్గొన్న దగుమాటి



కావలి : టీడీపీలో చేరిన వారితో కావ్య

సమాజసేవలో కావ్య కృష్ణారెడ్డి ట్రస్ట్

- పదేళ్ల కృషి.. సాకారమయ్యే తరుణం
- సేవాకార్యక్రమాలతో గుర్తింపు పొందిన 'కావ్య'
- మంచితనానికి పెరుగుతున్న ప్రజామద్దతు
- కలిసొస్తున్న కొత్త శక్తులు

'గెలిపిస్తే ఎంతో సేవ చేస్తాం'... అనే రాజకీయ నాయకులు నేడు ఎంతోమంది ఉన్నారు. అసలు రాజకీయాల్లోకి రాకముందే ప్రజలకు తన కష్టార్జితం నుంచి కొంత మొత్తాన్ని ఖర్చు చేసేవారు చాలా అరుదు. అలాంటివారిలో దగుమాటి వెంకటకృష్ణారెడ్డి(కావ్య కృష్ణారెడ్డి) ఒకరు. రాజకీయాల్లోకి రావాలనే ఆలోచన రాకమునుపే సుమారు పదేళ్లుగా ఆయన పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కావ్య చారిటబుల్ ట్రస్ట్ స్థాపించి తద్వారా అందించిన సేవలతో ఆయన కావ్య కృష్ణారెడ్డిగా పేరొందారు. ఆయన సేవలకు ప్రతిఫలంగా తెలుగుదేశం టికెట్ వరించింది. తొలి జాబితాలోనే కావలి అభ్యర్థిగా దగుమాటి వెంకటకృష్ణారెడ్డి పేరును తెలుగుదేశం అధిష్ఠానం ప్రకటించిందంటే ఆయన చేసిన, చేస్తున్న సేవా కార్యక్రమాలే ఇందుకు కారణం.

నెల్లూరు, మే6(ఆంధ్రజ్యోతి): దగుమాటి వెంకటకృష్ణారెడ్డికి విద్యార్థి దశలోనే నాయకత్వ లక్షణాలు అలవడ్డాయి. ఏబీవీపీ నాయకుడిగా విద్యార్థి సమస్యలపై పోరాడారు. సమాజంలోని పలు రుగ్మతలపై విద్యార్థి నాయకుడిగా ఎన్నో పోరాటాలు చేశారు. అప్పటి నుంచే సేవా కార్యక్రమాలు చేయడం ప్రారంభించారు. విద్యార్థి నాయకుడిగా తనకున్న పరిధిలో తోటి విద్యార్థులకు, అందుబాటులో ఉన్న పేదలకు తన చేతనైనంత సాయం చేసేవారు. ఎవరికి ఏ సమస్య వచ్చినా అండగా నిలబడేవారు. ఇలా విద్యార్థి దశలో మొదలైన ఈ సేవాగుణం ఆయనతోపాటు పెరిగి నియోజకవర్గ స్థాయికి విస్తరించింది. కొన్ని వేలమందికి సాయం అందించే ఆపన్నహస్తంగా గుర్తింపు పొందింది.

పేదల పెళ్లిళ్లకు సాయం

ఎవర్శికైనా సరే.. పెళ్లి ఓ మధురమైన ఘట్టం. అలాంటి సందర్భాన్ని ధనవంతులయితే ఘనంగా జరుపుకుంటారు. కానీ నిరుపేదలకు ఆ అదృష్టం ఉండదు. కాస్త సరదాకు కూడా డబ్బులుండవు. జీవితాంతం గుర్తుండిపోయే ఆ మధుర ఘట్టమైనాసరే వారు సాదాసీదాగా జరుపుకోక తప్పనిపరిస్థితి. అలాంటి నిరుపేదవర్గాల్లో కాసింత సంతోషం నిలపాలని, వారికి పెళ్లి అనేది ఓ సంబరం చేయాలనే మానవీయ దృక్పథంతో కావ్య కృష్ణారెడ్డి తన ట్రస్ట్ ద్వారా పెళ్లి కానుక పథకాన్ని ప్రారంభించారు. కొత్తగా పెళ్లి చేసుకునే పేద దంపతుల వివాహాలకు హాజరై పెళ్లి పీటలపైనే వధూ వరులకు రూ. 10వేల ఆర్థిక సాయం అందిస్తూ వస్తున్నారు. ఆ డబ్బుతో వారు కాసింత సంబరాలు చేసుకొని, ఆ జ్ఞాపకాలను జీవితాంతం గుర్తుంచుకునేలా చేశారు. కావలి, ఉదయగిరి నియోజకవర్గాల పరిధిలో వందలాదిమంది జంటలకు పెళ్లి కానుక కింద ఆయన ఆర్థికసాయం చేశారు.



నూతన వధూవరులకు పెళ్లికానుక కింద రూ.10వేల ఆర్థిక సాయం ఇస్తున్న కావ్య కృష్ణారెడ్డి

కావ్య ట్రస్ట్ ద్వారా విస్తృత సేవలు

వ్యాపార రంగంలో స్థిరపడిన తరువాత వెంకటకృష్ణారెడ్డి సేవా కార్యక్రమాలను విస్తృతం చేశారు. తన సంపాదనలో కొంత పేదలకు పంచడం అలవాటుగా మార్చుకున్నారు. ఈ క్రమంలోనే కావలి, ఉదయగిరి నియోజకవర్గాల పరిధిలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు.



విద్యకు, పాఠశాలల అభివృద్ధికి సాయం

మారుమూల ప్రాంతంలో సామాన్య రైతు కుటుంబం లో పుట్టిన కృష్ణారెడ్డి కష్టపడి ఎంకాం పూర్తి చేశారు. చదువుకు ఉన్న విలువ ఆయనకు తెలుసు. చదువు పూర్తయ్యాక అధ్యాపకుడిగా జీవితం ఆరంభించారు. ఆ సమయంలో పేద విద్యార్థులు అనుభవించే కష్టాలను కళ్లారా చూశారు. దీంతో ఆయన వ్యాపార రంగంలోకి అడుగుపెట్టిన తరువాత తన సంపాదనలో కొంతమొత్తాన్ని పేద విద్యార్థుల చదువుకు ఉపయోగపడేలా ఖర్చు చేయాలనుకున్నారు. అందులో భాగంగా ఉదయగిరి, కావలి నియోజక వర్గాల పరిధిలోని వేలాదిమంది స్కూలు పిల్లలకు ఉచితంగా బ్యాగులు, పుస్తకాలు పంపిణీ చేశారు. తాగునీటి వసతిలేని పాఠశాలల్లో సొంత ఖర్చులతో బోర్లు వేయించారు. ఎన్నో పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు భారీగా ఖర్చు చేశారు. పాఠశాలల వార్షికోత్సవాలకు రూ. 25వేల చొప్పున విరాళం అందించారు.



పేదలకు మంచాలు అందజేస్తున్న కృష్ణారెడ్డి

పేదలకు మంచాల పంపిణీ

పొలాల గట్లపైనా, కొండల్లో, గుట్టల్లో... ఊరికి దూరంగా పూరిగుడిసెల్లో కాపురం ఉండే అణగారిన వర్గాలు పడుకోవడానికి చాప, దిండు కూడా సక్రమంగా ఉండవు. అలాంటివారి దీనస్థితిని గమనించిన దగుమాటి కృష్ణారెడ్డి తన ట్రస్ట్ ద్వారా వారికి సేవలందించారు. ఉదయగిరి, కావలి నియోజకవర్గాల పరిధిలోని కొన్ని వందల కుటుంబాల వారిని గుర్తించి, ఒక్కో ఇంటికి ఒక్కో మంచం చొప్పున పంపిణీ చేశారు. ఆయన అందించిన సాయంతో వందలాది కుటుంబాలవారు రాత్రి పూట హాయిగా నిద్రిస్తున్నారు.

దప్పిక తీర్చిన జలదాత

కరువు ప్రాంతాలయిన ఉదయగిరి, కావలి మెట్ట ప్రాంతాల్లోని పలుగ్రామాల దాహార్తి తీర్చిన జలదాతగా ఆయన గుర్తింపు పొందారు. ఈ రెండు నియోజకవర్గాల్లో తీవ్ర నీటిఎద్దడి నెలకొన్న సందర్భాల్లో కృష్ణారెడ్డి తన సొంత ఖర్చులతో ట్యాంకర్ల ద్వారా గ్రామాలకు నీటిని సరఫరా చేశారు. కొన్నేళ్లపాటు వేసవి ఎద్దడి నెలకొన్న ప్రాంతాలకు కొన్ని నెలలపాటు ఆయన ట్యాంకర్లతో ఉచిత ంగా మంచి నీటి సరఫరా చేశారు.





స్కూలు విద్యార్థులకు బ్యాగులు అందజేస్తున్న..

వ్యాపారవేత్తగా గుర్తింపు


అధ్యాపక వృత్తికి రాజీనామా చేసిన అనంతరం దగుమాటి కృష్ణారెడ్డి రియల్ ఎస్టేట్ రంగంలోకి అడుగుపెట్టారు. నీతివంతమైన వ్యాపారంతో తక్కువ రోజుల్లోనే ఎక్కువ గుర్తింపు పొందారు. 2011లో గురురాఘవేంద్ర ఇన్ఫ్రాస్ట్రక్చర్‌ను ప్రారంభించి పలు రాష్ట్రాల్లో కార్యకలాపాలను విస్తరించారు.

అంచలంచెలుగా ఎదిగిన రాజకీయ నాయకుడు

కావ్య కృష్ణారెడ్డి ఉన్న పళంగా రాజకీయాల్లోకి వచ్చిన వ్యక్తి కాదు. కిందస్థాయి నుంచి పైకి ఎదిగిన నేత. 2005-06లో జలదంకి సహకార సంఘ అధ్యక్షునిగా పనిచేశారు. 2006-2011 వరకు జలదంకి మండల పరిషత్ అధ్యక్షునిగా (ఎంపీపీ) సేవలందించారు. 2005 నుంచి కావలి, ఉదయగిరి నియోజకవర్గాల్లో తెలుగుదేశం పార్టీ క్రియాశీల నాయకునిగా వ్యవహరిస్తు వచ్చారు. 2019లో ఉదయగిరి నుంచి టీడీపీ టికెట్ కోసం తీవ్రంగా ప్రయత్నించారు. ఇన్నేళ్లపాటు ఆయన పార్టీకి చేసి న సేవలను గుర్తించిన తెలుగు దేశం అధిష్ఠానం ఈ ఎన్నికల్లో కావలి అభ్య ర్థిగా బరిలోకి దింపిం ది. సేవా గుణం, కార్యకర్తలను కాపాడుకునే నైజం, ప్రజల కు మంచి చేయాలనేత త్వం ఉన్న కృష్ణారెడ్డి పట్ల ప్రజల్లో మంచి సానుకూ లత వ్యక్తం అవుతోంది. ఆయన నిర్వ హిస్తున్న ఎన్నికల ప్రచారానికి విశేష స్పందన లభిస్తోం ది. ఆయన నాయకత్వాన్ని బలపరుస్తూ టీడీపీలో కొత్తగా చేరేవారి సంఖ్య రోజు రోజుకు పెరుగుతోంది.

ఆంధ్రజ్యోతి జన కేతనం
మంగళవారం 7 మే 2024

కండలేరు ఎడమ కాలువ ఎత్తిపోతల పథకానికి విద్యుత్ బిల్లుల గ్రహణం పట్టుకుంది. బిల్లులు చెల్లించకపోవడంతో కండలేరులో నీరున్నా, పొదలకూరు మండలంలోని 12 వేల ఎకరాలను రైతులు బీడు పెట్టుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి సొంత మండలంలోనే అన్నదాతలు సాగునీరు లేక అవస్థలు పడుతుంటే, జిల్లావ్యాప్తంగా పరిస్థితి ఏమిటని వారు ప్రశ్నిస్తున్నారు. సాగునీటి విషయమై విపక్షాలు ఆందోళన చేసినా పాలకులు, అధికారులు పట్టించుకోలేదు. దీంతో నిమ్మ, సవక, జామాయిల్, పత్తి రైతులు ఇబ్బందులు పడ్డారు.





- లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌కు కరెంటు చార్జీలు చెల్లించక కాలయాపన
- రెండేళ్లుగా ఆగిన కండలేరు లైనింగ్ పనులు
- సాగునీరు అందక బీడుగా 12వేల ఎకరాలు
- రైతులను ముంచిన పాలకులు
- జగనా... ఇదేనా రైతు సంక్షేమం?

రూ.68 కోట్లతో పథకం

సర్వేపల్లి నియోజకవర్గంలోని పొదలకూరు, వెంకటాచలం, మనుబోలు, ఆత్మకూరు నియోజకవర్గంలోని చేజర్ల, వెంకటగిరి నియోజకవర్గంలోని సైదాపురం మండలాల రైతులకు సాగునీరందించేందుకు 2016లో టీడీపీ ప్రభుత్వం రూ.68కోట్లతో ఎత్తిపోతల పథకాన్ని నిర్మించింది. కండ లేరు ఎడమ కాలువకు నీరు మళ్లిస్తే సుమారు 20,704 ఎకరాలకు అధికారికంగా, మరో 4వేల ఎకరాలకు అనధికారికంగా సాగునీరందించేలా పథకాన్ని రూపొందించారు. మూడు నెలలుగా వర్షాలు లేక నిమ్మ, మామిడి, సవక, పత్తి పైర్లు ఎండిపోతున్నాయి. ఈ విషయాన్ని పలుమార్లు రైతులు మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి, ఉన్నతాధికారులకు విన్నవించినా పట్టించుకోలేదు. ప్రస్తుతం కండలేరు జలాశయంలో 13.8 టీఎంసీల నీరు నిల్వ ఉంది. విద్యుత్ బిల్లులు చెల్లించి పంటలకు నీరందించాలని వేడుకుంటున్నా రైతుల మొర ఆలకించే నాథుడే కరువయ్యాడు. గత టీడీపీ హయాంలో డెడ్‌స్టోరేజీ ఉన్న సమయంలో కూడా లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా నీటిని అందించిన నిమ్మ చెట్లను కాపాడిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందని రైతులు అంటున్నారు.

'ఎత్తిపోతల'కూ షాక్!

పొదలకూరు, మే 6 : వైసీపీ ప్రభుత్వం అధికారం లోకి వచ్చాక విద్యుత్ బిల్లులు చెల్లించపోవడంతో అప్పు లు చేసి పంటలు సాగు చేసిన రైతులంతా భారీగా నష్టపోయారు. నీటిని విడుదల చేయాలని రైతులు ఆందోళన చేసినా కనికరించలేదు. ఎన్నికలు సమీపించడంతో మభ్యపెట్టేందుకు కొన్ని రోజుల క్రితం నీరు విడుదల చేశారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

రెండేళ్లుగా ఆగిన పనులు

తెలుగుగంగ పథకంలో భాగమైన కండలేరు ఎడమ కాలువ లైనింగ్ పనులు ఏడు నెలలుగా ఆగిపోయాయి. ఈ కాలువ ద్వారా మూడు మండలాల్లోని 32 చెరువుల కు నీరు అందడంతోపాటు, 27వేల ఎకరాలకు నీరందు తోంది. తెలుగుగంగ హైలెవల్ స్లూయిజ్ నుంచి కనుపూరు కాలువ వరకు ఈ లైనింగ్ పనులకు రూ.39.12 కోట్లు మంజూ రయ్యాయి. ఈ మేరకు మంత్రి కాకాణి గత నెలలో పనులు ప్రారంభించారు. ప్రస్తుతం పులికల్లు స్పిల్‌వే దాటి, నరసింహ కండ్రిగ గ్రామ సమీపం వరకు పనులు (సుమారు 55 శాతం) చేశారు. మిగిలిన పనులను అసం పూర్తిగా వదిలేశారు. ఈ కాలువ లైనింగ్ పనులు పూర్తయితే ఆయకట్టు విస్తీర్ణం రెట్టింపు అయ్యే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం కాలువకు 350 క్యూసెక్కుల నీటిని మాత్రమే విడుదల చేసే సామర్థ్యం ఉండగా, లైనింగ్ పనులు పూర్తయితే 455 క్యూసెక్కుల నీటిని విడుదల అవకాశం ఉంటుంది. రెండేళ్లుగా వైసీపీ ప్రభుత్వం రైతుల ఆశలను అడియా శలు చేస్తూనే వస్తుంది. మంత్రి కాకాణి ప్రత్యేక చొరవ చూపు ఉంటే ఎప్పుడో లైనింగ్ పనులు పూర్తయ్యేవని, కమీషన్ మీద ఉన్న శ్రద్ధ లైనింగ్ పనులపై లేదని మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి విమర్శిస్తూనే ఉన్నారు.


కండలేరు ఎడమ కాలువ లైనింగ్ పనులు

పంటలు ఎండుతున్నా.. పట్టించు కోలేదు !



కండలేరు లిఫ్ట్ ఇరిగేషన్‌కు మంత్రి కాకాణి కరెంటు బిల్లులు రూ.9 కోట్లు కట్ట లేకపోయారు. ఆయన సొంత మండలంలో పంటలు ఎండిపోతుంటే పట్టించుకోలేదు. రైతులకు సరైన సమయంలో నీరిచ్చి ఉంటే నిమ్మ, సవక, మామిడి, పత్తి రైతులకు మేలు జరిగేది. ఐదేళ్లపాటు కాలం గడిపేశారు. రైతులే త్వరలో బుద్ధి చెబుతారు.

- నెట్టెం పెంచలయ్య, నిమ్మరైతు, వావింటపర్తి

మూడేళ్లుగా పూర్తి కాని పనులు



ఏడాదిలో పూర్తి చేయాల్సిన కండలేరు ఎడమ కాలువ లైనింగ్ పనులను మూడేళ్లుగా చేస్తూనే ఉన్నారు. నాయకుల కమీషన్ కోసం లైనింగ్ పనులు చేస్తున్నారు. పనులు పూర్తి చేయకుండా ఇంకా అసంపూర్తిగా పెట్టడం సిగ్గుచేటు. ఈ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాల్సిన సమయం ఆసన్నమైంది.

- కోడూరు పెంచలభాస్కర్‌రెడ్డి, రాష్ట్ర రైతు సంఘం నాయకుడు, మొగళ్లూరు

క్షుద్రపూజల వస్తువుల కంటే మోసం చేసే నాయకులతోనే హాని

- రోడ్డు వేయలేని వారికి మళ్లీ ఓట్లు వేయాలా!?
- అల్లూరులో వినూత్న రీతిలో టీడీపీ నిరసన


ముగ్గువేసి, అందులో నిమ్మకాయలు, కోడిని ఉంచి నిరసన వ్యక్తం చేస్తున్న టీడీపీ నాయకులు

అల్లూరు. మే 6 : క్షుద్రపూజల్లో వినియోగించే నల్లకోడి, నిమ్మకాయ, పసుపు కుంకుమలను సమాజానికి ఎటువంటి హానీ తలపెట్టవని, అయితే, నమ్మించి ఓట్లు వేయించుకొనే మోసపూరిత నాయకుల వల్లే సమాజానికి తీవ్ర హాని అని విశ్రాంత ప్రిన్సిపాల్, టీడీపీ నాయకుడు మేడా రామకృష్ణారెడ్డి తెలిపారు. కావలి, కోవూరు నియోజకవర్గాల సరిహద్దు ప్రాంతమైన పైడేరు వద్ద సోమవారం సాయంత్రం గుంతలమయమైన రాజుపాలెం-ఇస్కపల్లి రోడ్డును చూపుతూ నాయకులు వినూత్న నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ నాలుగేళ్లుగా రోడ్డు దుస్థితి కారణంగా వాహనదారులు అవస్థలు పడ్డారన్నారు. నమ్మించి ఓట్లు వేయించుకొని పదవులు పొంది లగ్జరీ కార్లలో తిరుగుతూ మనల్ని పట్టించుకోని నాయకుల వల్ల ప్రమాదమని కావలి, కోవూరు ఎమ్మెల్యేలు రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి, నల్లపరెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డి, నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డిలను ఉద్దేశించి మాట్లాడారు. ఈ నెల 13న జరిగే ఎన్నికల్లో ప్రజలు ఆలోచనతో సైకిల్ గుర్తుకు ఓటు వేసి ఇటువంటి దుస్థితి నుంచి విముక్తి పొందేలా మంచి నాయకులను ఎన్నుకోవాలని కోరారు. ఈ నిరసనలో నాయకులు అరగల రమణయ్య, కప్పిర విష్ణు, రామకృష్ణారెడ్డి, పోట్లూరు శీనయ్య, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ఏమైందంటి నిఘా!



ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులు ఖర్చుచేసే ప్రతి రూపాయిని వ్యయ పరిశీలకులు నిఘా ఉంచి లెక్కించనున్నారు. ఇందుకుగాను ఈ ఏడాది కొత్తగా విజిలెన్స్ అధికారుల కారుపై సీసీ కెమెరా అమర్చారు. అయితే అభ్యర్థులు తమ ప్రచారంలో విచ్చలవిడిగా లక్షలాది రూపాయలు ఖర్చు చేసినా, విజిలెన్స్ అధికారులు మాత్రం చూసీచూడనట్లు వ్యవహ రిస్తున్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఎంపీ అభ్యర్థి రూ.95లక్షలు, ఎమ్మెల్యే అభ్యర్థి రూ.40 లక్షలు మాత్రమే ఖర్చు పెట్టాలి. అయితే ప్రధానపార్టీ అభ్యర్థులు ర్యాలీలు, విజయోత్సవ సభ లకు రోజుకు రూ.లక్షల్లో చేస్తున్నా నిఘా నేత్రాలకు మాత్రం కానరావడం లేదు.

- కలిగిరి


బస్సులు పెడుతున్నాం.. బయలు దేరండి !



ఈ సార్వత్రిక ఎన్నికలు అధికార, ప్రతిపక్ష పార్టీలకు ప్రతిష్టాత్మకంగా మారాయి. ఎన్నడూ లేని విధంగా వలస ఓటర్లను సైతం తీసుకు వచ్చేందుకు ఏర్పాట్లు చేస్తు న్నారు. గతంలో స్థానిక సంస్థల ఎన్నికలకు మాత్రమే వలస ఓటర్లను తీసుకువచ్చే వారు. ఈసారి ఎంత ఖర్చయినా గెలుపే ప్రధానమని అభ్యర్థులు చెబుతున్నారు. అందుకే వలస ఓటర్లకు ఫోన్ చేసి ఇక్కడకు రప్పించే ప్రయత్నాలు చేస్తు న్నారు. దూర ప్రాంతాల్లో ఉన్న వారి కోసం బస్సులు ఏర్పాటు చేస్తున్నారు. కందుకూరు నియోజకవర్గం వారు ఎక్కువగా హైదరాబాద్, చెన్నై, విజయవాడ, బెంగళూరు, తిరుపతి, పూణే, వైజాగ్ తదితర పట్టణాలలో స్థిరపడ్డారు. వారందరికీ ఫోన్లు చేసి బస్సులు పెడుతున్నాం... ఓట్లు వేయడానికి రావాలని ఆహ్వానిస్తున్నారు. బస్సులు ఏర్పాటు చేయనిచోటుకు ప్రయాణ ఖర్చులకు డబ్బులు పంపుతున్నారు. ఇక్కడకు వచ్చాక మిగతా విషయాలు మాట్లాడతామని తెలియజేస్తున్నారు.

- వలేటివారిపాలెం

నాడు హుందాతనం.. నేడు గోల గోల !



నేడు ఎన్నికల ప్రచారమంటే చెవులు తూట్లు పడేలా మైకుల గోల.. బాణసంచా పేలుళ్ల శబ్దాలు.. డప్పుల మోతలు... భారీగా అలంకరించిన ప్రత్యేక ప్రచార రథాలు... డీజే బాక్సులే... ఇవి లేకుంటే ప్రచారం అనిపించు కోదేమో అన్నట్లు ఉంటున్నాయి. ఉదయం నుంచి రాత్రి 10గంటల దాకా ఆటోల్లో మైకులతో ప్రత్యర్థులపై విమర్శలు, అభ్యర్థుల సొంత డబ్బాలతో చెవులు తూట్లు పడేలా ఉపన్యాసాలు ఉంటున్నాయి. అదే తొలినాళ్లలో ఎన్నికల ప్రచారం నిశ్శబ్దంగా ఉండేది. ఏదైనా పార్టీ అభ్యర్థి నలుగురితో కలిసి ఇంటింటికి వెళ్లి ఓటు వేయమని ప్రచారం చేసేవారు. అలాగే వివాహ ఆహ్వాన పత్రిక మాదిరిగా అభ్యర్థి గుణగణాలు తెలిపే కరపత్రాన్ని ముద్రించి ఇంటింటికి పంచేవారు. దాంతో ప్రచారం పూర్తయినట్లే.

- ముత్తుకూరు

'నన్ను గెలిపించండి.. అధికారంలోకి వచ్చాక గోపాలమిత్రలకు సరైన న్యాయం చేస్తాను... నమ్మండి... నన్ను దీవించండి'...అని జగన్ మోహన్‌రెడ్డి ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు అన్నమాటలివి. ఐదేళ్ల కిందట వారికిచ్చిన హామీ దేవుడెరుగు ..కనీసం గౌరవ వేతనంతోపాటు ప్రోత్సాహకాలు కూడా సక్రమంగా అందించని పరిస్థితి నేడు నెలకొంది. దీంతో జగన్ మమ్మల్ని నమ్మించి మోసం చేశారంటూ గోపాలమిత్రలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గోపాలమిత్రల గోడు పట్టదా ?

- ఉద్యోగ భద్రత హుళక్కే...
- ఏడాదిగా అందని ప్రోత్సాహకాలు

నెల్లూరు (వ్యవసాయం), మే 6: ప్రతిపక్షనేతగా పాదయాత్ర సమయంలో గోపాలమిత్ర లకు అండగా ఉంటామని, గౌరవ వేతనం రూ.16,000లు చేస్తామంటూ హామీ ఇచ్చిన జగన్‌రెడ్డి, ఐదేళ్లుగా ఒక్క రూపాయి కూడా పెంచలేదు. 2006లో గోపాలమిత్ర వ్యవస్థ మొదలైంది. అప్పట్లో వీరికి దాదాపు రూ.1,200ల గౌరవ వేతనం ఇస్తూ మూడు నెలలపాటు శిక్షణ ఇచ్చారు. అనంతరం నెలకు రూ.3,500లకు పెంచారు. 2018లో టీడీపీ ప్రభుత్వంలో చంద్రబాబు వీరికి రూ.6,500 లు గౌరవ వేతనం ఇచ్చారు. ప్రారంభంలో వీరు పాడిరైతుల ఇంటికి వెళ్లి సేవలందించేవారు. ఇది ఎంతో ఉపయోగకరంగా ఉండేది. అయితే గోపాలమిత్రలకు రూ.16వేలు గౌరవ వేతనం ఇస్తామంటూ హామీఇచ్చి అధికారంలోకి వచ్చిన జగన్ ప్రభుత్వం ఆఊసే మరచిపోయింది. రైతు భరోసా వ్యవస్థను ఏర్పాటు చేసి తమను పూర్తిగా విస్మరించారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పశువులకు ఏదైనా జబ్బు చేస్తే వైద్యులకంటే ముందుగా వెళ్లి ప్రథమ చికిత్స చేసేది గోపాలమిత్రలే. అంతేకాక ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయిలో అందించేది వారే. ప్రభుత్వ పథకాలైన కృత్రిమ గర్భధారణ, వైద్య సేవలు, డీవార్మింగ్, వ్యాక్సినేషన్లలో వీరు ఎంతో కీలకంగా పనిచేస్తున్నా గుర్తింపు లేదు. క్షేత్రస్థాయిలో పాడి అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్న వీరిని ప్రభుత్వం విస్మరించింది. గౌరవ వేతనం కూడా మూడు నెలలకు ఒక సారి అందుతోందని, అదికూడా అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరిగితే బిల్లులు పెడుతున్నారంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రోత్సాహకాలూ కరువే..



క్షేత్రస్థాయిలో పశువులకు వైద్యసేవలందించే తమను ప్రభుత్వా లు నిర్లక్ష్యం చేస్తున్నాయి. ఉద్యోగ భద్రత కల్పిస్తామని సీఎం ఇచ్చిన హామీ నెరవేరలేదు. ఏళ్లుగా సేవలందిస్తున్న తమను నిర్లక్ష్యం చేయ డం సరికాదు. గత మూడు నెలలుగా గౌరవ వేతనాలు రాలేదు. అదే మని ఎన్నికలు అయిన తరువాత ఇస్తామంటూ సమాధానం ఇస్తు న్నారు. జిల్లాలో దాదాపు 109 మంది గోపాలమిత్రలు సేవలం దిస్తున్నారు. వారికి గత ఏడాది కాలంగా కనీసం ప్రోత్సాహకాలు కూడా ఇవ్వలేదు. ఒక్కొక్కరికి సరాసరి కనీసం రూ.2వేలకు పైగా ప్రోత్సాహకాలు రావాల్సి ఉంది. ప్రభుత్వాలు తమను గుర్తించాల్సిన అవసరం ఉంది.

- సర్వేపల్లి వెంకటేశ్వర్లు, గోపాలమిత్ర

మూడు నియోజకవర్గాల్లోని ప్రాంతాల కలయికతో ఏర్పాటు


ఓసారి కాంగ్రెస్, రెండుసార్లు వైసీపీ విజయం

భిన్నవర్గాల సెగ్మెంట్
నెల్లూరు రూరల్

నెల్లూరురూరల్, మే 6 : 2009లో అసెంబ్లీ నియోజకవ ర్గాల పునర్విభజనలో జిల్లాలోని రాపూరు, అల్లూరు నియోజకవర్గాలను తొలగించారు. కొత్తగా నెల్లూరు రూరల్ నియోజకవర్గాన్ని ఏర్పాటు చేశారు. నెల్లూరు నగరంలోని కొన్ని మున్సిపల్ డివిజన్లతోపాటు, రాపూరు నియోజకవర్గంలోని 17 గ్రామాలు, సర్వేపల్లిలోని 16 గ్రామపంచాయతీలతో కలిపి నెల్లూరురూరల్ సెగ్మెంట్‌ను రూపొందించారు. ఈ మూడు సెగ్మెంట్లను కలుపుకుని ఏర్పాటుకాగా విభిన్నవర్గాల నియోజకవర్గంగా ఇది పేరొందింది. ఇక్కడ నుంచి మొదటి ఎమ్మెల్యేగా కాంగ్రెస్ నుంచి ఆనం వివేకానందరెడ్డి పోటీ చేసి గెలుపొందారు. ఆ తరువాత 2014, 19 ఎన్నికల్లో వైసీపీ నుంచి పోటీ చేసిన కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఎమ్మెల్యేగా గెలుపొందారు. కాగా 2009లో సీపీఎంకి టీడీపీ మద్దతు పలికింది. 2014లో బీజేపీ అభ్యర్థి సన్నపరెడ్డి సురేష్‌రెడ్డికి టీడీపీ జైకొట్టింది. 2019 ఎన్నికల్లో టీడీపీ తరఫున బరిలోకి దిగిన అబ్దుల్ అజీజ్ ఓటమిపాలయ్యారు. వ్యవసాయ పరంగా డెల్టా, నాన్‌డెల్టాతోపాటు నెల్లూరు సిటీ నియోజకవర్గం కంటే విస్తీర్ణంలో పెద్దదిగా ఉంది. బీసీవర్గాలతోపాటు ముస్లింల ఓటర్లు ఇక్కడ కీలకం. నెల్లూరు సిటీకి లభించే సహజవనులన్నీ రూరల్లో నియోజకవర్గంలోనే ఉన్నాయి. నగర గ్రామ దేవత ఇరగాల పరమేశ్వరిదేవి రూరల్లోనే కొలువుతీరి ఉన్నారు. కమ్యూనిస్టులకు జిల్లాలోనే ఈ నియోజకవర్గ పంచాయతీల్లోనే కొంత పట్టుంది. ప్రస్తుతం 26 మున్సిపల్ డివిజన్లు, 18 గ్రామ పంచాయతీలతో ఈ నియోజకవర్గం విస్తరించి ఉంది.

ముఖచిత్రం




నెల్లూరు రూరల్ సెగ్మెంట్ వ్యూ

నెల్లూరు సిటీ
నెల్లూరు రూరల్



గుంతలు ఓవర్

- ప్రమాదకరంగా వెంకటేశ్వరపురం ఫ్లైఓవర్
- పలుచోట్ల దెబ్బతిన్న రహదారి
- కమ్ములు బయటపడి హెచ్చరికలు
- కూలిపోయిన రక్షణ గోడ

నగరంలోని వెంకటేశ్వరపురంలో గల టీ ఆకారపు ఫ్లై ఓవర్ వంతెనపై ప్రయాణం ప్రమాదకరంగా మారింది. విజయవాడ, ముంబయి తదితర ప్రాంతాల నుంచి నిత్యం లారీలు, బస్సులతోపాటు వేలాది వాహనాలు ఈ వంతెన మీదుగా రాకపోకలు సాగిస్తుంటాయి. అయితే నిర్వహణ లోపంతో వంతెన అధ్వానంగా తయారైంది. బ్రిడ్జిపై రహదారి పలు చోట్ల ధ్వంసమైంది. పిల్లర్ల జాయింట్ వద్ద గల కమ్ములు దెబ్బతిని రోడ్డు సైతం కుంగిపోయింది. గుంతలుపడ్డ రోడ్డుపై ప్రయాణించడానికి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కమ్ములు దెబ్బతిన్న చోట టైర్లు తగిలి పంచర్ అవుతున్నా యని వాపోతున్నారు. దీనికితోడు గుంతల వల్ల ఈ వంతెనపై నిత్యం ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయి. వెంకటేశ్వరపురం కూడలి వద్ద బ్రిడ్జి రక్షణగోడ దెబ్బతిని రాళ్లు వంతనపై నుంచి కింద పడుతున్నాయి. దీంతో స్థానికులు వంతెన కిందగా వెళ్లడానికి భయపడుతు న్నారు. నెల్లూరు నగరం నుంచి బయటి ప్రాంతాలకు వెళ్లేందుకు ముఖ్యమైన ఈ వంతెనను కొన్నేళ్లుగా పాలకులు, అధికారులు పట్టించుకోకపోవడంతో రోజురోజుకు ప్రమాదకరంగా మారుతోంది.

- నెల్లూరు (వెంకటేశ్వరపురం)





ఫ్లైఓవర్ వంతెనపై గుంతలతో నిండిన రహదారి, దెబ్బతిన్న బ్రిడ్జి రక్షణ గోడ

ఎన్నికల పర్వం

బెలూన్స్ భలే ఉన్నాయే!

ఆకట్టుకుంటున్న ప్రచార బెలూన్లు



నెల్లూరు(స్టోన్‌హౌస్ పేట). మే 6: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ తేదీ దగ్గర పడుతుండటంతో ఎన్నికలపై ప్రచారం, ప్రజలకు అవగాహన కల్పిస్తూ నగరంలోని పలు కూడళ్లలో అధికారులు ఏర్పాటు చేసిన బెలూన్ బొమ్మలు ఆకట్టుకుంటున్నాయి. గాంధీ బొమ్మ కూడలిలో పోలింగ్ కేంద్రం నమూనాతో ఈవీఎం, వీవీపాట్, తదితర బొమ్మలను ఏర్పాటు చేశారు. ఈ నెల 13వ తేదీన పోలింగ్ అని తెలియజేస్తూ ఈ బొమ్మలపైన వివరాలు ముద్రించారు. నగర ప్రజలతోపాటు పనులపై నగరానికి వచ్చే ఇతర ప్రాంతాల ప్రజలు ఈ బొమ్మలను ఆగి మరి చూసి వెళుతున్నారు.

టీడీపీ ట్రెండ్ మొదలైంది : కోటంరెడ్డి

నెల్లూరు (వైద్యం), మే 6 : ప్రభుత్వ ఉద్యోగుల బ్యాలెట్ ఓట్లన్నీ టీడీపీకే అని, రాష్ట్రంలో టీడీపీ ట్రెండ్ స్టార్ట్ అయ్యిందని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి వెల్లడించారు. సోమవారం నగరంలోని 10వ డివిజన్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ ఉద్యోగులు పోస్టల్ ఓటు ద్వారా వైసీపీపై కసి తీర్చుకుంటున్నారన్నారు. నెల్లూరులో పెండింగ్ పనులన్నీ పూర్తి కావాలంటే సిటీ ఎమ్మెల్యేగా నారాయణను గెలిపించాలని కోరారు. సేవా కార్యక్రమాలు చేసే వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని ఎంపీగా ఎన్నుకోవాలన్నారు. ఈ కార్యక్ర మంలో నాయకులు తిరుమల నాయుడు, వెంకట్రావు, వెంకట కృష్ణ, శేఖర్, సురేష్, శ్రీనివాస యాదవ్, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.



ఇంటింటి ప్రచారంలో ఓటు అభ్యర్థిస్తున్న కోటంరెడ్డి

ముస్లింలకు కాంగ్రెస్‌లోనే ప్రాధాన్యత

- ఏఐసీసీ మైనార్టీ విభాగం చైర్మన్ ఇమ్రాన్ ప్రతాప్ ఘడి

నెల్లూరు (వైద్యం), మే 6 : దేశంలో ముస్లిం మైనార్టీలకు ప్రాధాన్యత ఇస్తున్నది కాంగ్రెస్ పార్టీయే అని ఏఐసీసీ మైనార్టీ విభాగం చైర్మన్ ఇమ్రాన్ ప్రతాప్‌ఘడి వెల్లడించారు. సోమవారం సాయంత్రం నగరంలోని జెండావీధిలో పార్టీ జిల్లా అధ్యక్షుడు దేవకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో రూరల్ అభ్యర్థి షేక్ ఫయాజ్ అధ్యక్షతన బహిరంగసభ నిర్వహించారు. ఇమ్రాన్ మాట్లాడుతూ కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు నిర్వహించిన రాహుల్ జోడో యాత్ర సత్ఫలితాలనిచ్చిందని చెప్పారు. నెల్లూరు ఎంపీగా కొప్పుల రాజును గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు ఎంపీ అభ్యర్థి రాజు, సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి మూలం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మేనిఫెస్టోతో జిల్లా అభివృద్ధి : కొప్పుల రాజు

కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోతో దేశంతోపాటు జిల్లాకూడా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని ఆ పార్టీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి కొప్పుల రాజు తెలిపారు. సోమవారం నగరంలోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మేనిఫెస్టో పోస్టర్లను విడుదల చేశారు. రాజు మాట్లాడుతూ ఎన్నికల్లో తనను గెలిపిస్తే కృష్ణపట్నం పోర్టుకు పూర్వవైభవం తీసుకువస్తానన్నారు. నెల్లూరుకు చిప్ ఆధారిత పరిశ్రమ తీసుకురావ టానికి కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ కాంగ్రెస్ మహారాష్ట్ర చైర్మన్ శివాజీరావ్ మాఘే, ఢిల్లీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజేష్ లిలోధియా, తమిళనాడు కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి చేవెళ్ల ప్రసాద్, పార్టీ జిల్లా అధ్యక్షుడు చేవూరు దేవకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బహిరంగ సభలో మాట్లాడుతున్న ఇమ్రాన్ ప్రతాప్‌ఘడి

కూటమి ప్రభుత్వంలో మైనార్టీల సంక్షేమం

- టీడీపీ నాయకుడు కేతంరెడ్డి వినోద్‌రెడ్డి

నెల్లూరు (విద్య), మే 6 : టీడీపీ కూటమి ప్రభుత్వంలో ముస్లింల సంక్షేమానికి పెద్దపీట వేస్తారని టీడీపీ నాయకుడు కేతంరెడ్డి వినోద్ రెడ్డి తెలిపారు. నగరంలోని 48వ డివిజన్‌లో సోమవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ముస్లింలకు 50 ఏళ్లకే పింఛను ఇస్తారని చెప్పారు. ముఖ్య పట్టణాల్లో ఈద్గాలకు, ఖబరిస్తాన్లకు స్థలాలు కేటాయిస్తారని తెలిపా రు. నూర్‌బాషా కార్పొరేషన్, మైనార్టీ కార్పొరేషన్ ద్వారా ప్రయోజనా లు కల్పిస్తారన్నారు. టీడీపీ ప్రభుత్వం ఏర్పడగానే సూపర్‌సిక్స్ పథకా లను అమలు చేస్తుందని చెప్పారు. ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని, నెల్లూరు నగర ఎమ్మెల్యేగా పొంగూరు నారాయణను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఇంతియాజ్, జమీర్, ముజా ఫర్, ఇర్ఫాన్, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు అందించి మేనిఫెస్టోను వివరిస్తున్న వినోద్‌రెడ్డి

చంద్రబాబు వస్తేనే ఏపీకి పరిశ్రమలు

- రోడ్ షోల్లో రూరల్ టీడీపీ అభ్యర్థి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు రూరల్, మే 6 : ఎన్డీఏ కూటమి విజయంతో చంద్రబాబు నాయుడు రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయితేనే ఏపీకి పరిశ్రమలు వస్తాయని నెల్లూరు రూరల్ టీడీపీ అభ్యర్థి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అన్నారు. సోమవారం 1వ డివిజన్ పరిధిలోని కోడూరుపాడు, నవలాకులతోట, నారాయణరెడ్డిపేట, కొత్త కాలువ సెంటరు, దొరతోపు సంఘం ప్రాంతాల్లో ఎన్నికల ప్రచార రోడ్ షో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గతంలో సీఎంగా చంద్రబాబు ఉన్నప్పుడు రాష్ట్రానికి అనేక పరిశ్రమలు వచ్చాయన్నారు. కియా మోటార్సును తీసుకువచ్చి ఎందరికో ఉద్యోగ అవకాశాలు కల్పించారని చెప్పారు. అదే స్ఫూర్తితో రానున్న ప్రభుత్వంలో 20 లక్షల ఉద్యోగాలు నిరుద్యోగ యువతికి కల్పించే విధంగా లక్ష్యం పెట్టుకున్నట్లు తెలిపారు. ప్రపంచంలోని అనేక వ్యాపార దిగ్గజాలతో సంబంధాలున్న చంద్రబాబు ఏపీ రూపురేఖలను మార్చేస్తారన్నారు. మెగా డీఎస్సీపై తొలి సంతకం చేస్తానని ఇప్పటికే హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ముందుగా నెల్లూరులోని తన కార్యాలయంలో 31వ డివిజన్‌కు చెందిన మహబూబ్‌బాషా, ఇమ్రాన్, ఫర్హాన్, కార్తీక్, కొత్త వెల్లంటికి చెందిన అశోక్‌రెడ్డి, అమర్నాథ్‌రెడ్డి మిత్రబృందాన్ని ఆయన కండువా కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమాల్లో టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, కోడూరు కమలాకర్‌రెడ్డి, కుడుముల ఈశ్వరయ్య, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.



రోడ్‌షోలో మాట్లాడుతున్న టీడీపీ రూరల్ అభ్యర్థి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి



న్యాయవాదుల సమావేశంలో మాట్లాడుతున్న శ్రీధర్‌రెడ్డి

ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్.. దుర్మార్గమైన చట్టం

నెల్లూరు (లీగల్), మే 6 : ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ అత్యంత దుర్మార్గమైన చట్టం అని నెల్లూరు రూరల్ తెలుగుదేశం పార్టీ అభ్యర్థి కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ఆయన సోమవారం మధ్యాహ్నం నెల్లూరు బార్ అసోసియేషన్‌ను సందర్శించారు. న్యాయవాదులను ఓటు అభ్యర్థించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వం తెచ్చిన ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ వల్ల భవిష్యత్తులో రైతాంగానికి, ప్రజలకు అనేక సమస్యలు వస్తాయని, అందుకే తమ పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు తెలుగుదేశం ప్రభుత్వం వచ్చిన వెంటనే ఈ చట్టాన్ని రద్దు చేస్తామని ప్రకటించారని గుర్తు చేశారు. ఇటువంటి దుర్మార్గమైన చట్టాలు తెస్తే ఏ ప్రభుత్వమైనా ప్రజాగ్రహానికి గురికాకతప్పదని అయన పేర్కొన్నారు. ఈ చట్టంపై మొదట స్పందించి, ఉద్యమం చేపట్టి ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించిన ఘనత న్యాయవాదులకే దక్కుతుందని అయన ప్రశంసించారు. తమ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే న్యాయవాదుల సమస్యలు పరిష్కరించి, వారికి ఇంటి స్థలాలు ఇచ్చేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రాష్ట్ర బార్ కౌన్సిల్ మెంబర్ వేనాటి చంద్రశేఖర్ రెడ్డి, నెల్లూరు బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎం సుందరయ్య యాదవ్ మాట్లాడుతూ న్యాయవాదులకు సంబంధించిన పలు సమస్యలను వివరించారు. అత్యధిక సంఖ్యలో న్యాయవాదులు హాజరైన ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ లీగల్ సెల్ నాయకులు పాల్గొన్నారు.

టీడీపీ ప్రభుత్వంలో రూ.25లక్షల ఆరోగ్యబీమా

- పొంగూరు నారాయణ సతీమణి రమాదేవి

నెల్లూరు (విద్య), మే 6 : తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే చంద్రబాబు రాష్ట్రంలో ప్రతి పేదవాడికి రూ.25లక్షల ఆరోగ్యబీమా అందిస్తారని మాజీ మంత్రి, టీడీపీ నగర ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ పొంగూరు నారాయణ సతీమణి రమాదేవి తెలిపారు. నగరంలోని 51వ డివిజన్‌లో సోమవారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పేద, మధ్య తరగతి ప్రజల అభ్యున్నతి కోసమే టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఉమ్మడి మేని ఫెస్టోలో సూపర్‌సిక్స్ పథకాలను చేర్చిందని చెప్పారు. గతంలో నారాయణ మంత్రిగా ఉ న్న సమయంలో ఈ ప్రాంతంలో క్రిస్టియన్ల కోసం 5 ఎకరాల శ్మశాన వాటిక, పేద ప్రజల కోసం రెండు కమ్యూనిటీ హాళ్లు, ఐదు మేజర్ కాలువలు, కల్వర్టులు, సిమెంట్ రోడ్లు, ఎల్‌ఈడీ లైట్లు.. ఇలా ఎన్నో ప్రజలకు అందించారన్నారు. ఇదే స్ఫూర్తితో రానున్న టీడీపీ ప్రభుత్వంలో ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి పనులకు శ్రీకారం చుడతారన్నారు. ప్రజలంతా ఈ నెల 13న జరిగే ఎన్నికల్లో కూటమి అభ్యర్థులైన పొంగూరు నారాయణను నగర ఎమ్మెల్యేగా, నెల్లూరు ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు.



ఎన్నికల ప్రచారంలో పొంగూరు రమాదేవి



ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో 2002లో స్వర్ణాల చెరువులో బోట్ షికార్ కోసం బోట్‌క్లబ్ ఏర్పాటు చేశారు. దాదాపు 2 ఎకరాలకు పైగా స్థలంలో చిన్నపిల్లల పార్కు, పచ్చదనం కోసం గార్డెనింగ్, బోట్ షికార్‌కు జట్టీలు, పర్యాటకులకు కోసం రెస్టారెంట్ తదితర సౌకర్యాలతో దీనిని ఏర్పాటు చేశారు. ఇప్పుడు అవన్నీ నిరుపయోగమైపోయాయి. చిల్డ్రన్స్‌పార్కు రూపురేఖలు కోల్పోయింది. పచ్చదనం పోయి ఏడారిని తలపిస్తోంది. బోట్ క్లబ్ భవనంలోని రెస్టారెంట్ మూతపడింది.

స్వర్ణాల చెరువులో సందడి లేని బోట్లు

ఎదుగూబొదుగూ లేని నెల్లూరు బోట్ క్లబ్

ఏర్పడి 22 ఏళ్లయినా వసతులు శూన్యం

నెల్లూరు (సాంస్కృతికం) మే 6 : నెల్లూరు నగరానికి విహార కేంద్రమైన బోట్ క్లబ్ గత 22 సంవత్సరాలుగా ఎదుగుబొదుగు లేకుండా ఉంది. కనీస సౌకర్యాలు లేకుండా నగరవాసుల్ని తీవ్ర నిరాశకు గురి చేస్తోంది. పర్యాటక శాఖ ఆధ్వర్యంలో బోట్ క్లబ్ కోసం నిర్మించిన భవనంలోనే ఆ శాఖ డివిజన్ కార్యాలయం ఏర్పాటు చేశారు. బోట్ క్లబ్ పక్కనే బారాషహీద్ దర్గా, స్వర్ణాల చెరువు ఘాట్, ఎర్ర దర్గా లాంటి పర్యాటక ప్రాంతాలు ఉన్నాయి. నిత్యం నగరవాసులతోపాటు ఇతర ప్రాంతాల నుంచి పర్యాటకులు అక్కడి కి వస్తుంటారు. అయితే బోట్‌క్లబ్‌లో కనీస సౌకర్యాలు లేకపోవడంతో ఆ ప్రాంతం బోసి పోతోంది. మత సామరస్యానికి ప్రతీక అయిన రొట్టెల పండుగకు ప్రతి ఏటా 5లక్షలు నుంచి 7లక్షల మంది దేశవ్యాప్తంగా యాత్రికులు తరలివస్తారు. ఆ సమయంలో జరిగే బోట్‌షికార్ కారణంగా ఆంధ్రప్రదేశ్ పర్యాటకాభివృద్ధి సంస్థకు దాదాపు వారం రోజులకు 10 నుంచి 12లక్షల రూపాయల వరకు ఆదాయం వస్తుంది. అయినప్పటికీ ఆ క్లబ్‌ను యాత్రికుల, పర్యాటకుల అభిరుచులకు అనుగుణంగా తీర్చిదిద్దడంలో పాలకులు, అధికా రులు విఫలమవుతున్నారు. ప్రస్తుతం బోట్ షికార్‌కు 3 బోట్లు మాత్రమే ఉన్నాయి. 10 సీట్ల సింహపురి బోటు ఉంది. దీనిలో షికారు చేయాలంటే పెద్దలకు రూ.150, చిన్నారుల కు రూ.120 వసూలు చేస్తున్నారు. 18సీట్లు కలిగిన ఫ్లెమింగ్ బోటులో షికార్ చేయాలం టే పెద్దలకు రూ.80, పిల్లలకు రూ.60 చెల్లించాల్సి ఉంటుంది. స్పీడ్ బోటులో ఇద్దరు మాత్రమే ప్రయాణించవచ్చు. దీనికి టిక్కెట్టు ధర రూ.400. బోట్‌క్లబ్‌ను ఫంక్షన్లకు కూడా అద్దెకు ఇస్తున్నారు. బోట్‌లో ఫంక్షన్, పార్టీ చేసుకోవాలనుకుంటే గంటకు రూ.5వేల చొప్పున ఆ సంస్థ వసూలు చేస్తోంది. ఈ ఏడాది బోటు షికారు వల్ల జనవరి నెలలో రూ.3లక్షలు, ఫిబ్రవరిలో రూ.1.50లక్షలు, మార్చి-ఏప్రిల్ నెలల్లో రూ.లక్ష వంతున ఆదాయం వచ్చింది. ఈ వేసవి సెలవుల్లో పర్యాటకులను రాబట్టుకునేందుకు ఆ సంస్థ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో బోట్ క్లబ్ వెలవెలబోతోంది.



జీజీహెచ్‌లో అన్నదానం

నెల్లూరు (విద్య), మే 6 : వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్న సత్యసాయి సేవా ట్రస్ట్‌లో సోమవారం రోగులకు అన్నప్రసాద వితరణ చేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు డీవీ సుబ్బరాజు మాట్లాడుతూ తమ అసోసియేషన్ సభ్యుడు ఉమామహేశ్వర్‌రెడ్డి మనవరాలు హన్విక రెడ్డి పుట్టినరోజు సందర్భంగా ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. ఇదే స్ఫూర్తితో క్రమం తప్పకుండా సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి స్వర్ణ రమేష్‌బాబు, ఉపాధ్యక్షుడు పొన్నం రవిచంద్ర, సభ్యులు సుబ్బరామిరెడ్డి, నారాయణరావు పాల్గొన్నారు.

కేవీఎస్‌లో సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు (విద్య), మే 6 : కొత్తూరులోని పీఎంశ్రీ కేంద్రీయ విద్యాలయంలో ఒకటో తరగతిలో ఎస్టీ కోటా కింద మిగిలిన సీట్లను భర్తీ చేసేందుకు అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కే శంకరయ్య ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఏడాది మార్చి 31 నాటికి ఆరేళ్ల వయసు పైబడి ఎనిమిదేళ్లలోపు వారు దరఖాస్తు చేసుకోవచ్చు న్నారు. ఈ నెల 8 నుంచి ఉదయం 10 నుంచి 2 గంటల వరకు అన్ని పనిదినాల్లో కేంద్రీయ విద్యాలయం కార్యాలయంలో దరఖాస్తులు అందచేస్తారని తెలిపారు. పూర్తి చేసిన దరఖాస్తులను ఈనెల 15లోపు అందచేయాలని కోరారు.

జనసేన పార్టీ బలోపేతానికి కృషి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), మే 6: జిల్లాలో జనసేన పార్టీని మరింత బలోపేతం చేసేలా పని చేస్తామని ఇటీవల ఆ పార్టీలో చేరిన నూనె మల్లికార్జున యాదవ్ తెలిపారు. నగరంలోని అమని గార్డెన్స్‌లో సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. జనసేన ఆశయాలు నచ్చి, ఆ పార్టీ మీడియా అధికార ప్రతినిధి అజయ్ కుమార్ సూచనతో పార్టీలో చేరానని, పవన్ అడుగుజాడల్లో నడుస్తానని తెలిపారు.

12న రామానుజుల జయంతి

నెల్లూరు (సాంస్కృతికం), మే 6 : సమతామూర్తి భగవద్రామానుజాచార్యుల 1007వ జయంతి ఉత్సవాలు ఈనెల 12న నిర్వహిస్తున్నట్లు రామానుజ భక్తబృందం, రంగపిల్లార్ భక్త సమాజం తెలిపాయి. ఈ ఉత్సవాలు గాంధీబొమ్మ సమీపంలోని ఛత్రపతి శివాజీ సెంటర్‌లో ఉదయం 9గంటల నుంచి జరుగుతాయని, భక్తులు అందరూ తరలిరావాలని కోరాయి.

పెదపవనిలో టీడీపీ, వైసీపీ వర్గాల ఘర్షణ

లింగసముద్రం, మే 6 : మండలంలోని పెదపవని ఎస్సీ కాలనీలో ఆదివారం రాత్రి ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ నాయకులతో వైసీపీకి చెందిన వారు ఘర్షణ పడ్డారు. ఈ ఘటనపై ఇరువర్గాలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసులు నమోదు చేశారు. టీడీపీకి చెందిన దిలీప్, కృష్ణ తదితరులతో వైసీపీ నాయకుడు మంద కొండయ్య, ఆయన బంధువులు వాగ్వాదానికి దిగి ఘర్షణ పడ్డారు.

కోవూరు సర్వేపల్లి

పోస్టల్ బ్యాలెట్ సద్వినియోగం చేసుకోవాలి : కలెక్టర్


వెంకటాచలం: ఓటింగ్ సరళిని పరిశీలిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి హరినారాయణన్

వెంకటాచలం, మే 6: సర్వేపల్లి నియోజకవర్గ కేంద్రమైన వెంకటాచలం సమీపంలోని క్యాబా ఇంజనీరింగ్ కళాశాలలో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ సరళిని సోమవారం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హరినారాయణన్ పరిశీలించారు. ఎన్నికల సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల విధులకు కేటాయించబడిన ప్రభుత్వ ఉద్యోగులందరూ ఈనెల 8వ తేదీ లోగా నియోజకవర్గ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ కేంద్రాల్లో తప్పనిసరిగా ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. కలెక్టర్ వెంట సర్వేపల్లి అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి చిన్న ఓబులేసు ఉన్నారు. కాగా, సర్వేపల్లి నియోజకవర్గానికి సంబంధించి మొత్తం 1268 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు ఉండగా తొలి రెండు రోజుల్లో 995 ఓట్లు పోల్ కాగా, మిగిలిన 273 ఓట్లు పోల్ కావాల్సి ఉంది.

కోవూరు: స్థానిక జడ్పీ బాలికల పాఠశాలలో సార్వత్రిక ఎన్నికల పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌ను సోమవారం కలెక్టర్ హరినారాయణ పరిశీలించారు. జడ్పీ బాలికల పాఠశాలలో ఏర్పాటుచేసిన ఐదు పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాల్సిందిగా కోరారు. ఆయన వెంట ట్రైనీ కలెక్టర్ సంజనసిన్హ, కోవూరు నియోజకవర్గ ఎన్నికల అధికారి సేతుమాధవన్, నెల్లూరు నగర కమిషనర్ రమణబాబు ఉన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

కోవూరు, మే 6: మండల పరిధిలోని పడుగుపాడు గ్రామ సరిహద్దుల్లో జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన ఇద్దరు చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందారు. వివరాలిలా ఉన్నాయి. పడుగుపాడు మజరా చంద్ర మౌళి నగర్ గిరిజన కాలనీకి చెందిన భూపేష్ (40) అనే ట్రాక్టర్ డ్రైవర్ పడుగుపాడు నుంచి ట్రాక్టర్‌ను చంద్రమౌళి నగర్‌కు తీసుకువెళ్తుండగా కాలువలో బోల్తాపడటంతో తీవ్ర గాయాలకు గురయ్యాడు. నెల్లూరు నగరంలోని ప్రయివేటు వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. అలాగే జాతీయరహదారిపై ఆదివారం అర్ధరాత్రి శివాలయం సమీపంలో రెండు లారీలు ఢీకొనడంతో రెండు లారీల డ్రైవర్లు తీవ్రంగా గాయపడ్డారు. ఇరువురిని నెల్లూరు నగరంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా వారిలో ఓ డ్రైవరు సోమవారం రాత్రి మృతిచెందాడు. మృతుని వివరాలు తెలియాల్సి ఉంది. రెండు కేసుల్ని నమోదుచేసి ఎస్ఐ రంగనాథ్‌గౌడ్ దర్యాప్తు చేపట్టారు.

మద్యం కేసులో నిందితుడి అరెస్టు

పొదలకూరు, మే 6 : మండలంలో విరువూరు గ్రామంలోని రైస్‌మిల్లులో మద్యం కేసులో పరారీలో ఉన్న తాటిపర్తికి చెందిన చిన్నిరెడ్డిని సోమవారం సెబ్ సీఐ వెంకట్రావు అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచారు. దీంతో ఈ కేసులో 8 మందిని అరెస్టు చేసినట్లు సోమవారం ఒక ప్రకటనలో ఆయన తెలిపారు.

పోలింగ్ అనంతరం వైసీపీ ఖాళీ : కురుగొండ్ల

● టీడీపీలో చేరిన గిలకపాడు వాసులు


కురుగొండ్ల సమక్షంలో టీడీపీలో చేరిన గిలకపాడు వైసీపీ నాయకులు

రాపూరు(డక్కిలి), మే 6 : వైసీపీని వీడి టీడీపీలో చేరే వారి సంఖ్య రోజు రోజుకు వెల్లువెత్తుతున్నాయని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ అభ్యర్థి కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. సోమవారం రాపూరు మండలంలోని గిలికపాడు గ్రామానికి చెందిన పలువురు వైసీపీ నాయకులు.. టీడీపీ సీనియర్ నాయకులు ఆరికట్ల మస్తాన్‌నాయుడు (ఎస్ఎన్ఎం) ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. వీరందరికి వెంకటగిరి ఎమ్మెల్యే అభ్యర్థి కురుగొండ్ల రామకృష్ణ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మే 13న జరిగే పోలింగ్ అనంతరం వైసీపీ ఖాళీ అవుతుందని ఆయన జోస్యం చెప్పారు. వైసీపీ మునిగిపోయే పడవ అని తెలుసుకొన్న చాలామంది టీడీపీలో చేరిపోతున్నారని చెప్పారు. వెంకటగిరిలో టీడీపీ విజయం నల్లేరుపై నడకే అని ధీమా వ్యక్తం చేశారు. పార్టీలో చేరిన వారిలో పసుపులేటి పెంచలయ్య, ఓసూరు రమణయ్య, ఓసూరు శివశంకర్, అంకయ్యలతో పాటు 20వైసీపీ కుటుంబాలు ఉన్నాయి.

సొంత సెగ్మెంట్‌లోనే దిక్కుతోచని స్థితిలో కాకాణి

● సర్వేపల్లి టీడీపీ ఉమ్మడి అభ్యర్థి సోమిరెడ్డి


పొదలకూరు: అయ్యగారిపాలెంలో ప్రచారం చేస్తున్న సోమిరెడ్డి

పొదలకూరు, మే 6 : రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి స్వగ్రామంలోని తోడేరు ఎంపీటీసీ సెగ్మెంట్‌లో భాగమైన అయ్యగారిపాలెం సర్పంచ్‌తోపాటు గ్రామంలోని 22 కుటుంబాలు టీడీపీలో చేరడంతో మంత్రి కాకాణికి దిక్కుతోచని స్థితి నెలకొందని మాజీ మంత్రి, సర్వేపల్లి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని అయ్యగారిపాలెం, నేదురుపల్లి గ్రామాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వేపల్లి నియోజకవర్గంలో కాకాణి చేసిన అరాచకాలన్నీ శాపాలుగా మారి అతనిని రాజకీయంగా భూస్థాపితం చేస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు అయ్యగారిపాలెం సర్పంచ్ కండే మస్తానమ్మ, నరసయ్య, రవీంద్ర, గంగయ్య, పీపీఎన్ ప్రసాద్, తలచీరు మస్తాన్‌బాబు, తదితరులు పాల్గొన్నారు. కాగా, మండలంలోని కొత్త కంభాలపల్లికి చెందిన 11 కుటుంబాలు, పట్టణానికి చెందిన సీనియర్ నాయకుడు చిర్రా రమణారెడ్డి, ఏసీ కాలనీకి చెందిన 20 కుటుంబాలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు.

కాకాణి కళ్లలో ఓటమి భయం

వెంకటాచలం: సర్వేపల్లి టీడీపీలోకి వరుస చేరికలతో కాకాణి గోవర్ధన్‌రెడ్డి కళ్లల్లో ఓటమి భయం కనిపిస్తోందని సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి విమర్శించారు. వేదాయపాళెంలో ఉన్న సోమిరెడ్డి కార్యాలయంలో సోమవారం మండలంలోని చెముడుగుంట, కంటేపల్లి, ఎగువ మిట్ట గ్రామాల నుండి 58 కుటుంబాలతో సహా చెముడుగుంట వైసీపీ కీలక నాయకుడు కుంకాల శ్రీనివాస్ యాదవ్ మరికొందరు వైపీపీని వీడి టీడీపీలో చేరారు. కార్యక్రమంలో కుంకాల దశరథ, నాగేంద్ర ప్రసాద్, గుమ్మడి రాజాయాదవ్, దొడ్ల అశోక్, పాల్గొన్నారు.

కాకాణిని నమ్ముకుంటే జైలుపాలే...

తోటపల్లిగూడూరు : మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని నమ్ముకుంటే నాయకులు జైలుపాలు, అధికారులు సస్పెండ్ అవుతున్నారని సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని చిన్నచెరుకూరు గ్రామంలో సోమవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం సోమిరెడ్డి మాట్లాడుతూ వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన ల్యాండ్ టైటిల్ యాక్ట్‌ను టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే తొలగిస్తామని, ఎన్నికల్లో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బొమ్మి సురేంద్ర, సర్పంచ్ ఉయ్యాల భాస్కర్, సోమిరెడ్డి శ్రీనివాసరెడ్డి, తోట శ్రీనివాసులు జనసేన, టీడీపీ మండల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

● సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిని ఎన్నికలలో గెలిపించాలని కోరుతూ కుమార్తె సోమిరెడ్డి సింధు మండలంలోని వెంకన్నపాలెంలో సోమవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఆమె వెంట బండి శ్రీకుమార్‌రెడ్డి, చింత సీతారామయ్య. తదితరులు పాల్గొన్నారు.

●**మనుబోలు:** ఎన్నికల్లో తన మామ సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ సోమిరెడ్డి శృతిరెడ్డి మండలంలోని ముద్దమూడి గ్రామంలో సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు వద్దినేని మస్తాన్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని కాగితాలపూరు గ్రామానికి చెందిన వార్డు సభ్యులు నక్కినబోయిన సుబ్బయ్య, జోగి మల్లి, వలంటీర్ స్వప్నలతో పాటు పలు కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరారు.

ఇఫ్కోకు భూ కేటాయింపులు సక్రమమే !

● ఆ భూములను కిసాన్ ఎస్ఈజడ్‌గా మార్చడాన్ని తప్పుబట్టలేం
● రాజ్యాంగ విరుద్ధం, హక్కులకు విఘాతం ఏర్పడితేనే కోర్టుల జోక్యం
● అనుమతి మేరకే కనిగిరి రిజర్వాయర్ నీటి వినియోగం
● హైకోర్టు ధర్మాసనం కీలక తీర్పు

అమరావతి, మే 6(ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లా, కొత్తూరు గ్రామం పరిధిలో యురియా ప్లాంట్ ఏర్పాటు కోసం కేటాయించిన భూములను ఇఫ్కో సంస్థ వ్యవసాయ ఉత్పత్తులు, ఫుడ్ ప్రాసెసింగ్ యునిట్లు నెలకొల్పేందుకు వినియోగించడాన్ని హైకోర్టు సమర్థించింది. ఎరువుల ప్లాంట్ ఏర్పాటు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం అనుమతి నిరాకరించడంతో కిసాన్ ఎస్ఈజెడ్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వమే అనుమతులు ఇచ్చిందని గుర్తు చేసింది. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం రాజ్యాంగ విరుద్ధంగా, హక్కులకు విఘాతం కలిగించేలా ఉన్నప్పుడు మాత్రమే కోర్టులు జోక్యం చేసుకోగలవని పేర్కొంది. ప్రస్తుత కేసులో రాష్ట్ర ప్రభుత్వమే అనుమతి ఇచ్చినందున తాము కలగజేసుకోలేమని ధర్మాసనం స్పష్టం చేసింది. కోదండరామస్వామి దేవస్థానానికి చెందిన భూమిగా చెప్పబడుతున్న 1,009.91 ఎకరాలతో ఆలయానికి ఎలాంటి సంబంధం లేదని, దీనిని ప్రభుత్వ భూమిగా నిర్ధారిస్తూ ఈ ఏడాది ఫిబ్రవరిలో హైకోర్టు తీర్పు ఇచ్చిందని గుర్తు చేసింది. రైతుల ప్రయోజనాల నిమిత్తం ఎరువుల ఫ్లాంట్ ఏర్పాటు చేయాలని నిర్ణయించినందున ఇఫ్కో కోసం చేసిన భూకేటాయింపులు ప్రజా ప్రయోజనం నిర్వచనం పరిధిలోకి వస్తాయని పేర్కొంది. ప్రైవేటు ప్రయోజనం కోసం ప్రభుత్వం భూములు కేటాయించిందన్న పిటిషనర్ వాదనను తోసిపుచ్చింది. ఇఫ్కోకు భూకేటాయింపుల సమయంలో రాష్ట్ర ప్రభుత్వం స్విస్ ఛాలెంజ్ విధానం అనుసరించి ఉండాల్సిందన్న పిటిషనర్ల వాదనపై అభ్యంతరం తెలిపింది. ఇఫ్కోకు బహిరంగ వేలం ద్వారా భూములు కేటాయించి ఉంటే రాష్ట్ర ప్రభుత్వానికి మరింత ఆదాయం వచ్చేదన్న పిటిషనర్ వాదనను తోసిపుచ్చింది. పారిశ్రామికాభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని భూములు కేటాయించినప్పుడు వాటిని వేలం ద్వారా జరపాలా? ఇతర విధానాలు అనుసరించాలా? అనేది పూర్తిగా ప్రభుత్వ విచక్షణాధికారమని స్పష్టం చేసింది. పిటిషనర్ల వాదనలను తోసిపుచ్చుతూ వ్యాజ్యాలను కొట్టివేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ ఆర్.రఘునందనరావుతో కూడిన ధర్మాసనం సోమవారం తీర్పు ఇచ్చింది.

యూరియా ఫ్లాంట్ ఏర్పాటు కోసం నెల్లూరు జిల్లా, కొత్తూరు గ్రామం పరిధిలోని శ్రీ కోదండరామస్వామి దేవాలయానికి చెందిన 1009 ఎకరాలతో పాటు కొడవలూరు మండలం పరిధిలోని బొడ్డవారిపాలెం, రేగడిచెలిక, రాచర్లపాడు, తలమంచి తదితర గ్రామాల రైతులకు చెందిన పట్టా భూములు కలిపి మొత్తం 2776 ఎకరాలను ఇండియన్ ఫార్మర్స్ ఫెర్టిలైజర్స్ కో ఆపరేటివ్ లిమిటెడ్(ఇఫ్కో)కు ఇచ్చారు. యూరియా, అమోనియా ఫ్లాంట్ ఏర్పాటులో ఎలాంటి పురోగతి లేదని, భూకేటాయింపుల్లో అక్రమాలు చోటుచేసుకున్నాయని పేర్కొంటూ కొడవలూరు మండలం అప్పటి జడ్పీటీసీ సభ్యుడు ఈ శ్రీధర్‌రెడ్డితో పాటు మరో ముగ్గురు 2017లో హైకోర్టులో పిల్ వేశారు. ఈ వ్యవహారాన్ని సీబీఐ చేత దర్యాప్తు చేయించాలని అభ్యర్థించారు. మరోవైపు తమకు ఎలాంటి పరిహారం చెల్లించకుండానే భూములు సేకరించి ఇఫ్కోకు కేటాయించారని, తమకు పరిహారం చెల్లించేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ కే సుశీలమ్మ, మరో 120 మంది పిటిషన్లు వేశారు. ఈ వ్యాజ్యంపై ఇటీవల వాదనలు ముగియడంతో తీర్పు రిజర్వ్ చేసిన ధర్మాసనం సోమవారం నిర్ణయాన్ని వెల్లడించింది. పిటిషనర్ల వాదనను తోసిపుచ్చింది. వ్యవసాయ భూమిని వ్యవసాయేతర అవసరాలకు మార్చేందుకు మార్కెట్ విలువలో 10 శాతాన్ని కన్వర్షన్ ఫీజుగా వసూలు చేయాలని, ఈ విషయంలో ఇఫ్కోకు మినహాయింపు ఇవ్వడం వల్ల ప్రభుత్వ ఖజానాకు రూ.వందల కోట్ల నష్టం జరిగిందన్న పిటిషనర్ల వాదనను ధర్మాసనం తోసిపుచ్చింది. రాష్ట్రంలోని అన్ని ఎస్ఈజెడ్‌లకు కన్వర్షన్ ఫీజు నుంచి మినహాయింపు ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వమే జీవో ఇచ్చిందని గుర్తు చేసింది. ప్రభుత్వం ఇచ్చిన అనుమతులు మేరకే కనిగిరి రిజర్వాయర్ నుంచి కోకాకోలా సంస్థ నీటిని వాడుకుంటుందని పేర్కొంది. ఈ నేపథ్యంలో వ్యాజ్యాలను కొట్టివేస్తున్నట్లు ప్రకటించింది.

టీడీపీకే దివ్యాంగుల మద్దతు

పొదలకూరు, మే 6 : దివ్యాంగుల పింఛన్ రెట్టింపు చేయడమే కాకుండా వంద శాతం అంగవైకల్యం కలిగిన వారికి రూ.15వేలు చేసిన టీడీపీకే తమ సంపూర్ణ మద్దతు అని వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు అంకబాబు, జాతీయ నాయకుడు గూడూరు. వెంకటరమణయ్య అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి అభ్యర్థి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిని గెలిపించుకుంటామన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే దివ్యాంగులతోపాటు అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగుల హక్కుల పోరాట సమితి మండల అధ్యక్షుడు గౌరయ్య, టీడీపీ మండల అధ్యక్షుడు తలచీరు మస్తాన్‌బాబు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు బొద్దులూరు మల్లికార్జున్‌నాయుడు, బక్కయ్యనాయుడు, పెంచలయ్య, శ్రీను, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.


ప్రమాదంలో దెబ్బతిన్న కారు

ఆగిన సిమెంట్ ట్యాంకర్‌ను ఢీకొన్న కారు

● సంగం సమీపంలో ముంబయి జాతీయ రహదారిపై ఘటన
● అక్కడికక్కడే ఒకరు మృతి.. ఇద్దరికి గాయాలు


మృతి చెందిన గాజుల ఫరూక్ అలీ

సంగం, మే 6: మండలకేంద్రం సమీపంలోని ముంబాయి జాతీయ రహదారిలో సోమవారం తెల్లవారు జామున రెండు కొండల మధ్య మరమ్మతులకు గురై ఆగి ఉన్న సిమెంట్ ట్యాంకర్‌ను వెనుక వైపు నుంచి వేగంగా కారు వచ్చి ఢీకొన్నది. ఈ ఘటనలో కారు ముందు భాగం నుజ్జునుజ్జయ్యింది. కారులో ప్రయాణం చేస్తున్న గాజుల ఫరూక్ అలీ (61) అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఇద్దరికి గాయపడ్డారు. పోలీసుల తెలిపిన వివరాల మేరకు.. ఉదయగిరి మండలం దాసరిపల్లి ఎంపీయూపీ పాఠశాల ఉపాధ్యాయుడు గాజుల ఫరూక్ అలీ తన రెండో కుమారుడు అయాన్ ఉద్యోగరీత్యా జర్మనీ వెళ్లనున్నాడు. అతన్ని చెన్నైలో విమానం ఎక్కించేందుకు ఆదివారం సాయంత్రం తన అన్న గాజుల నజీముద్దీన్, అన్న కుమారుడు సూరజ్‌తో కలిసి డ్రైవర్ కార్తీక్‌ను తీసుకుని కారులో ఉదయగిరి నుంచి బయలుదేరాడు. రాత్రి కుమారుడిని ఫ్లైట్ ఎక్కించి తిరిగి ఉదయగిరికి బయలుదేరాడు. తెల్లవారుజామున మార్గమధ్యలో సంగం కూడలి దాటిన అనంతరం ఈ ప్రమాదం దుర్ఘటన జరిగింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ వెనుక సీట్‌లో కూర్చున గాజుల ఫరూక్ అలీ సీట్ బెల్టు పెట్టుకోకపోవడంతో ఎగిరి రెండు సీట్ల మధ్య కిందపడ్డాడు. దీంతో స్ట్రోక్‌కు గురై మృతి చెందినట్లు పోలీసులు భావిస్తున్నారు. ముందు సీట్‌లో కూర్చున ఫరూక్ అలీ అన్న నజీముద్దీన్, డ్రైవర్ కార్తీక్ సీట్ బెల్టు పెట్టుకుని ఉండడంతో బెలూన్‌లు ఓపన్ కావడంతో స్వల్ప గాయాలతో ప్రాణాపాయం తప్పింది. అదేవిధంగా వెనుక సీట్‌లో కూర్చున్న సూరజ్‌కు కూడా స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న సీఐ రవినాయిక్, ఎస్ఐ నాగార్జునరెడ్డి సంఘటన స్థలానికి వెళ్లి గాయపడిన వారిని 108 వాహనంలో నెల్లూరు వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

● **మృతుడు ఫరూక్ ఇటీవల సస్పెన్షన్**

ప్రమాదంలో మృతి చెందిన ఉపాధ్యాయుడు గాజుల ఫరూక్ అలీ ఇటీవల సస్పెండ్ అయ్యాడు. ఇతను దాసరిపల్లి ఎంపీయూపీ పాఠశాల ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్నారు. వీరి కుటుంబం మాజీ ఎంపీ రాజమోహన్‌రెడ్డి కుటుంబానికి అత్యంత సన్నిహితం. దీంతో ఫరూక్ అలీ దీర్ఘకాల సెలవు పెట్టి ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి వద్ద ప్రైవేట్ పర్సనల్ సెక్రటరీగా పనిచేస్తునాడు. ఈ క్రమంలో ప్రస్తుతం జరుగుతున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డితో కలసి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఉపాధ్యాయుడుగా ఉంటూ ఎన్నికల ప్రచారంలో పాల్గొనడంతో ఆయన్ను కలెక్టర్ సస్పెండ్ చేశారు. ఈయన అన్న గాజుల తాజుద్దీన్ మేకపాటి కుటుంబ సహకారంతో జిల్లా పరిషత్ కో ఆప్షన్ సభ్యుడిగా ఉన్నారు.

వైసీసీ ఎన్నికల ప్రచారంలో ఆశావర్కర్

● చర్యలు తీసుకోవాలని టీడీపీ నేతల డిమాండ్


వైసీపీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఆశావర్కర్ భవాని (వృత్తంలో ఉన్న మహిళ)

విడవలూరు, మే 6: మండల పరిధిలోని చౌకిచర్ల గ్రామంలో ఉంటూ బుచ్చిలో విధులు నిర్వహిస్తున్న ఆశావర్కర్ భవాని ఆదివారం జరిగిన వైసీపీ ఎన్నికల ప్రచారంలో పాల్గొనడం చర్చనీయాంశంగా మారింది. ఈ ఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. ఇటీవల కోవూరు మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఎన్నికల ప్రచారంలోనూ ఆశావర్కర్ పాల్గొని పార్టీ జెండా పట్టుకుని వైసీపీకి జై అంటూ ప్రచారం నిర్వహించింది. ప్రభుత్వ జీతం తీసుకుంటూ ఎన్నికల ప్రచారంలో పాల్గొంటే అధికారులు ఏమి చేస్తున్నారని, ఈ ఘటనపై జిల్లా ఎన్నికల అధికారి సమగ్ర విచారణ జరిపి ఆశా వర్కర్‌పై సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకులు డిమాండ్ చేశారు.

వైసీపీ నుంచి కొత్తపల్లి సర్పంచి సస్పెన్షన్

● కాదు.. కాదు.. పార్టీ విధానాలు నచ్చక దూరమయ్యా : శ్రీహరినాయుడు

కావలి రూరల్, మే 6: కావలి మండలం కొత్తపల్లి సర్పంచి చిమ్మిలి శ్రీహరినాయుడు, ఆయన తండ్రి అంకబాబును ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి వైసీపీ నుంచి సస్పెండ్ చేసినట్లు సోమవారం ఎమ్మెల్యే కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొంది. వారిద్దరూ పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడినందున వైసీపీ నుంచి సస్పెండ్ చేసినట్లు కార్యాలయ వర్గాలు తెలిపాయి.

● **పార్టీ విధానాలు నచ్చక దూరమయ్యాం**

సస్పెన్షన్‌పై సర్పంచి శ్రీహరినాయుడుని వివరణ కోరగా వైసీపీ విధానాలు నచ్చక ఐదురోజులుగా తామే పార్టీకి దూరంగా ఉన్నామన్నారు. తన తల్లి చిమ్మిలి వసుమతి మాజీ సర్పంచిగాను, సర్పంచిగా తాను 13 ఏళ్లుగా పార్టీకి సేవచేశామని, ఎమ్మెల్యే వద్ద మాపై కొందరు తప్పుడు ప్రచారం చేశారని పేర్కొన్నారు. పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడినట్లు ఎమ్మెల్యే నిరూపించాలని ఆయన సవాల్ విసిరారు.

తల్లి మరణం తట్టుకోలేక యువకుడి ఆత్మహత్య

నెల్లూరు(క్రైం), మే 6: తల్లి మరణం జీర్ణించుకోలేని ఓ యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సేకరించిన సమాచారం మేరకు... నెల్లూరులోని కామాటి వీధిలో చెందిన మోహన్ మురళి, ద్రాక్షాయణి దంపతులు నివసించేవారు. వారికి ఓ కుమార్తె, కుమారుడు సర్వజ్ఞ(26) ఉన్నారు. కుమార్తెకు వివాహం కాగా, సర్వజ్ఞ బీటెక్ పూర్తి చేసి నగరంలోని ఆర్టీసీ బస్టాండు సమీపంలో గల కంప్యూటర్ సెంటర్‌లో పని చేస్తున్నాడు. ఏడాది క్రితం తల్లి ద్రాక్షాయణి మృతి చెందింది. తల్లి మరణం జీర్ణించుకోలేని సర్వజ్ఞ లోలోపల కృంగిపోయేవాడు. ఈ క్రమంలో సోమవారం ఉదయం తండ్రి మురళి బయటకు వెళ్లిన సమ యంలో ఇంటిలోనే చీరతో ఉరి వేసుకున్నాడు. గమనించిన బంధువులు తలుపులు పగులగొట్టి చికిత్స నిమిత్తం ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని నిర్ధారించారు. సమాచారం అందుకున్న సంతపేట పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి కేసులో మూడేళ్ల జైలు : రూ. 10వేల జరిమానా

నెల్లూరు (లీగల్), మే 6 : గంజాయి తరలిస్తూ పట్టుబడ్డ కేసులో జయదేవ్ దీప్ అలియాస్ జగలి అనే నిందితుడికి మూడేళ్ల జైలు శిక్షతోపాటు 10వేల రూపాయల జరిమా నా విధిస్తూ నెల్లూరు 1వ అదనపు జిల్లా సెషన్స్ (ఎన్‌డీపీఎస్‌సీ కోర్టు స్పెషల్) జడ్జి జీ కబర్ది సోమవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూ షన్ కథనం మేరకు... ఒడిశా రాష్ట్రం రగారోహ జిల్లా కురపలి గ్రామానికి చెందిన జయదేవ్ దీప్ గతేడాది జూలై 12వ తేదీన 2 కేజీల గం జాయిని ప్లాస్టిక్ బ్యాగ్‌లో పెట్టుకుని తిరుపతి జిల్లా గూడూరు పట్టణంలోని క్రీస్తు సమాధు ల వద్ద అనుమానాస్పదంగా తిరుగుతుండటం తో గూడూరు పట్టణం స్పెషల్ ఎన్‌ఫోర్స్ మెంట్ అధికా రులు పట్టుకున్నారు. కేసు నమోదు చేసి చార్జిషీటు దాఖలు చేశారు. విచారణా కాలంలో నిందితుడిపై నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి జైలు, జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరపున స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ దాట్ల రమణారెడ్డి వాదించారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	155
లేయర్ లైవ్	93
స్కిన్ చికెన్	270
స్కిన్‌లెస్	300
లేయర్	158

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ. 6818
వెండి కిలో ధర	రూ. 83,600
వెండి ఒక గ్రాము	రూ. 85.60

అభివృద్ధి, సంక్షేమం చంద్రబాబుతోనే సాధ్యం : ప్రశాంతిరెడ్డి


విడవలూరు: ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి


కొడవలూరులో ప్రజలకు అభివాదం చేస్తున్న ప్రశాంతి రెడ్డి

కొడవలూరు, మే 6 : ప్రజల అభివృద్ధి, సంక్షేమం టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబుతోనే సాధ్యమని కూటమి శాసనసభ అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. మండలంలో నార్తురాజుపాలెంలో సోమవారం ఎన్నికల ప్రచారం జరిగింది. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ పాలనలో నార్తురాజుపాలెంను మాఫియాలకు కేంద్రంగా మార్చారని, ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేశారన్నారు. తాను ఎమ్మెల్యేగా గెలిస్తే ప్రశాంతత నెలకొల్పుతానన్నారు. నిరుద్యోగ సమస్య పరిష్కరించేందుకు ఇఫ్కోలో పరిశ్రమలు తీసుకువచ్చి అభివృద్ధి చేస్తానన్నారు. రాజుపాలెంలో డ్రైనేజీ, శ్మశానంలో మౌలిక వసతులు కల్పించి, చేపల మార్కెట్ నూతనంగా నిర్మిస్తామన్నారు. నియోజకవర్గ అభివృద్ధి మరిచిన ప్రసన్నకుమార్‌రెడ్డి ఓటమి భయంతో ఆరోపణలు చేస్తున్నారని, అవినీతిపై మాట్లాడే అర్హత ఆయనకు లేదన్నారు. ప్రజాసేవ చేసేందుకు రాజకీయాల్లోకి వచ్చామని, ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కోటంరెడ్డి అమరేంద్రరెడ్డి, మందపాటి ప్రవీణ్ కుమార్, ఇరువూరి శ్రీధర్‌రెడ్డి, కరకటి మల్లికార్జున్, నాసిన ప్రసాద్, తువ్వార ప్రవీణ్, బి.కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

గౌడ, మత్స్యకారుల సమస్యలు పరిష్కరిస్తా..

విడవలూరు: తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి రాగానే గౌడ, మత్స్యకారుల సమస్యలను పరిష్కరిస్తానని వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి తెలిపారు. మండల పరిధిలోని రామతీర్థం గ్రామంలో సోమవారం ఆపార్టీ జాతీయ అధికార ప్రతినిధి పోలంరెడ్డి దినేష్ రెడ్డితో కలసి ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా పాతూరు, రామలింగాపురం, గౌరీపురం, అంజనేయపురంలో ఆమె పర్యటించి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ రామతీర్థంలో సమస్యలు తాండవిస్తున్నాయని, అంతర్గత రోడ్లు, మురుగు కాలువలు పూడిపోయి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కోట్లాది రూపాయలతో నిర్మించిన పర్యాటక కేంద్రం నిరుపయోగంగా మారిందన్నారు. కల్లుగీత కార్మికులు, మత్స్యకారులను వైసీపీ ప్రభుత్వం నిలువునా మోసం చేసిందన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే కల్లుగీత కార్మికులకు శాశ్వత గుర్తింపు కార్డులు అందజేస్తామన్నారు. అదేవిధంగా ఆక్వా రైతులకు విద్యుత్ బిల్లులను తగ్గిస్తామన్నారు. చేపలు ఎండపెట్టుకునేందుకు ప్లాట్‌ఫాంలను కట్టిస్తామని తెలిపారు. ప్రమాద బీమాని పెంచి అన్నివిధాలుగా మత్స్యకారుల కుటుంబాలకు న్యాయం చేస్తామని తెలిపారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో చంద్రబాబునాయుడును ముఖ్యమంత్రిని చేయాలని, నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని, తనని గెలిపించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఆవుల వాసు, చిమటా వెంకటేశ్వర్లు, చెముకుల కృష్ణ చైతన్య, చెముకుల శ్రీనివాసులు, శ్రీహరికోట గోపి, నాటారు శీనయ్య, తాతా రమేష్, బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

మైనార్టీల సంక్షేమమే టీడీపీ ధ్యేయం


కోవూరు: మైనార్టీల సంక్షేమానికి టీడీపీ కట్టుబడి ఉందని వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. లేగుంటపాడులోని అతిథిగృహంలో సోమవారం జరిగిన మైనార్టీల సభలో ఆమె మాట్లాడారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎన్నో అభివృద్ధి పథకాలను చంద్రబాబునాయుడు ప్రవేశపెట్టారన్నారు. వైసీపీ మైనార్టీల అభ్యున్నతిని గాలికి వదిలేసిందన్నారు. మైనార్టీ సంక్షేమానికి టీడీపీకి ఓటేయాల్సిందిగా ఆమె కోరారు. తనను శాసన సభ్యురాలిగా, తన భర్త ప్రభాకరరెడ్డిని పార్లమెంటు సభ్యునిగా గెలిపించాలన్నారు. ఈ సభలో మైనార్టీల సఘం నాయకులు షేక్ బాబు, కరిముల్లా, షేక్ బాష పాల్గొన్నారు.

వేమిరెడ్డి దంపతుల గెలుపు తథ్యం

సార్వత్రిక ఎన్నికల్లో వేమిరెడ్డి దంపతుల గెలుపు తథ్యమని గౌడసంఘం జిల్లా నాయకుడు దాసరి విజయ్‌కుమార్ గౌడ్ అన్నారు. పడుగుపాడులో సోమవారం గౌడ సంఘం నాయకులు, సభ్యులు ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా సమగ్రాభివృద్ధికి కూటమి అభ్యర్థులు వేమిరెడ్డి దంపతులను గెలిపించాల్సిందిగా కోరారు. ఈ కార్యక్ర మంలో గౌడ సంఘం నాయకులు దాసరి శ్రీనివాసులుగౌడ్, దద్దోలు రవిచంద్ర గౌడ్, దాసరి విజయ్‌గౌడ్, డి వెంకటేశ్వర్లు, ఉయ్యూరు నాగరాజు గౌడ్, బండ్ల సుధీర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వేమిరెడ్డి దంపతులను గెలిపించాలని ఇంటింటి ప్రచారం

బుచ్చిరెడ్డిపాళెం: వేమిరెడ్డి దంపతులను గెలిపించాలని కోరుతూ సోమవారం మండలంలోని చెల్లాయపాళెం గ్రామం పల్లిపాళెంలో జనసేన, టీడీపీ నాయకులు మాధవ్, దండు వెంకటేశ్వర్లుతో కలిసి సూరా శ్రీనివాసులురెడ్డి, పంచేడులోని గిరిజన, దళితవాడల్లో జడ్పీటీసీ సభ్యురాలు సూరా ప్రదీప, మౌళి, బుచ్చి నగర పంచాయతీలోని 14, 15 వార్డుల్లో ఆర్‌కే రవి, చెంబేటి ప్రసాద్, బండ్ల కొండయ్య, రాధారెడ్డి, సుధీర్‌లు ఇంటింటి ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వస్తేనే రాష్ట్రంలో ప్రజలు ప్రశాంతంగా జీవిస్తారన్నారు. ఈ కార్యక్రమాలలో టీడీపీ,బీజేపీ. జనసేన నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



■ ఇంటర్వ్యూ



తిరుపతి, చంద్రగిరిపై
ప్రత్యేక దృష్టి

- ఏఎస్‌డీ సిస్టమ్‌తో దొంగ ఓటింగ్‌కు చెక్
- అంగన్‌వాడీ వర్కర్లకు పోస్టల్ బ్యాలెట్
- కలెక్టర్ ప్రవీణ్‌కుమార్

తిరుపతి (కలెక్టరేట్), మే 6 : సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి తిరుపతి, చంద్రగిరి నియోజకవర్గాలపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఎన్నికల ఏర్పాట్లపై ఆయన ఆంధ్రజ్యోతితో వివరంగా మాట్లాడారు. ఈ రెండు నియోజకవర్గాల్లో పెద్దసంఖ్యలో అభ్యర్థులు పోటీ చేస్తుండడంతో పాటు గత ఎన్నికల్లో అక్కడ చోటు చేసుకున్న సంఘటనలను దృష్టిలో పెట్టుకుని మొత్తం 671 పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్‌కు ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు. అదనపు కేంద్ర సాయుధ బలగాలను కూడా నియమిస్తున్నామని, పోలింగ్ నాడు శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తామని హెచ్చరించారు. అలాగే జిల్లావ్యాప్తంగా కూడా 711 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై కూడా ప్రత్యేక దృష్టి సారించామని చెప్పారు.13న జరగనున్న పోలింగ్‌కు సామాగ్రిని కూడా ఆయా నియోజకవర్గాలకు తరలించామని చెప్పారు. మరో మూడు రోజుల్లో స్ట్రాంగ్‌రూమ్‌లో ఉన్న ఈవీఎంలలో బ్యాలెట్ పేపర్‌ను అమర్చుతామన్నారు.ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతున్న నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల వద్ద ఎచలువపందిళ్లు, ప్రథమ చికిత్స కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. అలాగే పోలింగ్ కేంద్రాన్ని మ్యాపింగ్ చేసి దగ్గర్లో వున్న పీహెచ్‌సీకి అనుసంధానం చేస్తున్నామన్నారు. ఎవరైనా ఓటరు అస్వస్థతకు గురైతే తక్షణం పీహెచ్‌సీకి తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

ఏఎస్‌డీ సిస్టమ్‌తో దొంగ ఓట్లకు చెక్

ఈ నెల 13న జరిగే పోలింగ్‌కు సంబంధించి ఓటుహక్కును వినియోగించుకోవడానికి ఓటరు స్లిప్పులను ఇంటింటికీ బీఎల్వోల చేత పంపిణీ చేయిస్తున్నామని కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. బీఎల్వో కాకుండా ఏ ఒక్కరి చేతికి ఎన్నికల స్లిప్పులు వెళ్లాయని తెలిసినా కఠిన చర్యలుంటాయన్నారు. దొంగ ఓట్లను అరికట్టడానికి ఏఎస్‌డీ (అబ్సెంటీ, షిఫ్టెడ్, డెత్)లిస్టును బీఎల్వోలకు అందజేయడం జరిగిందన్నారు. ఈ నెల 7వ తేదీ వరకు ఓటరు స్లిప్పులు అందజేసే క్రమంలో సంబంధిత చిరునామాలో లేనివారు, చనిపోయిన, షిఫ్ట్ అయిన వారి వివరాలు నమోదు చేసుకోవడం జరుగుతుందన్నారు. 8వ తేదీకి పూర్తిస్థాయిలో ఓటర్లు ఎంత మంది ఉన్నారో తెలుస్తుందన్నారు. అయితే పోలింగ్ నాడు షిఫ్ట్ అయిన , చనిపోయిన వారి పేరుతో ఓటు వేయడానికి ఎవరైనా వస్తే క్రిమినల్ కేసులు పెడతామన్నారు. బీఎల్వో వచ్చినపుడు ఇంట్లో లేకుండా బయటకు వెళ్లిన వారు పోలింగ్ నాడు ఎపిక్‌కార్డు, కేంద్ర ఎన్నికల సంఘం సూచించిన గుర్తింపుకార్డుల్లో ఏదో ఒకటి తీసుకుని వచ్చి ఓటు వేయవచ్చన్నారు.

అంగన్‌వాడీలకు పోస్టల్ బ్యాలెట్

పోలింగ్ విధులకు ఈసారి జిల్లాలో 1,800మంది అంగన్‌వాడీ కార్యకర్తలను కూడా తీసుకున్నామని కలెక్టర్ ప్రవీణ్ కుమార్ చెప్పారు.వారు రిజర్వులో వుంటారని, అత్యవసర సమరంలో వినియోగిస్తామన్నారు.

పోలైన సర్వీస్ ఓట్లు
19503

- సత్యవేడులో పోలింగ్ కేంద్రం వద్దే నగదు పంపిణీ
- సూళ్ళూరుపేటలో ప్రలోభాలకు వైసీపీ యత్నాలు
- తిరుపతి పోలింగ్ సిబ్బందికి నాసిరకం భోజనాలు

రెండవరోజు పోలైన ఓట్లు

సెగ్మెంట్	ఎలక్షన్ డ్యూటీ ఓటర్లు	ఎమర్జెన్సీ సర్వీసుల ఓటర్లు	రెండు రోజుల్లో మొత్తం	
గూడూరు	1050	032	2103	057
సూళ్ళూరుపేట	0650	024	1565	031
వెంకటగిరి	0406	035	1646	051
తిరుపతి	1024	049	3124	090
శ్రీకాళహస్తి	0560	033	2121	069
సత్యవేడు	0356	071	1103	103
చంద్రగిరి	1251	054	3051	105
ఇతర జిల్లాల	1355	243	3833	451
మొత్తం	6652	541	18546	957



సత్యవేడులో ఓటర్లకు డబ్బులు పంచుతున్న వైసీపీ కార్యకర్తలు

తిరుపతి, మే 6 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల విధులకు హాజరు కావాల్సిన ఉద్యోగులు, ఉపాధ్యాయులు, అత్యవసర సర్వీసుల ఉద్యోగులకు నిర్వహించిన పోస్టల్ బ్యాలెట్ పోలింగ్‌లో రెండవ రోజు ఓటర్లు తగ్గుముఖం పట్టారు. తొలిరోజైన సోమవారం 12,310 మంది ఉద్యోగులు ఓటు వేయగా రెండవ రోజైన మంగళవారం 7193 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. సూళ్ళూరుపేటలో పోలింగ్ కేంద్రం వెలుపల వైసీపీ నేతలు హల్‌చల్ చేశారు. ఓటు వేయడానికి వచ్చిన ఆర్టీసీ ఉద్యోగులను, అంగన్‌వాడీ వర్కర్లను ప్రలోభ పెట్టడానికి ప్రయత్నించారు.దీనిపై ఫిర్యాదులు అందడంతో నాయుడుపేట డీఎస్పీ శ్రీనివాసులురెడ్డి చేరుకుని వైసీపీ నేతలను పోలింగ్ కేంద్రానికి వంద మీటర్ల అవతలకు పంపించివేశారు. సత్యవేడులో పోలింగ్ కేంద్రం వెలుపలే వైసీపీ, టీడీపీ నేతలతో పాటు ఓ ఇండిపెండెంట్ అభ్యర్థి అనుచరులు బహిరంగంగా పోటాపోటీగా నగదు పంపిణీ చేశారు. వైసీపీ నేతలు తమకు ఓటు వేస్తారన్న నమ్మకం వున్న ఉద్యోగులకు రూ. 2 వేల వంతున పంపిణీ చేశారు. ఇక టీడీపీ నేతలైతే ఎక్కువ మంది ఉద్యోగులకు రూ. వెయ్యి చొప్పున పంపిణీ చేయగా ఓ ఇండిపెండెంట్ అభ్యర్థి అనుచరులు మాత్రం ప్రధాన పార్టీల కంటే అధికంగా ఓటుకు రూ. 2500 చొప్పున నగదు పంపిణీ చేశారు. ముగ్గురు అభ్యర్థులకు చెందిన అనుచరులూ ఓటర్ల జాబితాలు పెట్టుకుని నగదు అందజేసి ఆయా పేర్లను టిక్ చేసుకుంటూ బిజీగా గడిపారు. కాగా పోలింగ్ కేంద్రాన్ని కలెక్టర్ ప్రవీణ్ కుమార్ సందర్శించారు.



మహిళావర్సిటీ వద్ద ఓటేసేందుకు ఫామ్ నింపుతున్న ఉద్యోగినులు

తిరుపతిలో షరా మామూలుగా వివాదాలు



ట్రాఫిక్ కానిస్టేబుల్, బీఎస్ఎఫ్ సిబ్బంది వాగ్వాదం

తిరుపతి పోలింగ్ కేంద్రంలో ఓ ట్రాఫిక్ కానిస్టేబుల్ ఓటు వేయడానికి ద్విచక్ర వాహనంలో రాగా బీఎస్ఎఫ్ సిబ్బంది అడ్డుకుని గుర్తింపు కార్డు చూపాలని ప్రశ్నించారు. ఈ సందర్భంగా మాటామాటా పెరిగి బీఎస్ఎఫ్ ఎస్ఐ ట్రాఫిక్ కానిస్టేబుల్‌పై చేయి చేసుకున్నారు. అక్కడే వున్న క్రైమ్ సీఐ కళా వెంకట్రమణ జోక్యం చేసుకుని సర్దుబాటు చేశారు. పోలింగ్ కేంద్రంలోకి మొబైల్ ఫోన్లు అనుమతించేది లేదని అధికారులు ముందే ప్రకటించినా పలువురు ఉద్యోగులు, అధికారులు మొబైల్ ఫోన్లతో వచ్చారు. బీఎస్ఎఫ్ సిబ్బంది అడ్డుకోగా వారితో వాగ్వాదానికి దిగారు. ఇండిపెండెంట్ అభ్యర్థి రంగూన్ శంకర్ తన పేరిట స్టిక్కర్ కారుకు అంటించుకుని పోలింగ్ కేంద్రం ఆవరణలోకి వెళుతుండగా బీఎస్ఎఫ్ సిబ్బంది, పోలీసులు అడ్డుకున్నారు.తిరుపతి నియోజకవర్గ పోలింగ్ కేంద్రంలో సోమవారం ఆకలితో అలమటించిన సిబ్బంది రెండవ రోజు నాసిరకం భోజనాలతో ఇబ్బంది పడ్డారు. సోమవారం రాత్రి భోజనం అర్థరాత్రి అందజేయగా మంగళవారం భోజనాలు నాణ్యంగా లేవు. వాటర్ బాటిళ్ళు కూడా సక్రమంగా అందించలేదు. చల్లటి నీరు పెట్టినా తక్కువగా పెట్టారు. మజ్జిగ ప్యాకెట్లు కూడా చాలీచాలకుండా అందజేశారు. టాయిలెట్ సదుపాయం కూడా సరిగా లేదు. దీంతో పోలింగ్ సిబ్బంది అవస్థ పడ్డారు.

హోం ఓటింగ్‌కు
విశేష స్పందన

తిరుపతి(కలెక్టరేట్), మే 6 : దివ్యాంగులతో పాటు 85ఏళ్ల దాటిన వయోవృద్ధులకోసం ఈసీ ఏర్పాటు చేసిన హోం ఓటింగ్‌కు స్పందన బాగానే వుంది. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో 1,139మంది దరఖాస్తు చేసుకోగా సోమవారం 955మంది ఓటు హక్కును వినియోగించుకున్నారని జిల్లా అధికారులు తెలిపారు. మంగళవారం కూడా మిగిలిన ఓటర్ల ఇళ్ల వద్దకు పోలింగు సిబ్బంది వెళ్లి ఓటు వేయించనున్నారు.ఇద్దరు పోలింగ్ సిబ్బంది, మైక్రో అబ్జర్వర్, వీడియోగ్రాఫర్, పోలీసుశాఖనుంచి ఒకరు హోంఓటింగ్ ప్రక్రియలో పాల్గొన్నారు. జిల్లాలో హోంఓటింగ్‌కు దరఖాస్తు చేసుకున్నవారిసంఖ్య 1,139మంది కాగా మొదటిరోజు 955మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. అయితే రెండవరోజు మంగళవారం మిగిలినవారికి హోంఓటింగ్‌కు వినియోగించుందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.



తిరుపతిలో హోంఓటింగ్‌ను పరిశీలిస్తున్న అబ్జర్వర్, ఆర్వో

ఇంజనీరింగ్ కళాశాలలో
వైసీపీ ప్రచారం



విజయసాయిరెడ్డి మాస్కులతో విద్యార్థినులు

విద్యార్థులకు సాధికారత, స్థిరత్వంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమం రాజకీయ వేదికగా మారింది. గూడూరులోని ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం యూత్ ఎంపవర్‌మెంట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా నెల్లూరు పార్లమెంటు వైసీపీ అభ్యర్థి విజయసాయిరెడ్డి హాజరయ్యారు. అయితే సమావేశంలో విద్యార్థినీ, విద్యార్థులు విజయసాయిరెడ్డి మాస్కులను ధరించడం, వేదికపై ఓ అధ్యాపకుడు విజయసాయికి ప్రచారం చేయడం, దిశ చట్టానికి చెందిన ఓ సభ్యురాలు జై జగన్, జై జగన్ అంటూ నినాదాలు చేయడం, వైసీపీ ప్రచారానికి సంబంధించిన పాటలను ప్లే చేయడంపై విమర్శలు వ్యక్తమయ్యాయి. కళాశాలలో విద్యార్థులకు నైతిక విలువలు, ఉన్నత విద్యకు సంబంధించిన విషయాలపై అవగాహన కల్పించాలే గానీ ఇలా ఓ రాజకీయపార్టీకి వేదికగా మార్చడం ఎంతవరకు సమంజసమని పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు అభిప్రాయపడుతున్నారు.

\- గూడూరు అర్బన్

ఫ్యానూ లేదు గాలీ లేదు !



జగన్ ఊదరగొడుతున్న సంక్షేమం అంతా శుద్ధ డ్రామా. నిజానికి రాష్ట్రంలో ఫ్యానూ లేదు, గాలీ లేదు.2019లో కూడా వైఎస్ బొమ్మతో జగన్ గెలిచాడు తప్ప సొంత శక్తితో కాదు.పరదాల మాటున తిరిగే జగన్ ఈసారి ఓడిపోవడానికి సిద్ధం అయ్యారు. ప్రధానికి కూడా లేనంతమంది సలహాదారులను పెట్టుకున్నారే.జాబ్ క్యాలెండర్ , డీఎస్సీ నోటిఫికేషన్‌పై వారెందుకు సలహా ఇవ్వలేదో చెప్పాలి.నిరుద్యోగుల ఆగ్రహానికి వైసీపీ బలికాక తప్పదు. ఈసారి కూటమికి 136 అసెంబ్లీ, 21 పార్లమెంటు స్థానాలు వస్తాయి.ఉత్తరాంధ్ర, గోదావరి, కృష్ణా, గుంటూరు, నెల్లూరు జిల్లాల్లో క్లీన్ స్వీప్ ఖాయం. అన్నింటా తన బొమ్మలు వేసుకుంటున్న జగన్ చివరికి సమాధిపైనా వేసుకుంటాడేమోనని నా అనుమానం.అయినా చెల్లి కట్టుకున్న పసుపు చీరపైనా కామెంట్ చేసిన జగన్ గురించి ఏం మాట్లాడతాం?

\- తిరుపతిలో ప్రచారం సందర్భంగా నటుడు పృథ్వీరాజ్

ఓటుకు రూ.2వేలు
తిరుపతిలో ప్రధాన పార్టీల నగదు పంపకాలు షురూ

తిరుపతి,మే 6 (ఆంధ్రజ్యోతి) : సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌కు వారం రోజుల గడువుండగానే తిరుపతిలో నగదు పంపకాలు మొదలయ్యాయి. ఓటర్లను మచ్చిక చేసుకునేందుకు ఓటుకు రూ.2వేల చొప్పున అందజేస్తున్నారు. పోలింగ్‌కు ముందు మళ్లీ తాయిలాలుంటాయని కూడా చెబుతూ..తమకే ఓటు వేయాలని కోరుతున్నారు. ప్రధాన పార్టీల వార్డు స్థాయి నాయకులను పక్కన పెట్టుకుని అభ్యర్థుల ముఖ్య అనుచరులు ఇంటింటికీ వెళ్లి ఓటర్లకు డబ్బులు ఇస్తున్నారు. కొన్ని చోట్ల ఒక చోట తిష్టవేసి ఓటర్లకు ఫోన్లు చేసి పిలిపించుకుని ఇంట్లో ఎన్ని ఓట్లు ఉంటే అన్ని రూ.2వేలు చొప్పున ముట్టచెబుతున్నారు. నిజానికి తొలుత రూ.500 చొప్పున పంచుదామని ఒక పార్టీ భావించింది. అయితే ప్రత్యర్థి పార్టీ ఒకేసారి రూ.2వేలు పంపిణీకి రంగం సిద్ధం చేయడంతో తప్పని పరిస్థితుల్లో బడ్జెట్‌ను పెంచుకున్నారు. నగదు తీసుకోనివారికి ఖరీదైన గిఫ్టులు కూడా ఇస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. సంఘాల సభ్యులకు మందు పార్టీలు ఇచ్చి మత్తులో ముంచుతున్నారు.అందుబాటులో లేనివారికి, కొన్ని కాలనీలకు ఆన్‌లైన్ పేమెంట్లు చేసేందుకు ఎమ్మెల్యే అభ్యర్థులు కో-ఆర్డినేటర్లను నియమించుకున్నట్టు తెలుస్తోంది. లక్ష రూపాయలకు మించకుండా ఫోన్‌పే, గూగుల్ పే ద్వారా నగదు బదిలీ అవుతున్నట్టు సమాచారం. ఒక్కో ఏజెంటు దాదాపు వంద మందికి పైగా ఓటర్లను సమీకరించి యూపీఐ యాప్‌ల ద్వారా నగదు బదిలీ చేస్తున్నట్టు సమాచారం.

● ప్రచార పర్వంలోనూ కరుగుతున్న మూటలు

రాజకీయ పార్టీలు ఎన్నికల ప్రచారంలో దూకుడు పెంచాయి. ఇంటింటి ప్రచారంలోనే పార్టీల ప్రచార బలం కనిపిస్తోంది. తిరుపతిలో ఒక్కో డివిజన్‌కు లక్ష రూపాయల చొప్పున రోజూ ఆయా రాజకీయ పార్టీలు డివిజన్ ఇన్‌చార్జికి ముట్టచెబుతున్నట్టు తెలుస్తోంది. డివిజన్‌కు సరాసరిగా 5 బూత్‌లు ఉంటే ఒక్కోబూత్‌కు రూ.20వేలు చొప్పున ఇవ్వాల్సి వస్తోంది. బూత్ ఇంచార్జులు రూ.300 నుంచి రూ.600 వరకు ఇచ్చి 30మంది ప్రచారకర్తలను పెట్టుకుంటున్నారు. ఉదయం, సాయంత్రం కలిపి రెండు గంటల పాటు జెండా పట్టుకుని ప్రచారం చేస్తారు. కొన్ని బూత్‌ల్లో అయితే ఒక పూటతోనే సరిపెట్టేసి ప్రచార కర్తలకు రూ.300 మాత్రమే ఇచ్చి మిగిలింది జేబులో వేసుకుంటున్నారు.

రేణిగుంటలో వలంటీర్ల సహకారం

రేణిగుంట, మే 6 : రేణిగుంట పట్టణంలో అయితే ప్రచారంలోనే నగదు పంపిణీ కూడా జరిగిపోతోంది.సోమవారం సాయంత్రం వైసీపీ నాయకులు రాజీనామా చేసిన వలంటీర్లు, కార్యకర్తలతో కలిసి ప్రచారం నిర్వహించారు. వలంటీర్లు చూపించిన ఇళ్లలోకి వెళ్లి డబ్బులు పంచారని సమాచారం.

తిరుపతిలో నేడు బాబు, పవన్ రోడ్‌షో






తిరుపతి, మే 6 (ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఎన్నికల ప్రచారంలో భాగంగా నేడు తిరుపతిలో రోడ్‌షో నిర్వహించి బహిరంగసభలో పాల్గొననున్నారు. మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు చంద్రబాబు తిరుపతి విమానాశ్రయం చేరుకుంటారు.హెలికాప్టర్‌లో చిత్తూరు జిల్లా పుంగనూరు వెళ్లి ఎన్నికల సభలో పాల్గొంటారు. అనంతరం హెలికాప్టర్‌లో బయల్దేరి 6.10 గంటలకు తిరిగి రేణిగుంటలోని విమానాశ్రయానికి వస్తారు. అక్కడి నుంచీ రోడ్డు మార్గాన తిరుపతి చేరుకుని లీలా మహల్ కూడలి నుంచీ దేవేంద్ర థియేటర్, మున్సిపల్ కార్యాలయ కూడలి మీదుగా నాలుగు కాళ్ళ మండపం వరకూ రోడ్‌షోలో పాల్గొంటారు. రాత్రి 7 నుంచీ 8.30 గంటల వరకూ అక్కడ జరిగే ఎన్నికల బహిరంగసభలో పాల్గొంటారు. సభ ముగించుకుని రాత్రి 9 గంటలకు హైదరాబాదు బయల్దేరి వెళ్ళనున్నారు. పవన్ కళ్యాణ్ కూడా మంగళవారం సాయంత్రం రాజమండ్రి నుంచీ విమానంలో బయల్దేరి తిరుపతి చేరుకుంటారు. అక్కడి నుంచీ చంద్రబాబుతో కలసి తిరుపతి రోడ్‌షో, బహిరంగసభల్లో పాల్గొని రాత్రికి హైదరాబాదు వెళ్లనున్నారు. ఎన్‌డీఏ కూటమిలో రెండు ప్రధాన పార్టీల అధినేతలూ కలసి రోడ్‌షో, ఎన్నికల బహిరంగసభలలో పాల్గొననుండడంతో ఆ మేరకు టీడీపీ, జనసేన పార్టీల్లో జోష్ పెరిగింది. అధినేతల పర్యటనను విజయవంతం చేయడానికి ఇరు పార్టీల నేతలూ భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు.

శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
నెల్లూరు
6
www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి జన కేతనం
మంగళవారం 7 మే 2024

కండలేరు ఎడమ కాలువ ఎత్తిపోతల పథకానికి విద్యుత్ బిల్లుల గ్రహణం పట్టుకుంది. బిల్లులు చెల్లించకపోవడంతో కండలేరులో నీరున్నా పొదలకూరు మండలంలోని 12 వేల ఎకరాలను రైతులు బీడు పెట్టుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి సొంత మండలంలోనే అన్నదాతలు సాగునీరు లేక అవస్థలు పడుతుంటే, జిల్లావ్యాప్తంగా పరిస్థితి ఏమిటని వారు ప్రశ్నిస్తున్నారు. సాగునీటి విషయమై విపక్షాలు ఆందోళన చేసినా పాలకులు, అధికారులు పట్టించుకోలేదు. దీంతో నిమ్మ, సవక, జామాయిల్, పత్తి రైతులు ఇబ్బందులు పడ్డారు.

కండలేరు ఎడమ కాలువ





- లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌కు కరెంటు చార్జీలు చెల్లించక కాలయాపన
- రెండేళ్లుగా ఆగిన కండలేరు లైనింగ్ పనులు
- సాగునీరు అందక బీడుగా 12వేల ఎకరాలు
- రైతులను ముంచిన పాలకులు
- జగనా... ఇదేనా రైతు సంక్షేమం?

'ఎత్తిపోతల'కూ షాక్!


రూ.68 కోట్లతో పథకం

సర్వేపల్లి నియోజకవర్గంలోని పొదలకూరు, వెంకటాచలం, మనుబోలు, ఆత్మకూరు నియోజకవర్గంలోని చేజర్ల, వెంకటగిరి నియోజక వర్గంలోని సైదాపురం మండలాల రైతులకు సాగునీరందించేందుకు 2016లో టీడీపీ ప్రభుత్వం రూ.68కోట్లతో ఎత్తిపోతల పథకాన్ని నిర్మించింది. కండలేరు ఎడమ కాలువకు నీరు మళ్లిస్తే సుమారు 20,704 ఎకరాలకు అధికారికంగా, మరో 4వేల ఎకరాలకు అనధికారికంగా సాగునీరందించేలా పథకాన్ని రూపొందించారు. మూడు నెలలుగా వర్షాలు లేక నిమ్మ, మామిడి, సవక, పత్తి పైర్లు ఎండిపోతున్నాయి. ఈ విషయాన్ని పలుమార్లు రైతులు మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి, ఉన్నతాధికారులకు విన్నవించినా పట్టించుకోలేదు. ప్రస్తుతం కండలేరు జలాశయంలో 13.8 టీఎంసీల నీరు నిల్వ ఉంది. విద్యుత్ బిల్లులు చెల్లించి పంటలకు నీరందించాలని వేడుకుంటున్నా రైతుల మొర ఆలకించే నాథుడే కరువయ్యాడు. గత టీడీపీ హయాంలో డెడ్‌స్టోరేజీ ఉన్న సమయంలో కూడా లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా నీటిని అందించిన నిమ్మ చెట్లను కాపాడిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందని రైతులు అంటున్నారు.

పొదలకూరు, మే 6 : వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యుత్ బిల్లులు చెల్లించపోవడంతో అప్పులు చేసి పంటలు సాగు చేసిన రైతులంతా భారీగా నష్టపోయారు. నీటిని విడుదల చేయాలని రైతులు ఆందోళన చేసినా కనికరించలేదు. ఎన్నికలు సమీపించడంతో మభ్యపెట్టేందుకు కొన్ని రోజుల క్రితం నీరు విడుదల చేశారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

రెండేళ్లుగా ఆగిన పనులు

తెలుగుగంగ పథకంలో భాగమైన కండలేరు ఎడమ కాలువ లైనింగ్ పనులు ఏడు నెలలుగా ఆగిపోయాయి. ఈ కాలువ ద్వారా మూడు మండలాల్లోని 32 చెరువులకు నీరు అందడంతోపాటు, 27వేల ఎకరాలకు నీరందుతోంది. తెలుగుగంగ హైలెవల్ స్లూయిజ్ నుంచి కనుపూరు కాలువ వరకు ఈ లైనింగ్ పనులకు రూ.39.12 కోట్లు మంజూరయ్యాయి. ఈ మేరకు మంత్రి కాకాణి గత నెలలో పనులు ప్రారంభించారు. ప్రస్తుతం పులికల్లు స్పిల్‌వే దాటి, నరసింహ కండ్రిగ గ్రామ సమీపం వరకు పనులు (సుమారు 55 శాతం) చేశారు. మిగిలిన పనులను అసంపూర్తిగా వదిలేశారు. ఈ కాలువ లైనింగ్ పనులు పూర్తయితే ఆయకట్టు విస్తీర్ణం రెట్టింపు అయ్యే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం కాలువకు 350 క్యూసెక్కుల నీటిని మాత్రమే విడుదల చేసే సామర్థ్యం ఉండగా, లైనింగ్ పనులు పూర్తయితే 455 క్యూసెక్కుల నీటిని విడుదల అవకాశం ఉంటుంది. రెండేళ్లుగా వైసీపీ ప్రభుత్వం రైతుల ఆశలను అడియాశలు చేస్తూనే వస్తుంది. మంత్రి కాకాణి ప్రత్యేక చొరవ చూపు ఉంటే ఎప్పుడో లైనింగ్ పనులు పూర్తయ్యేవని, కమీషన్ మీద ఉన్న శ్రద్ధ లైనింగ్ పనులపై లేదని మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి విమర్శిస్తూనే ఉన్నారు.



కండలేరు ఎడమ కాలువ లైనింగ్ పనులు

పంటలు ఎండుతున్నా.. పట్టించు కోలేదు !



కండలేరు లిఫ్ట్ ఇరిగేషన్‌కు మంత్రి కాకాణి కరెంటు బిల్లులు రూ.9 కోట్లు కట్టలేకపోయారు. ఆయన సొంత మండలంలో పంటలు ఎండిపోతుంటే పట్టించుకోలేదు. రైతులకు సరైన సమయంలో నీరిచ్చి ఉంటే నిమ్మ, సవక, మామిడి, పత్తి రైతులకు మేలు జరిగేది. ఐదేళ్లపాటు కాలం గడిపేశారు. రైతులే త్వరలో బుద్ధి చెబుతారు.

- నెట్టెం పెంచలయ్య, నిమ్మరైతు, వావింటపర్తి

మూడేళ్లుగా పూర్తి కాని పనులు



ఏడాదిలో పూర్తి చేయాల్సిన కండలేరు ఎడమ కాలువ లైనింగ్ పనులను మూడేళ్లుగా చేస్తూనే ఉన్నారు. నాయకుల కమీషన్ కోసం లైనింగ్ పనులు చేస్తున్నారు. పనులు పూర్తి చేయకుండా ఇంకా అసంపూర్తిగా పెట్టడం సిగ్గుచేటు. ఈ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాల్సిన సమయం ఆసన్నమైంది.

- కోడూరు పెంచలభాస్కర్‌రెడ్డి, రాష్ట్ర రైతు సంఘం నాయకుడు, మొగళ్లూరు

క్షుద్రపూజల వస్తువుల కంటే మోసం చేసే నాయకులతోనే హాని

- రోడ్డు వేయలేని వారికి మళ్లీ ఓట్లు వేయాలా!?
- అల్లూరులో వినూత్న రీతిలో టీడీపీ నిరసన



ముగ్గువేసి, అందులో నిమ్మకాయలు, కోడిని ఉంచి నిరసన వ్యక్తం చేస్తున్న టీడీపీ నాయకులు

అల్లూరు, మే 6 : క్షుద్రపూజల్లో వినియోగించే నల్లకోడి, నిమ్మకాయ, పసుపు కుంకుమలను సమాజానికి ఎటువంటి హానీ తలపెట్టవని, అయితే, నమ్మించి ఓట్లు వేయించుకొనే మోసపూరిత నాయకుల వల్లే సమాజానికి తీవ్ర హాని అని విశ్రాంత ప్రిన్సిపాల్, టీడీపీ నాయకుడు మేడా రామకృష్ణారెడ్డి తెలిపారు. కావలి, కోవూరు నియోజకవర్గాల సరిహద్దు ప్రాంతమైన పైడేరు వద్ద సోమవారం సాయంత్రం గుంతలమయమైన రాజుపాలెం-ఇస్కపల్లి రోడ్డును చూపుతూ నాయకులు వినూత్న నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ నాలుగేళ్లుగా రోడ్డు దుస్థితి కారణంగా వాహనదారులు అవస్థలు పడ్డారన్నారు. నమ్మించి ఓట్లు వేయించుకొని పదవులు పొంది లగ్జరీ కార్లలో తిరుగుతూ మనల్ని పట్టించుకోని నాయకుల వల్ల ప్రమాదమని కావలి, కోవూరు ఎమ్మెల్యేలు రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి, నల్లపరెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డి, నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డిలను ఉద్దేశించి మాట్లాడారు. ఈ నెల 13న జరిగే ఎన్నికల్లో ప్రజలు ఆలోచనతో సైకిల్ గుర్తుకు ఓటు వేసి ఇటువంటి దుస్థితి నుంచి విముక్తి పొందేలా మంచి నాయకులను ఎన్నుకోవాలని కోరారు. ఈ నిరసనలో నాయకులు అరగల రమణయ్య, కప్పిర విష్ణు, రామకృష్ణారెడ్డి, పోట్లూరు శీనయ్య, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ఏమైంది నిఘా!



ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులు ఖర్చుచేసే ప్రతి రూపాయిని వ్యయ పరిశీలకులు నిఘా ఉంచి లెక్కించనున్నారు. ఇందుకుగాను ఈ ఏడాది కొత్తగా విజిలెన్స్ అధికారుల కారుపై సీసీ కెమెరా అమర్చారు. అయితే అభ్యర్థులు తమ ప్రచారంలో విచ్చలవిడిగా లక్షలాది రూపాయలు ఖర్చు చేసినా, విజిలెన్స్ అధికారులు మాత్రం చూసీచూడనట్లు వ్యవహ రిస్తున్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఎంపీ అభ్యర్థి రూ.95లక్షలు, ఎమ్మెల్యే అభ్యర్థి రూ.40 లక్షలు మాత్రమే ఖర్చు పెట్టాలి. అయితే ప్రధానపార్టీ అభ్యర్థులు ర్యాలీలు, విజయోత్సవ సభలకు రోజుకు రూ.లక్షల్లో చేస్తున్నా నిఘా నేత్రాలకు మాత్రం కానరావడం లేదు.

- కలిగిరి

బస్సులు పెడుతున్నాం.. బయలు దేరండి !



ఈ సార్వత్రిక ఎన్నికలు అధికార, ప్రతిపక్ష పార్టీలకు ప్రతిష్ఠాత్మకంగా మారాయి. ఎన్నడూ లేని విధంగా వలస ఓటర్లను సైతం తీసుకు వచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. గతంలో స్థానిక సంస్థల ఎన్నికలకు మాత్రమే వలస ఓటర్లను తీసుకువచ్చే వారు. ఈసారి ఎంత ఖర్చయినా గెలుపే ప్రధానమని అభ్యర్థులు చెబుతున్నారు. అందుకే వలస ఓటర్లకు ఫోన్ చేసి ఇక్కడకు రప్పించే ప్రయత్నాలు చేస్తు న్నారు. దూర ప్రాంతాల్లో ఉన్న వారి కోసం బస్సులు ఏర్పాటు చేస్తున్నారు. కందుకూరు నియోజకవర్గం వారు ఎక్కువగా హైదరాబాద్, చెన్నై, విజయవాడ, బెంగళూరు, తిరుపతి, పూణే, వైజాగ్ తదితర పట్టణాలలో స్థిరపడ్డారు. వారందరికీ ఫోన్లు చేసి బస్సులు పెడుతున్నాం... ఓట్లు వేయడానికి రావాలని ఆహ్వానిస్తున్నారు. బస్సులు ఏర్పాటు చేయనిచోటుకు ప్రయాణ ఖర్చులకు డబ్బులు పంపుతున్నారు. ఇక్కడకు వచ్చాక మిగతా విషయాలు మాట్లాడతామని తెలియజేస్తున్నారు.

- వలేటివారిపాలెం

నాడు హుందాతనం.. నేడు గోల గోల !



నేడు ఎన్నికల ప్రచారమంటే చెవులు తూట్లు పడేలా మైకుల గోల.. బాణసంచా పేలుళ్ల శబ్దాలు.. డప్పుల మోతలు.. భారీగా అలంకరించిన ప్రత్యేక ప్రచార రథాలు... డీజే బాక్సులే... ఇవి లేకుంటే ప్రచారం అనిపించు కోదేమో అన్నట్లు ఉంటున్నాయి. ఉదయం నుంచి రాత్రి 10గంటల దాకా ఆటోల్లో మైకులతో ప్రత్యర్థులపై విమర్శలు, అభ్యర్థుల సొంత డబ్బాలతో చెవులు తూట్లు పడేలా ఉపన్యాసాలు ఉంటున్నాయి. అదే తొలినాళ్లలో ఎన్నికల ప్రచారం నిశ్శబ్దంగా ఉండేది. ఏదైనా పార్టీ అభ్యర్థి నలుగురితో కలిసి ఇంటింటికి వెళ్లి ఓటు వేయమని ప్రచారం చేసేవారు. అలాగే వివాహ ఆహ్వాన పత్రిక మాదిరిగా అభ్యర్థి గుణగణాలు తెలిపే కరపత్రాన్ని ముద్రించి ఇంటింటికి పంచేవారు. దాంతో ప్రచారం పూర్తయినట్లే.

- ముత్తుకూరు

'నన్ను గెలిపించండి.. అధికారంలోకి వచ్చాక గోపాలమిత్రలకు సరైన న్యాయం చేస్తాను... నమ్మండి... నన్ను దీవించండి'...అని జగన్ మోహన్‌రెడ్డి ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు అన్నమాటలివి. ఐదేళ్ల కిందట వారికిచ్చిన హామీ దేవుడెరుగు ..కనీసం గౌరవ వేతనంతోపాటు ప్రోత్సాహకాలు కూడా సక్రమంగా అందించని పరిస్థితి నేడు నెలకొంది. దీంతో జగన్ మమ్మల్ని నమ్మించి మోసం చేశారంటూ గోపాలమిత్రలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గోపాలమిత్రల గోడు పట్టదా ?

- ఉద్యోగ భద్రత హుళక్కే...
- ఏడాదిగా అందని ప్రోత్సాహకాలు

నెల్లూరు (వ్యవసాయం), మే 6: ప్రతిపక్షనేతగా పాదయాత్ర సమయంలో గోపాలమిత్ర లకు అండగా ఉంటామని, గౌరవ వేతనం రూ.16,000లు చేస్తామంటూ హామీ ఇచ్చిన జగన్‌రెడ్డి, ఐదేళ్లుగా ఒక్క రూపాయి కూడా పెంచలేదు. 2006లో గోపాలమిత్ర వ్యవస్థ మొదలైంది. అప్పట్లో వీరికి దాదాపు రూ.1,200ల గౌరవ వేతనం ఇస్తూ మూడు నెలలపాటు శిక్షణ ఇచ్చారు. అనంతరం నెలకు రూ.3,500లకు పెంచారు. 2018లో టీడీపీ ప్రభుత్వంలో చంద్రబాబు వీరికి రూ.6,500లు గౌరవ వేతనం ఇచ్చారు. ప్రారంభంలో వీరు పాడిరైతుల ఇంటికి వెళ్లి సేవలందించేవారు. ఇది ఎంతో ఉపయోగకరంగా ఉండేది. అయితే గోపాలమిత్రలకు రూ.16వేలు గౌరవ వేతనం ఇస్తామంటూ హామీఇచ్చి అధికారంలోకి వచ్చిన జగన్ ప్రభుత్వం ఆ ఊసే మరచిపోయింది. రైతు భరోసా వ్యవస్థను ఏర్పాటు చేసి తమను పూర్తిగా విస్మరించారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పశువులకు ఏదైనా జబ్బు చేస్తే వైద్యులకంటే ముందుగా వెళ్లి ప్రథమ చికిత్స చేసేది గోపాలమిత్రలే. అంతేకాక ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయిలో అందించేది వారే. ప్రభుత్వ పథకాలైన కృత్రిమ గర్భధారణ, వైద్య సేవలు, డీవార్మింగ్, వ్యాక్సినేషన్లలో వీరు ఎంతో కీలకంగా పనిచేస్తున్నా గుర్తింపు లేదు. క్షేత్రస్థాయిలో పాడి అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్న వీరిని ప్రభుత్వం విస్మరించింది. గౌరవ వేతనం కూడా మూడు నెలలకు ఒక సారి అందుతోందని, అదికూడా అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరిగితే బిల్లులు పెడుతున్నారంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రోత్సాహకాలూ కరువే..



క్షేత్రస్థాయిలో పశువులకు వైద్యసేవలందించే తమను ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయి. ఉద్యోగ భద్రత కల్పిస్తామని సీఎం ఇచ్చిన హామీ నెరవేరలేదు. ఏళ్లుగా సేవలందిస్తున్న తమను నిర్లక్ష్యం చేయడం సరికాదు. గత మూడు నెలలుగా గౌరవ వేతనాలు రాలేదు. అదే మని ఎన్నికలు అయిన తరువాత ఇస్తామంటూ సమాధానం ఇస్తు న్నారు. జిల్లాలో దాదాపు 109 మంది గోపాలమిత్రలు సేవలం దిస్తున్నారు. వారికి గత ఏడాది కాలంగా కనీసం ప్రోత్సాహకాలు కూడా ఇవ్వలేదు. ఒక్కొక్కరికి సరాసరి కనీసం రూ.2వేలకు పైగా ప్రోత్సాహకాలు రావాల్సి ఉంది. ప్రభుత్వాలు తమను గుర్తించాల్సిన అవసరం ఉంది.

- సర్వేపల్లి వెంకటేశ్వర్లు, గోపాలమిత్ర

మూడు నియోజకవర్గాల్లోని ప్రాంతాల కలయికతో ఏర్పాటు


ఓసారి కాంగ్రెస్, రెండుసార్లు వైసీపీ విజయం

భిన్నవర్గాల సెగ్మెంట్

నెల్లూరు రూరల్

నెల్లూరురూరల్, మే 6 : 2009లో అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజనలో జిల్లాలోని రాపూరు, అల్లూరు నియోజకవర్గాలను తొలగించారు. కొత్తగా నెల్లూరు రూరల్ నియోజకవర్గాన్ని ఏర్పాటు చేశారు. నెల్లూరు నగరంలోని కొన్ని మున్సిపల్ డివిజన్లతోపాటు, రాపూరు నియోజకవర్గంలోని 17 గ్రామాలు, సర్వేపల్లిలోని 16 గ్రామపంచాయతీలతో కలిపి నెల్లూరురూరల్ సెగ్మెంట్‌ను రూపొందించారు. ఈ మూడు సెగ్మెంట్లను కలుపుకుని ఏర్పాటుకాగా విభిన్నవర్గాల నియోజకవర్గంగా ఇది పేరొందింది. ఇక్కడ నుంచి మొదటి ఎమ్మెల్యేగా కాంగ్రెస్ నుంచి ఆనం వివేకానందరెడ్డి పోటీ చేసి గెలుపొందారు. ఆ తరువాత 2014, 19 ఎన్నికల్లో వైసీపీ నుంచి పోటీ చేసిన కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఎమ్మెల్యేగా గెలుపొందారు. కాగా 2009లో సీపీఎంకి టీడీపీ మద్దతు పలికింది. 2014లో బీజేపీ అభ్యర్థి సన్నపురెడ్డి సురేష్‌రెడ్డికి టీడీపీ జైకొట్టింది. 2019 ఎన్నికల్లో టీడీపీ తరఫున బరిలోకి దిగిన అబ్దుల్ అజీజ్ ఓటమిపాలయ్యారు. వ్యవసాయ పరంగా డెల్టా, నాన్‌డెల్టాతోపాటు నెల్లూరు సిటీ నియోజకవర్గం కంటే విస్తీర్ణంలో పెద్దదిగా ఉంది. బీసీవర్గాలతోపాటు ముస్లింల ఓటర్లు ఇక్కడ కీలకం. నెల్లూరు సిటీకి లభించే సహజవనులన్నీ రూరల్లో నియోజకవర్గంలోనే ఉన్నాయి. నగర గ్రామ దేవత ఇరగాల పరమేశ్వరిదేవి రూరల్లోనే కొలువుతీరి ఉన్నారు. కమ్యూనిస్టులకు జిల్లాలోనే ఈ నియోజకవర్గ పంచాయతీల్లోనే కొంత పట్టుంది. ప్రస్తుతం 26 మున్సిపల్ డివిజన్లు, 18 గ్రామ పంచాయతీలతో ఈ నియోజకవర్గం విస్తరించి ఉంది.

ముఖచిత్రం





నెల్లూరు రూరల్ సెగ్మెంట్ వ్యూ

జన కేతనం

మంగళవారం 7 మే 2024

ప్రచార పంపకాల్లో చిలక్కొట్టుడు



దీపం ఉండగానే ఇల్లు చక్కదిద్దుకోవాలనే తీరుగా ఇక్కడి పార్టీల నాయకులు వ్యవహరిస్తున్నారు. ఎన్నికల్లో దొరికినకాడికి సంపాదించుకోవాలని తాపత్రయపడుతున్నారు. ఓట్ల కొనుగోలు కంటే ముందుగానే ప్రచార పర్వంలో ఇందుకు తెర లేపారు. ప్రచారానికి ఇస్తున్న సొమ్ములో కొందరు నాయకులు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. పట్టణ వార్డుల్లో ప్రజాప్రతినిధులకు ప్రచార బాధ్యతలు అప్పగించారు. వీరు రోజూ వార్డులో 20మంది చొప్పున తిప్పాల్సి ఉంటుంది. బూత్ కన్వీనర్, (రాజీనామా చేసిన) వలంటీర్ ఇందులో పాల్గొంటారు. జెండాలు పట్టుకుని తిరిగేవారికి రోజుకు రూ.300 చొప్పున, వలంటీరుకు, బూత్ కన్వీనరుకు రూ.500 ఇవ్వాల్సి ఉంటుంది. ఉదయం టిఫిన్, సాయంత్రం స్నాక్స్ కూడా పెట్టాలి. అయితే కొంతమంది ప్రజాప్రతినిధులు ప్రచార వ్యయంలో కొంతసొమ్ము జేబులో వేసుకుంటున్నారని భోగట్టా. తమకిచ్చే మొత్తంలో కోతలు పెట్టడంతో ప్రచారానికి వచ్చిన వారు ప్రజాప్రతినిధులను నిలదీస్తున్నారు. వారి ఇళ్లకు వెళ్లి పంచాయతీ పెడుతున్నారు. విషయం ఆ నోటా ఈనోటా తెలుసుకుంటున్న ఇన్‌ఛార్జిలు వార్డు ప్రజాప్రతినిధుల తీరుపై మండిపడుతున్నారని సమాచారం.

- రేణిగుంట

ఇదీ మందు — ఎన్నికల డ్యూటీనా..వద్దు బాబోయ్

ఎలక్షన్ డ్యూటీ అంటేనే ఉద్యోగులు విసుక్కుంటున్నారు. 2019 నాటి రెమ్యునరేషనే ఇప్పుడు కూడా చెల్లించాలని ఎన్నికల కమిషన్ ఇచ్చిన ఉత్తర్వులు చూసి పెదవి విరుస్తున్నారు. జిల్లాలో దూర ప్రాంతాల్లో విధులు నిర్వర్తించాల్సిన ఉద్యోగులు ఇదెక్కడి శిక్ష అంటూ తెగ బాధ పడిపోతున్నారు. ఎన్నికల ప్రిసైండింగ్ అధికారి, కౌంటింగ్ సూపర్‌వైజర్‌కు రోజుకు రూ.350 చెల్లిస్తారట. నాలుగో తరగతి ఉద్యోగులకయితే రూ.200, వీడియో సర్వైలెన్సు టీముకు రూ.1200, వీడియో వ్యూయింగ్, అకౌంటింగ్ టీములకు రూ.1000 చెల్లిస్తామనడంతో వారంతా బిక్కముఖం వేస్తున్నారు. కంట్రోల్ రూము, కాల్‌సెంటర్ స్టాఫ్, మీడియా సర్టిఫికేషన్ మానటరింగ్ కమిటీ సిబ్బందికి భత్యం ఇంకా తక్కువ. రోజుకు రూ.200 మాత్రమే. పోలింగ్ విధులకు హాజరయ్యే పోలీసు, మొబైల్ పార్టీ సిబ్బందికి, హోంగార్డులకు, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లకు లంచ్‌ప్యాక్‌తో పాటు రూ.150 చెల్లిస్తారట. ఇదేమూలకూ సరిపోదని సిబ్బంది గొణుక్కుంటున్నారు. ఇక ఓట్ల లెక్కింపు రోజు లంచ్ కింద రూ.150 చెల్లిస్తామనడంతో ఉద్యోగులు గగ్గోలు పెడుతున్నారు. కష్టమైన ఎన్నికల విధులకు హాజరయ్యే వారికి ఇంత తక్కువ రెమ్యునరేషన్ చెల్లించడం దారుణమంటున్నారు. మరోపక్క తమకు కూడా ఎన్నికల డ్యూటీ వేసి రూ.250 చెల్లిస్తామంటే దూరాభారం పోయొదెలా అని అంగన్‌వాడి కార్యకర్తలు ప్రశ్నిస్తున్నారు.




- తిరుపతి (నేరవిభాగం)



బాపనయ్యా..శెభాషయ్యా..

87 ఏళ్ల బాపనయ్యలో ఉత్సాహం ఓటెత్తింది కదూ.. అవును పడకగదికే పరిమితమైన అతడు సోమవారం ఓటేశాడు. కాలు కదపకుండానే తన ఓటు హక్కు వినియోగించుకున్నాడు. అన్ని అవయవాలు పనిచేస్తున్నా, పరిస్థితులన్నీ అనుకూలించినా ఓటేయని బద్ధకస్తులకు బాపనయ్య స్ఫూర్తిగా నిలిచాడు. 85ఏళ్లు దాటి పోలింగ్ బూత్‌కు రాలేని వృద్ధులకూ, దివ్యాంగులకూ ఈసారి ఎన్నికల కమిషన్ కల్పించిన హోం ఓటింగ్ సౌకర్యాన్ని ఇతను వినియోగించుకున్నాడు. తిరుచానూరుకు చెందిన బాపనయ్య 1970 నుంచీ క్రమం తప్పకుండా ఓటేస్తున్నాడు. అనారోగ్యకారణంగా పన్నెండేళ్లుగా కదలలేకపోతున్నాడు. ఓటు వేయలేకపోతున్నానని దిగులు పడేవాడు. కానీ ఈసారి ఎన్నికల సంఘం కల్పించిన హోం ఓటింగ్ పుణ్యమాని ఇంటికే సిబ్బంది వచ్చి రహస్య పద్ధతిపై ఓటేయించుకున్నారు. ఓటేశాక బాపనయ్య పొందిన ఆనందం అంతా ఇంతా కాదు.

- తిరుపతి(కలెక్టరేట్)



"చూస్తూ ఉండండి ఇక్కడొక గొప్ప పట్టణం ఏర్పడబోతోంది. ఇక్కడే ఆర్బీకే సెంటరు, ఇక్కడే హెల్త్ క్లినిక్, ఇక్కడే సెక్రటేరియట్, ఇక్కడే కళ్యాణమండపం, ఇక్కడే పార్కులు, స్కూళ్లు, ఇక్కడే ఆటో స్టాండు, ఇక్కడే జనతా బజారు.. ఈ ప్లాన్ చూస్తే ముచ్చటేస్తోంది. రాష్ట్రంలోనే మోడల్ కాలనీ ఇది"

- 2020 డిసెంబరు 28న ఊరందూరులో జగనన్న ఇళ్ల కాలనీల పథకాన్ని ప్రారంభిస్తూ సీఎం హోదాలో జగన్‌మోహన్‌రెడ్డి చెప్పిన మాటలు ఇవి.

"అప్పట్లో, నవాబుల కాలంలో ఒక పట్టణం కట్టాలంటే 500 ఏళ్లు పట్టేది. శ్రీకాళహస్తి 25వేల ఇళ్లున్న పట్టణంగా అభివృద్ధి చెందడానికి 500 ఏళ్లు పట్టింది. ఇప్పుడు జగనన్న పట్టణం.. జేసిటీ కేవలం ఒకటిన్నర ఏళ్లలో ఇక్కడ ఏర్పడబోతోంది."

- అదే రోజున అదే సభలో శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదనరెడ్డి చెప్పిన గొప్పలు ఇవి.

మరి వాస్తవం ఎలా ఉంది?

జగనన్న పాలనలాగే ఉంది!



ఆంధ్రజ్యోతి - తిరుపతి/శ్రీకాళహస్తి

జేసిటీ అను జగన్ చూపిన సినిమా

మూడేళ్లు దాటినా ముప్పయి కుటుంబాలు కూడా లేని ఊరందూరు మోడల్ కాలనీ

మోడల్ జగన్ సిటీ

- **ఎక్కడ:** ఊరందూరు సమీపంలో
- **విస్తీర్ణం:** 157 ఎకరాలు
- **ఇళ్ల పట్టాలు:** 4,953
- **ఇచ్చినవి:** 4,304

మూడేళ్ల నాలుగు నెలల తర్వాత స్థితి

- **నిర్మాణం అయినవి:** 1,240
- **స్లాబ్ దాకా వచ్చినవి:** 1,760
- **పునాదులకే పరిమితం:** 1,200
- **ఇటుక పడనివి:** 753
- **నివాసం ఉన్న ఇళ్లు:** 10



జే సిటీ ఇలా ఉంది..

కనీస మౌలిక సదుపాయాలు లేవు. కాలనీ మొత్తం బురదతో కూడిన రోడ్లే అధికంగా కనిపిస్తున్నాయి. కరెంట్, నీటి సరఫరా లైన్లు కొన్ని వీధులకే పరిమితమయ్యాయి. కొన్ని ఇళ్లు చెట్లు, రాళ్ల మధ్య ఉండిపోయాయి. లేఅవుట్ మొత్తం పూర్తయితే కానీ డ్రైనేజ్ వ్యవస్థను ఏర్పాటు చేయడం సాధ్యం కాదని అధికారులు చేతులెత్తేశారు. లబ్ధిదారుల ఆప్షన్ మేరకు ప్రభుత్వమే కట్టిన ఇళ్లు పగుళ్లతో భయపెడుతున్నాయి. సమీపంలో ఉన్న పరిశ్రమల్లో పనిచేసే వ్యక్తుల అసాంఘిక కార్యక్రమాలకు ఈ ప్రాంతం అనువుగా మారింది. జగన్ శంఖుస్థాపన చేసిన ప్రదేశంలోనే మద్యం తాగుతున్నారు. ఆ ప్రాంతమంతా మద్యం బాటిళ్లు, పొగాకు ఉత్పత్తి ప్యాకెట్లతో నిండిపోయి కనిపిస్తోంది. తలుపులు, కిటికీలు లేని ఈ ఇళ్లు వ్యభిచారానికి అనువుగా మారిపోయాయి. దీంతో ఊరికి దూరంగా ఉన్నా సొంత ఇల్లు కదా అనే ఆశతో ఉన్న ఉపాధిని వదిలి వచ్చి ఇళ్లు కట్టుకున్నవారి పరిస్థితి దారుణంగా ఉంది. ఇక్కడ నివాసం ఉండలేమని నిర్ణయించుకుని దూరంగా అద్దె ఇళ్లలో ఉండాల్సి వస్తోంది.





ఇక్కడ ఇల్లు కట్టుకోవడం కరెక్టేనా...

సొంతిల్లు వచ్చిందని కదా అని సంబరపడ్డాం. ప్రభుత్వం కట్టిన ఇళ్లు సరిపోకపోవడంతో సొంత డబ్బుతోనే ఇల్లు కట్టుకుంటున్నా. నీళ్లు లేవు. ఇంటి నిర్మాణానికి కూడా నీళ్లులేక అవస్థ పడుతున్నాం. మనుషులే లేని ఈ కాలనీలో ఇల్లు కట్టుకోవడం కరెక్టేనా అనిపిస్తోంది. అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదు.

- సుబ్రహ్మణ్యం, లబ్ధిదారుడు



ఎటు చూసినా బురద మడుగులే



తలుపులు, కిటికీలు లేని మోడల్ కాలనీలోని ఇళ్లు



పునాదులు దాటనివెన్నో!

ఈ డబ్బుతో ఇల్లెలా సాధ్యం?

ఇల్లు కట్టుకోవడానికి ఇస్తున్నది రూ.1.50 లక్షలు. ఉపాధి హామీ పథకం కింద మరో రూ.30 వేలు కలిపి రూ.1.80 లక్షలు ఇస్తున్నారు. ఆపై ఒక్క రూపాయి కూడా ప్రభుత్వం ఇవ్వడం లేదు. ఆ నిధులు కూడా సక్రమంగా విడుదల చేయడం లేదు. జారీ చేసిన నిధుల వరకే కాంట్రాక్టర్లు ఇళ్లు నిర్మించి వెళ్లిపోయారు. నిజానికి మార్కెట్‌లో నిర్మాణ సామగ్రి ధరలు చుక్కల్లో ఉన్నాయి. ప్రస్తుత ధరలను బట్టి చదరపు అడుగుకు రూ.1,500 నుంచి రూ.2 వేలు ఖర్చు అవుతోంది. కానీ ప్రభుత్వం ఇస్తున్నది రూ.662 మాత్రమే. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రభుత్వం ఇచ్చిన డిజైన్ ప్రకారం ఇల్లు నిర్మించాలంటే దాదాపు రూ.5 లక్షల పైమాటే. అంటే మిగిలిన సొమ్మును పేదలు అప్పు చేసి తీసుకురావాల్సిన పరిస్థితి నెలకొంది. సొంతింటి కలను ఎలాగైనా నెరవేర్చుకోవాలనే తపనతో కొందరు అప్పులు తెచ్చి వేలకు వేలు వడ్డీలు కడుతున్నారు. వీళ్లను చూసిన కొందరు బేస్మెంట్ లెవల్‌లోనే వదిలేసి వెళ్లిపోయారు. మొత్తం మీదుగా 'జే సిటీ' పేదల కలలకే పరిమితం అయ్యింది.

విజనరీ నేత నాయకత్వం కోసం..

నేను సైతం...

మాది తొట్టంబేడు మండలం పొయ్యి గ్రామంలో రైతు కుటుంబం. నేను చదువుకునే రోజుల్లో నాటి సీఎం చంద్రబాబునాయుడు విజన్-2020 గురించి చెబుతుండేవారు. భవిష్యత్ గురించి ఆయన విజన్ అర్థమయ్యేది. డిగ్రీ తర్వాత శ్రీకాళహస్తిలోని ప్రైవేటు స్కూలులో కొన్నాళ్లు పనిచేశాను. రూ.1000 జీతం వచ్చేది. ఐటీ రంగంతో ఉద్యోగ విప్లవం వస్తుందనే చంద్రబాబు మాటల స్ఫూర్తిగా కష్టపడి 2000లో తిరుపతి ఎస్వీఆర్ట్స్ కళాశాలలో ఎమ్మెస్సీ చదివాను. వెంటనే బెంగళూరులో ఉద్యోగం వచ్చింది. అక్కడ నుంచి అమెరికాలోని చికాగోలో అవకాశమొచ్చింది. 14 ఏళ్లుగా అక్కడే స్థిరపడ్డాను. నెలకు రూ.10లక్షల జీతం. అట్టడుగు నుంచి ప్రారంభమైన నా జీవితం ఉన్నత స్థాయికి చేరిందంటే చంద్రబాబు చలవేనంటాను. ఐటీ అభివృద్ధికి ఆయన చేసిన కృషి వల్లే నాలాంటివారెందరి బతుకులో బాగుపడ్డాయి. వైసీపీ పాలనలో ఈ ఐదేళ్లుగా రాష్ట్రం అధోగతి పాలవుతోందని తెలిసి చాలా బాధ కలుగుతోంది. అందుకే రాష్ట్ర భవిత కోసం మళ్లీ చంద్రబాబు అధికార పగ్గాలు చేపట్టాల్సిన అవసరం ఉందని భావించాను. అందుకోసం ఆయన తరఫున ప్రచారం చేయాలని స్వస్థలం వచ్చాను. నేనేకాదు.. చంద్రబాబు విజనరీ కృషి ఫలితంగా ఉద్యోగాలు పొందిన 1200 మంది అమెరికా నుంచి వచ్చాం. నియోజకవర్గాల వారీగా సొంత ప్రాంతాల్లో ప్రజా చైతన్యానికి కృషి చేస్తున్నాం. అప్పుల పాలైన రాష్ట్రాన్ని తిరిగి గాడిలో పెట్టి అభివృద్ధికి బాట వేసే శక్తి చంద్రబాబునాయుడికే ఉందని యువతకు వివరిస్తున్నాం.



- బి.త్రివేది కుమార్,ఎన్నారై

- శ్రీకాళహస్తి

అభయాంజనేయా..అనుగ్రహించు



సెంటిమెంట్

పన్నంగాడు ఆంజనేయస్వామిని దర్శించుకుంటున్న టీడీపీ నాయకులు (ఫైల్)

రాజకీయ నాయకులకు సెంటిమెంట్లు ఎక్కువ. కీలకమైన ఎన్నికల సమయంలో మరీనూ. అడుగుతీసి అడుగు వేయాలంటే ఇష్ట దైవానుగ్రహాన్ని స్మరణకు తెచ్చుకోనిదే కదలరు. మామూలు రోజుల్లో అంతగా పట్టని సెంటిమెంట్లకు ఎన్నికల్లో మాత్రం అగ్రాసనమేస్తారు. సూళ్లూరుపేట నియోజకవర్గంలో ప్రచారం మొదలుపెట్టాలంటే నేతలంతా ఈశాన్యం సెంటిమెంట్ పాటించి తీరతారు. తడ మండలానికొచ్చే సరికి రాష్ట్ర సరిహద్దు పన్నంగాడు వద్ద ప్రసన్న ఆంజనేయస్వామిని దర్శించుకున్నాకే అడుగు ముందుకేస్తారు. అక్కడ నుంచే ప్రచారం మొదలుపెడతారు. దైవ నమ్మకమొక్కటే కాదండోయ్..కొన్నిసార్లు తడ మండల ఓట్ల మెజార్టీయే విజయావకాశాలను నిర్ణయిస్తుందని అభ్యర్థుల లెక్క. 2014లో వైసీపీ సుమారు 3,672 ఓట్ల మెజార్టీతో గెలవడంలో తడ మండలం కీలకంగా వ్యవహరించింది. దీంతో పార్టీల నాయకులు ఇప్పటికే ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. -తడ



ఈ గ్లాస్ 'గుర్తు'ండాల్సిందే..

థర్టీ ఇయర్స్ ఇండస్ట్రీ అనే డైలాగ్‌తో సుపరిచితమైన సినీ నటుడు ప్రథ్వీ సోమవారం తిరుపతిలో సందడి చేశారు. జనసేన అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు పక్షాన తిరుగుతూ ఓట్లు అభ్యర్థించారు. ఓ చిన్న అంగడిలో టీ తాగి తర్వాత అదే గ్లాసు చూపిస్తూ ఈ గుర్తుకే మీ ఓటు వేయాలని ఆ చిరువర్తకుడ్ని కోరుతూ కాసేపు హాస్యం పండించారు.

- తిరుపతి

పక్కా నాన్‌లోకల్ నియోజకవర్గం

సండింగ్ స్నాప్‌షాట్




సత్యవేడును వలస నియోజకవర్గంగా మార్చేశారనే మనోవేదన ఇక్కడి ప్రజల్లో దశాబ్దాలుగా ఉంది. సత్యవేడుకు ప్రాతినిధ్యం వహించిన ఎమ్మెల్యేల్లో అత్యధికులు నాన్ లోకలే. కేవలం ఇద్దరు లోకల్స్‌కు మాత్రమే సత్యవేడు ఎమ్మెల్యే అయ్యే అవకాశం వచ్చింది. లోకల్స్‌లో 1985, 1994లో గెలిచిన ఎం.సురాజన్ ఒకరు కాగా ప్రస్తుతం టీడీపీ అభ్యర్థిగా పోటీలో ఉన్న ఆదిమూలం మరొకరు. సురాజన్ స్వగ్రామం సత్యవేడు మండలం సిరుణంబుదూరు. ఆదిమూలం స్వగ్రామం నియోజకవర్గంలోని నారాయణవనం మండలం భీమునిచెరువు. ఇక నాన్‌లోకల్ చరిత్రను పరిశీలిస్తే.. 1962లో జరిగిన మొట్ట మొదటి ఎన్నికల్లో గెలుపొందిన కాంగ్రెస్ అభ్యర్థి తుంబూరు బలకృష్ణది పుత్తూరు. 1967లో గెలుపొందిన స్వతంత్ర అభ్యర్థి కఠారి మునస్వామిది అప్పటి నెల్లూరు జిల్లాలోని సూళ్లూరుపేట. 1972, 1978, 1989ల్లో గెలుపొందిన కాంగ్రెస్ అభ్యర్థి సి.దాస్ మదనపల్లి వాసి. 1983లో గెలుపొందిన టీడీపీ అభ్యర్థి తలారి ఆదిత్య మనోహర్‌ది గుడిపాల. 1999లో గెలిచిన టీడీపీ అభ్యర్థి ఎన్.శివప్రసాద్‌ది చంద్రగిరి. 2004లో గెలుపొందిన కాంగ్రెస్ అభ్యర్థి నారాయణస్వామిది కార్వేటినగరం. 2009లో ఎన్నికైన తెలుగుదేశం అభ్యర్థి హేమలత స్వస్థలం తూర్పు గోదావరి. 2014లో గెలిచిన తలారి ఆదిత్యది గుడిపాల. ఇలా పక్కా నాన్‌లోకల్ నియోజకవర్గంగా మారిన సత్యవేడుకు ఈసారి వైసీపీ నుంచి పోటీ చేస్తున్న నూకతోటి రాజేష్ కూడా నాన్ లోకల్. జీడీ నెల్లూరు నియోజకవర్గంలోని విజంలక్ష్మిరెడ్డిపల్లి ఈయన స్వస్థలం. నివాసం మాత్రం తిరుపతిలో.

- సత్యవేడు

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

సాఫీగా హోం ఓటింగ్



చిన్నన్నపేటలో హోం ఓటింగ్‌ను పర్యవేక్షిస్తున్న అధికారులు

చిల్లకూరు, మే 6: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి పోలింగ్ కేంద్రాలకు రాలేని వృద్ధులు, దివ్యాంగులకు ఈ దఫా ఇంటి వద్దే ఓటు హక్కును వినియోగించుకునే సదుపాయాన్ని ఈసీ కల్పించింది. చిల్ల కూరు మండలంలో 16 ఓట్లకు 13 పోలైనట్లు ఎంపీడీవో భాను మూ ర్తిరావు తెలిపారు. అదేవిధంగా గూడూరు పట్టణంలో హోమ్ ఓటింగ్‌కు సంబంధించి 51మంది దరఖాస్తు చేసుకోగా 41 మంది వినియో గించుకున్నట్లు మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు తెలిపారు. గూడూరు మండలంలో 12 మంది దరఖాస్తు చేసుకోగా ఏడుగురు ఓటు హక్కును వినియోగించుకున్నట్లు ఎంపీడీవో రాజశేఖర్‌రావు తెలిపారు.

వెంకటగిరిలో 54 మంది...

వెంకటగిరి టౌన్: వెంకటగిరి మండలంలో 54మంది ఇంటి వద్దే ఓటు వేశారు. 57మంది దరఖాస్తు చేసుకోగా ఇద్దరు మరణించారు. వల్లివేడుకి చెందిన సి.వెంకటాద్రి డయాలసిస్ కోసం వెళ్లడంతో ఆయన ఓటు హక్కు వినియోగించుకోలేక పోయారని ఎంపీడీవో నీలకంఠారెడ్డి తెలిపారు. కాగా ఫ్లయింగ్ స్క్వాడ్‌కు ఎన్నికల విధులు కేటాయించడంతో వాహన తనిఖీకి పర్యవేక్షణ లేకుండా పోయిందని విమర్శలు వినిపిస్తున్నాయి. కలెక్టర్ హోం ఓటింగ్‌కు ఎంపీడీవో, ఈవోపీఆర్డీని వెళ్లాలని ఆదేశాలు జారీనా అమలు కాలేదు.

కోట: మండల పరిధిలోని విద్యానగర్, చెందోడు, రామాపురం, వంజివాక, గ్రామాల్లో 85 సంవత్సరాలు దాటిన ఆరుగురు వయో వృద్ధులు సోమవారం ఇంటి వద్దనే తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్టు ఎంపీడీవో మంగళం శంకరయ్య చెప్పారు.

సూళ్లూరుపేట: నియోజకవర్గంలో 69 వృద్ధులకు 67 మంది, 111 మంది దివ్యాంగులకు గాను 105 మంది హోం ఓటు హక్కు విని యోగించుకొన్నారు.

పోస్టల్ బ్యాలెట్ ప్రలోభాలకు వైసీపీ నాయకుల యత్నం

సూళ్లూరుపేట, మే 6: పట్టణంలోని వీఎస్ఎస్‌సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ కేంద్రం వద్ద రెండో రోజు కొంతమంది వైసీపీ నాయకులు రెండో రోజు ఉద్యోగులకు ప్రలోభాల ఎర వేసేందుకు తీవ్రంగా ప్రయత్నించారు. ఫెసిలిటేషన్ కేంద్రానికి 100 మీటర్ల లోపే అధికార పార్టీ నాయకులు తిరుగుతూ ఆర్టీసీ, అంగన్వాడీల ఉద్యోగులకు ఓటు వేయాలని అభ్యర్థిస్తూ తిరగడం విశేషం. కొంతమంది ఉద్యోగులు కూడా అధికార పార్టీ నాయకులతో తిరుగుతూ కన్పించారు. 100 మీటర్ల దూరం లోపలే తిరుగుతున్నా పోలీసులు కూడా పట్టించుకోలేదు. అనంతరం ఎన్నికల అధికారులకు కొంతమంది ఫిర్యాదు అందడంతో పోలీసులు అక్కడికి చేరుకొని వైసీపీ నాయకులను పంపించేశారు.



ఫెసిలిటేషన్ కేంద్రం వద్ద వైసీపీ నాయకులను పంపిస్తున్న పోలీసులు

రెండో రోజు ప్రశాంతంగా పోస్టల్ బ్యాలెట్

గూడూరు అర్బన్/వెంకటగిరి/సూళ్లూరుపేట, మే 6: సార్వత్రిక ఎన్నికల విధులకు హాజరు కానున్న ఉద్యోగుల కోసం నిర్వహిస్తున్న పోస్టల్ బ్యాలెట్ సోమవారం రెండో రోజు ప్రశాంతంగా జరిగింది. జడ్పీబాలుర ఉన్నత పాఠశాల ఫెసిలిటేసన్ సెంటర్‌లో ఓట్లు వేశారు. మొత్తం 2627 ఓట్లకు గానూ 2103 ఓట్లు పోలవడంతో 80 శాతం ఓటింగ్ నమోదైంది. మంగళవారం కూడా ఈ ఎన్నికల ప్రక్రియ కొనసాగనుంది. వెంకటగిరి పట్టణంలో పోస్టల్ ఓట్ల పోలింగ్ ప్రభుత్వ డిగ్రీకళాశాలలో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రంలో సోమవారం పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. నియోజకవర్గ పరిదిలోని ఆరు మండలాలు, మున్సిపాల్టికి సంబంధించి మొత్తం 1792 పోస్టల్ బ్యాలెట్ ఓట్లకుగాను ఆదివారం 1240 ఓట్లు పోలయ్యాయి. సోమవారం మిగిలిన 802 పోస్టల్ బ్యాలెట్ ఓట్లుకు గాను 444 మంది తమ ఓటు హక్కును వినియోగించుకొన్నారు. మంగళవారం పోలింగ్ కొనసాగనుంది. సూళ్లూరుపేట పట్టణంలోని వీఎస్ఎస్‌సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పోస్టల్ బ్యాలెట్ రెండో రోజు సోమవారం ప్రశాంతంగా ముగిసింది. రెండు రోజుల్లో 1596 మంది ఉద్యోగులు తమ ఓటు హక్కును విని యోగించుకున్నట్లు ఆర్వో చంద్రమని తెలిపారు. 1817 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు ఉండగా 87.83 శాతం ఓటింగ్ నమోదైంది. ఓటింగ్ సరళిని జిల్లా ఎన్నికల అధికారి ప్రవీణ్ కుమార్ పరిశీలించారు. నాయుడుపేట డీఎస్పీ శ్రీనివాసులు రెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పైంది.



సూళ్లూరుపేట ఫెసిలిటేషన్ సెంటర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

ఉత్తమ క్రీడాకారులుగా ఎదగాలి

గూడూరు, మే 6: గ్రామీణ యువకులు నైపుణ్యాలను పెంపొందించుకుని ఉత్తమ క్రీడాకారులుగా ఎదగాలని నెల్లూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ మాజీ కార్యదర్శి శ్రీనివాసులురెడ్డి అన్నారు. ఏఆర్రెడ్డి ప్రభుత్వ స్టేడియంలో గూడూరు క్రికెట్ క్లబ్ ఆధ్వర్యంలో నెల్లూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ సహకారంతో క్రికెట్ శిక్షణ ఉచిత శిబిరాన్ని ప్రారంభించారు. మునిగిరీష్, సురేంద్రనాథరెడ్డి, జుల్కర్, నవాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్ ఈవీఎంల కమిషనింగ్

సూళ్లూరుపేట, మే 6: సూళ్లూరుపేట జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూంలో తిరుపతి పార్లమెంట్‌కు సంబంధించి ఈవీఎంల కమిషనింగ్ సోమవారంనిర్వహించారు. సింబల్ లోడింగ్ జరిగింది. ఈ కమిషనింగ్ ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి ప్రవీణ్‌కుమార్ పరిశీలించారు. మొత్తం 304 పోలింగ్ కేంద్రాల్లో 44 టేబుల్స్ ఏర్పాటు రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో గుర్తులను పొందుపరిచారు.

రాజకీయాలంటే రౌడీయిజం కాదు... అభివృద్ధి, సంక్షేమం

● ఓజిలి, నాయుడు పేట మండలాల్లో ముమ్మరంగా టీడీపీ ప్రచారం





అత్తివరంలో ప్రచారం చేస్తున్న పరసా- ప్రచార రథంపై అభ్యర్థి విజయశ్రీ

ఓజిలి, మే 6: ప్రజల అభివృద్ధి వారి సంక్షేమం కోసం రాజకీయాలు చేయాలే కానీ రౌడీయిజం, దౌర్జన్యం, దోపిడీ కోసం కాదని సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం, మాజీ మంత్రి పరసారత్నం, నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి నెలవల విజయశ్రీ అన్నారు. ఓజిలి మండలం అత్తివరం, కుందాం, ఇనుగుంట, ఆరిమేనిపాడు పంచాయతీల్లో విస్తృతంగా ప్రచారం చేపట్టారు. ఆయా గ్రామాల్లో వారు మాట్లాడుతూ... ప్రజాదర్బారు కూల్చివేతతో ప్రారంభించిన వైసీపీ దోపిడీ, అరాచక పాలనకు ఈ ఎన్నికలతో ముగింపు పలకాలన్నారు. సీఎంగా చంద్రబాబును గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. అభివృద్ధి, సంక్షేమంతో రాష్ట్రాన్ని ముందుకు తీసుకువెళ్లిన టీడీపీని ప్రజలు ఆదరిస్తున్నార రని తెలిపారు. ప్రస్తుతం జరుగుతున్న పోస్టల్ బ్యాలెట్ తీరు తమ పార్టీ విజయానికి నాందిగా మారిందన్నారు. పార్టీ కన్వీనరు విజయకుమార్‌నాయుడు, నాయుడుపేట, ఏఎంసీ మాజీ చైర్మన్ ఎస్.విజయభాస్కర్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆర్.కృష్ణయ్య, నాయకులు గున్నం మధురెడ్డి, కనుమూరు గోపాల్‌రెడ్డి, ఎద్దల ధనుంజయరెడ్డి, ఆశా చెంకుకృష్ణయ్య, శ్రీనివాసులురెడ్డి, దాసరి నిరంజన్, పి.వెంకటసుబ్బయ్య, ఎస్.కె.ఖలీల్, సతీష్‌చంద్ర, కమలాకర్‌బాబు, ఫణీంద్రారెడ్డి, కె.సత్యవరప్రసాద్‌రావు, ఈశ్వరరాజు, కె.వేణు, మన్మథరావు, అశోక్‌రాజు, శేఖర్‌రెడ్డి వెంకురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారత చంద్రబాబుతోనే...

నాయుడుపేట: మహిళల సాధికారత టీడీపీ ప్రభుత్వ హయాంలోనే జరిగిందని ఏఎంసీ మాజీ చైర్మన్ శిరసనంబేటి విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. నాయుడుపేటలో సోమవారం నాయుడుపేట మాజీ సర్పంచ్ జి.ప్రభావతమ్మ, మున్సిపల్ వైస్‌చైర్మన్ 786 రఫి, చెందేటి సుజాతమ్మ ఆధ్వర్యంలో గాంధీమందిరం సెంటర్, శంఖరాపురం, రజకకాలనీలో ఇంటింటా ప్రచారం చేపట్టారు. టీడీపీ అధికారంలోకి వస్తే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 3 గ్యాస్ సిలిండర్లు ఉచితం, గృహిణికి రూ.1500, పింఛన్ 4వేలు, కుటుంబంలో బడికి వెళ్లే ప్రతి బిడ్డకు రూ.15వేలు అందిస్తారన్నారు. సూళ్లూరుపేట టీడీపీ అభ్యర్థి డాక్టర్ నెలవల విజయశ్రీని భారీ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. నెలవల రాజేష్, ఎ.సుధీర్, మీన, డి.రాజేంద్ర, వి.శోభన్‌నాయుడు, పృథ్వీ, తిరుమలరావు, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.



ప్రచారంలో విజయభాస్కర్‌రెడ్డి, ప్రభావతమ్మ, రఫి తదితరులు

ఎవరూ చేయని అభివృద్ధి చేసి చూపిస్తా: వరప్రసాద్





గ్రామస్తులతో వెలగపల్లి వరప్రసాద రావు - పాశం సునీల్‌తో కలసి వరప్రసాద్ ఎన్నికల ప్రచారం

సూళ్లూరుపేట/ వాకాడు, మే 6: సూళ్లూరుపేట నియోజకవర్గంలో ఇంత వరకు ఎవరూ చేయనటువంటి అభివృద్ధిని చేసి చూపిస్తానని తిరుపతి బీజేపీ ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాద రావు అన్నారు. సోమవారం సూళ్లూరుపేట మండలం కొరిడి, పేర్నాడు పంచాయతీల్లో ఆయన ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఓట్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గత పాలకులు, ఎమ్మెల్యేలు ఈ ప్రాంత అభివృద్ధికి చేసింది ఏమీ లేదన్నారు. తీరప్రాంతాల్లో మౌలిక వసతులు దారుణంగా ఉన్నాయన్నారు. తాను గెలిచిన వెంటనే ఏడాది లోగా పులికాట్ సరస్సు ముఖద్వారాన్ని పూడిక తీయించడమే కాకుండా మెరుగైన రోడ్లను నిర్మిస్తానని హామీ ఇచ్చారు. గతంలో ఎంపీ నిధులతో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేశానన్నారు. సాగునీటి సమస్య పరిష్కరిస్తానని, అటవీ ఆంక్షలు ఉన్న ప్రాంతాల్లో అర్ధంతరంగా నిలిచిపోయిన పనులను పూర్తి చేయిస్తానని హామీ ఇచ్చారు. వైసీపీ ప్రభుత్వంలో ఎటువంటి అభివృద్ధి జరగలేదని, అవినీతి, అక్రమాలే ధ్యేయంగా పనిన ఆ పార్టీకి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఆయనతోపాటు బీజేపీ నాయకులు ఆరణి విజయభాస్కర్‌రెడ్డి, ఆదినారాయణరెడ్డి, భాస్కర్‌రెడ్డి, గోపాలకృష్ణ, రామ్మోహన్‌రెడ్డి, టీడీపీ నాయకులు కొక్కు శంకరయ్య, రాజసులోచనమ్మ, మహేష్ స్థానిక నాయకులు పాల్గొన్నారు.

చిట్టమూరు, వాకాడుల్లో...

తిరుపతి బీజేపీ ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాద రావు వాకాడు, చిట్టమూరు మండల నాయకులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. గూడూరు టీడీపీ అభ్యర్థి పాశం సునీల్‌కుమార్ టీడీపీ నాయకురాలు పనబాక లక్ష్మితో కలసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎన్డీఏ కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. అవినీతి ప్రభుత్వానికి చరమగీతం పాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వారితోపాటు పలువురు టీడీపీ, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

వెంకటగిరి ప్రజలకు అండగా నిలుస్తా

టీడీపీ అభ్యర్థి కురుగొండ్ల రామకృష్ణ





గిలకపాడు వైసీపీ నాయకులను టీడీపీలోకి ఆహ్వానిస్తున్న కురుగొండ్ల - గిద్దలూరు ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న కురుగొండ్ల రామకృష్ణ

వెంకటగిరి/ డక్కిలి, మే 6: వైసీపీ పాలనలో దోపిడీకి గురైన ప్రజలకు విముక్తి కల్పిస్తానని టీడీపీ అభ్యర్థి కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. సోమవారం రాత్రి గిద్దలూరులో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వైసీపీ పాలనలో వెంకటగిరి బాగా వెనుకబడిందన్నారు. టీడీపీ హయాంలో మొదలు పెట్టిన ఆల్తూరుపాడు సాగునీటి ప్రాజెక్టును గాలికొదిలేశారని మండిపడ్డారు. ప్రస్తుతం ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడే పరిస్థితులు ఎదురయ్యాయన్నారు. పదేళ్ల తాను ఎమ్మెల్యేగా పని చేశానని అక్రమంగా ఒక్క పైసా కూడా కూడబెట్టలేదన్నారు. ప్రజల అభిమానాన్ని సంపాదించుకున్నానని చెప్పారు. అందుకే తాను ఎక్కడికి ప్రచారానికి వెళ్లినా నియోజకవర్గ ప్రజలు ఆదరిస్తున్నారన్నారు. వారి ఆదరణే తనకి శ్రీరామ రక్షగా ఈ ఎన్నికల్లో విజయం సాధించబోతున్నట్లు తెలిపారు. తాను ఏ గ్రామానికి వెళ్లినా ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని అదేసమయంలో తాము ఈ ఐదేళ్ల పడిన ఇబ్బందులను తన దృష్టికి తెస్తున్నారన్నారు. ఎక్కడ చూసినా నీటి దందా పెరిగిపోయింది. ప్రభుత్వ ఆసుపత్రిల్లో సరైన సదుపాయాలు లేక రోగులు ఇబ్బంది పడుతున్నా పట్టించుకునే నాథుడే లేడని బాధితులు తనతో వాపోయారని చెప్పారు. పెరిగిన నిత్యావసర ధరలతో ఒక్క పూటకూడా తృప్తిగా భోజనం చేయలేక పోతున్నామని పలువురు తనతో చెప్పారన్నారు. పేదలు వారి స్థాయికి మించి అభిమానం చూపుతున్నారని ఆ రుణం తీర్చుకుంటానని చెప్పారు. తన కోసం కష్టపడి పనిచేసే ప్రతి ఒక్కరిని గుర్తుంచుకుంటానన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జాతీయ ఉపాధ్యక్షురాలు వీఆర్ లక్ష్మీశ్యామల, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి జి.నాగేశ్వరరావు, బీజేపీ నాయకుడు కోలా ఆనంద్, ఎన్.రమణారెడ్డి, మోహన్ క్రిష్ణారెడ్డి, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిక

రాపూరు మండలం గిలకపాడు గ్రామానికి చెందిన పసుపులేటి పెంచలయ్య, ఓసూరు రమణయ్య, ఓసూరు శివశంకర్, అంకయ్యతో పాటు 20 వైసీపీ కుటుంబాలకు చెందిన వారు టీడీపీ సీనియర్ నాయకులు ఆరికట్ల మస్తాన్ నాయుడు ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. వీరందరని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ అభ్యర్థి కురుగొండ్ల రామకృష్ణ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.



వెంకటగిరి పట్టణంలోని తన నివాసంలో రూరల్ టీడీపీ శ్రేణులతో సమావేశమైన కురుగొండ్ల లక్ష్మీసాయిప్రియ

గంజాయి కేసులో ఒకరికి జైలుశిక్ష

గూడూరు, మే 6: గంజాయి కేసులో ఓ వ్యక్తికి సోమవారం నెల్లూరులోని ఏడీజే కోర్టులో న్యాయమూర్తి 3 సంవత్సరాలు జైలు శిక్ష, రూ.10వేల జరిమానా విధించినట్లు సెబ్ సీఐ రమేశ్ తెలిపారు. గాంధీనగర్‌లో గత ఏడాది జూలై 12న జయదీప్ అనే వ్యక్తి 1100 కిలో గంజాయిని కలిగివుండడంతో అప్పటి సెబ్ సీఐ విజయ్‌కుమార్ నిందితుడి ని అరెస్ట్ చేసి కేసు నమోదు చేశారన్నారు. ఈ కేసుకు సంబంధించి ఇరు పక్షాల వాదనల అనంతరం న్యాయమూర్తి శిక్షను విధించారు. ఏపీపీ రమణారెడ్డి వాదనలు వినిపించారని తెలిపారు.

టీడీపీలోకి కొనసాగుతున్న వలసలు



వాకాడు/గూడూరు, మే 6: గూడూరు నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పాశం సునీల్‌కుమార్‌కు మద్దతుగా పలువురు పార్టీలో చేరుతున్నారు. సోమవారం తూపిలి మాజీ సర్పంచు వి.ద్వారకానాథ్ రెడ్డి తన అనుచరులు పి.చంద్రయ్య, రమణయ్య, కిశోర్, రవి తదితరులలో కలిసి టీడీపీలో చేరారు. వా రందరినీ పాశం సునీల్‌కుమార్ పార్టీ కండువాలను కప్పి ఆహ్వానించారు. కల్లూరు పంచాయతీ సిద్దిగుంటపాళేనికి చెందిన హరీశ్‌నాయుడు తన అరుచరులతో టీడీపీలో చేరారు. కల్లూరులో డి.జనార్దన రెడ్డి ఆధ్వర్యంలో పలువురు పార్టీలో చేరారు. అలాగే గూడూరు పట్టణంలో పాశం సునీల్ కుమార్ సమక్షంలో చిల్లకూరు మండలం కలవకొండ, కోట మండలం ఉత్తమనెల్లూరు లకు చెందిన పలువురు టీడీపీలో చేరగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

సకాలంలో వైద్యం అందించండి

నాయుడుపేట టౌన్, మే 2: ప్రభుత్వ వైద్యశాలల్లో వైద్యం అందించడంలో నిర్లక్ష్యం వహిస్తే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్ కమిషనర్ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. నాయుడుపేట సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం కమిషనర్ వెంకటేశ్వర్లు ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. మొదటగా ఉన్న వార్డుల్లో వైద్యం పొందుతున్న రోగులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. తరువాత ల్యాబ్‌లో రోజువారి టెస్టుల జాబితాను ఆయన పరిశీలించారు. టెస్టులు అనుకున్న లక్ష్యం ప్రకారం లేకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. అనంతరం వైద్యాధికారి చంద్రకళకు పలు సూచనలు చేశారు.

దుర్మార్గ పాలకులను సాగనంపండి

చిట్టమూరు, మే 6: జగన్ దుర్మార్గపు పాలనకు ప్రజలు సాగనంపాలని గూడూరు ఎమ్మెల్యే అభ్యర్థి పాశం సునీల్‌కుమార్ సతీమణి సంధ్యారాణి అన్నారు. సోమవారం టీడీపీ మండల కన్వీనర్ జి.కిషోర్‌నాయుడు ఆధ్వర్యంలో చిట్టమూరు, కొత్తగుంటల్లో ఆమె ప్రచారం నిర్వహించారు. నా ఎస్సీలు, నా బీసీలంటూ సీఎం జగన్ ఆ వర్గాలను మోసం చేశారన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు విజయంపైనే రాష్ట్ర భవిష్యత్తు ఆధారపడి ఉందన్నారు. బాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలు ప్రతి ఒక్కరికి అందుతాయని వివరించారు. జి.గోపాల్‌నాయుడు, బాబునాయుడు, పి.శ్రీనివాస్, అశోక్‌నాయుడు, మధు నాయుడు, బషీర్, సర్పంచ్ కోటయ్య, సుధ, నాగరాజు, రాకేష్, శ్రీను, సురేష్, బాలకృష్ణ తదితరులు ఉన్నారు.

బెదిరింపులకు పాల్పడితే సహించం

పెళ్లకూరు, మే 6: మండలంలో వైసీపీకి చెందిన ఓ ముఖ్యనేతతో పాటు మరి కొందరు నాయకులు... తమ పార్టీ నాయకులు, కార్యకర్తలతో బెదిరింపు ధోరణిలో వ్యవహరిస్తున్నారని, ఇది సమంజసం కాదని టీడీపీకి చెందిన దళిత నాయకులు, నాయుడుపేట ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ పి.పోలయ్య సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. పచ్చని పల్లెల్లో ప్రశాంత జీవనం గడుపుతున్న ప్రజల్లో భయాందోళనలు సృష్టించి బెదిరింపులకు పాల్పడుతున్న వైసీపీ నాయకులకు రానున్న ఎన్నికల్లో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారన్నారు.

కూటమి మేనిఫెస్టోతో సకల జనులకు మేలు





వాకాడు మండలంలో మాట్లాడుతున్న పాశం సునీల్‌కుమార్- చిట్టమూరులో ప్రచారం నిర్వహిస్తున్న సునీల్‌కుమార్ సతీమణి సంధ్యారాణి

వాకాడు, మే 6: కూటమి మేనిఫెస్టోతో సకల జనులకు మేలు జరుగుతుందని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పాశం సునీల్‌కుమార్ అన్నారు. మండలంలోని కొండాపురం, కాశీపురం, గొల్లపాళెం, కల్లూరు, ముట్టెంబాక, తూపిలి, కోడివాక, తిరుమూరు పంచాయతీల్లో సోమవారం సునీల్‌కుమార్, బీజేపీ ఎంపీ అభ్యర్థి వరప్రసాదరావు, కేంద్ర మాజీ మంత్రి పనబాక లక్ష్మి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు ఆయా గ్రామాల్లో వారికి బ్రహ్మరథం పట్టారు. సునీల్‌కుమార్ మాట్లాడుతూ... టీడీపీ, బీజేపీ, జనసేన మేనిఫెస్టో జనాదరణ పొందిందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 18 ఏళ్లకు మించిన ఉన్న మహిళలకు రూ.1500 ఆర్థికసాయం, ఏడాది మూడు గ్యాస్‌సిలిండర్లు ఉచితం, పొదుపు సంఘాల మహిళలకు వడ్డీ లేని రుణాలు, 50 ఏళ్లకు పించను, వృద్ధులకు, వితంతువులుకు రూ.4వేలు, దివ్యాంగులకు రూ. 6వేలు ఇలా ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయన్నారు. రానున్న ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల గుర్తుపై బటన్ నొక్కితే జగన్‌కు జ్వరం రావాలన్నారు. కార్యక్రమంలో దువ్వూరు మధుసూదన్‌రెడ్డి, ఉచ్చూరు ప్రసాద్‌రెడ్డి, ఉచ్చూరు మల్లికార్జున్‌రెడ్డి, పాపారెడ్డి పురుసోత్తంరెడ్డి, తీగల సురేశ్, తుమ్మల మోహన్‌నాయుడు, వేణునాయుడు, గోపినాయుడు, కమలాకర్‌నాయుడు, మేరిగ కాంచన్, చరణ్‌రెడ్డి, రాజయ్య, మల్లిరెడ్డి, జనార్ధన్‌రెడ్డి, కృష్ణమూర్తి, ప్రమీల, దయాకర్, మొహిద్దీన్, రమణయ్య, శ్రీహరి, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

డీఎస్పీ సూర్యనారాయణరెడ్డిపై చర్యలు తీసుకోవాలి.... వైసీపీ వీర విధేయుడిగా గూడూరు నియోజకవర్గంలో గుర్తింపు పొందుతున్న డీఎస్పీ సూర్యనారాయణ రెడ్డితోపాటు ఇద్దరు సీఐలు, ఎస్ఐపై చర్యలు తీసుకోవాలని టీడీపీ సునీల్‌కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం జరిగిన పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌లో వైసీపీ నాయకులు డబ్బులు పంచుతూ ఉండగా టీడీపీ నాయకులు గుర్తించి అడ్డుకుంటే వైసీపీ నాయకులను వదలి టీడీపీ నాయకులను అరెస్ట్ చేయడం ఎన్నికల నియమావళికే హేయమన్నారు. వైసీపీ చొక్కాలు వేసుకుని జగన్‌రెడ్డికి ఊడిగం చేయడం సబబుకాదన్నారు. జరిగిన సంఘటనపై కలెక్టర్, ఎస్పీ, ఎన్నికల కమిసన్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు.



గూడూరులో సునీల్‌కుమార్ తనయుడు జశ్వంత్‌కుమార్ ప్రచారం